ఆంధ్రభూమి

సంపుటి: 29 . సంచిక: 249 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | గురువారం 8 ఫిబ్రవరి, 2018 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥
ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం,
కృష్ణపక్షం; తిథి: అష్టమి మ.1.07;
నక్షత్రం: విశాఖ సా.5.09;
వర్జ్యం: రా.9.27 నుండి 11.10 వరకు
దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు, తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు



సఫారీలపై సవారీ

దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఘన విజయం సాధించింది. సారథి విరాట్ కోహ్లీ (160 నాటౌట్) పరుగుల వరద సృష్టించి భారత్‌కు అపూర్వ విజయాన్ని అందించాడు. ఆరు వన్డేల సిరీస్‌లో 3-0 ఆధిక్యంతో భారత్ దూసుకెళ్తోంది. 7



ముద్దు మృతి తీరని లోటు

గవర్నర్, చంద్రబాబు, జానారెడ్డి సంతాపం

భౌతికకాయం చిత్తూరుకు తరలింపు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 7: తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ముద్దుకృష్ణమనాయుడు ఆకస్మిక మరణం పట్ల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, ఏపీ సీఎం చంద్రబాబు, టి కాంగ్రెస్ నాయకుడు, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కె జానారెడ్డి, వైకాపా అధ్యక్షుడు, ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. ముద్దుకృష్ణమ ఇకలేరనే వార్తను తట్టుకోలేకపోతున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. ఆయన లేని లోటు చిత్తూరు జిల్లాకే - మిగతా 6వ పేజీలో



ఇక జమిలి ఎందుకు? మీ తర్వాత మేమే అని అగ్రిమెంట్ రాసుకుందాం!!

దేశ విభజన మీ పాపమే

ఇంకా మూల్యం చెల్లిస్తూనే ఉన్నాం • నెహ్రూ ప్రధాని ఎలా అయ్యారో తెలీదా?

• మీరా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడేది • అవినీతిపై చర్యలకు కంగారుపడతారెందుకు?

• మీ నినాదాలతో వెనక్కితగ్గే మనిషిని కాదు • లోక్‌సభలో కాంగ్రెస్‌పై విరుచుకుపడిన మోదీ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ మూలంగానే 1947లో దేశ విభజన జరిగిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. నరేంద్ర మోదీ బుధవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు బదులిస్తూ కాంగ్రెస్‌పై ముప్పేటదాడికి దిగారు. కాంగ్రెస్ దేశ ప్రయోజనాలను పక్కనపెట్టి కేవలం కుటుంబ ప్రయోజనాల పరిరక్షణకు పని చేసిందని దుమ్మెత్తిపోశారు. కాంగ్రెస్ అనుసరించిన తప్పుడు విధానాల మూలంగానే దేశం రెండుగా విడిపోయిందన్నారు. దేశ విభజనను ఆమోదించటం ద్వారా నింపిన విషం మూలంగా ఇప్పటికీ దేశం కష్టాలు అనుభవిస్తోందని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు కాంగ్రెస్ చేసిన పాపాలకు ఈనాడూ దేశం మూల్యం చెల్లిస్తోందని మోదీ అన్నారు. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మూలంగానే దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లిందంటూ ప్రతిపక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, నెహ్రూ మూలంగా దేశంలో ప్రజాస్వామ్యం నెలకొన్నదనడం సత్యదూరమన్నారు. కొన్నివేల సంవత్సరాల క్రితం బౌద్ధం పరిఢవిల్లినప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం నెలకొందని, లిచ్చవి పాలనలో ప్రజాస్వామ్యం ఉందని మోదీ తనదైన ధోరణిలో చరిత్రను ఉటంకించారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం మంచిది కాదని మోదీ హితవు పలికారు. దేశ మొదటి ప్రధాన మంత్రిని ఎన్నుకునే సమయంలో 15మందిలో 13మంది సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు మద్దతిస్తే, మిగతా ముగ్గురూ ఎవ్వరికీ మద్దతివ్వలేదని గుర్తు చేశారు. అయినా తొలి ప్రధాని ఎవరయ్యారన్నది అందరికీ తెలిసిన విషయమేనని నరేంద్ర మోదీ వ్యంగ్యం వ్యాఖ్యలు చేశారు. సర్దార్ పటేల్ దేశ మొదటి ప్రధాని అయివుంటే ఇప్పుడున్న కాశ్మీర్ సమస్య ఉండేది కాదని అన్నారు. రాహుల్‌గాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నిక కావటంపై సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ చేసిన 'షాజహాన్ ఎన్నికయ్యాడా? రాచకుటుంబాల్లో ఇలాగే జరుగుతుంది' అన్న వ్యాఖ్యను నరేంద్ర మోదీ ప్రస్తావిస్తూ పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికల పేరిట తమ నాయకుడిని నామినేట్ చేసుకునేవారు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం ఏమిటని నిలదీశారు. కాంగ్రెస్ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం జారీ చేసిన ఒక ఆర్డినెన్స్‌ను రాహుల్‌గాంధీ విలేఖరుల సమక్షంలో చించేశారు. ఇదీ మీ ప్రజాస్వామ్యం. మీరు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం తగునా? అని నిలదీశారు. కాంగ్రెస్ సభ్యులు పోడియం వద్దకొచ్చి నినాదాలిస్తూ తన ప్రసంగానికి అడ్డుతగలటాన్ని మోదీ ప్రస్తావిస్తూ 'మీరు నినాదాలిస్తే భయపడే వ్యక్తిని కాదు' అని హెచ్చరించారు. ప్రజాస్వామ్యం గురించి మీరు మాకు పాఠాలు చెప్పవద్దని కాంగ్రెస్‌కు హితవు పలికారు.

'ఎన్డీయే హయాంలో దేశం ఎంతో ప్రగతి సాధిస్తోంది. కాంగ్రెస్ కంటే తమ హయాంలో ఎక్కువ రోడ్ల నిర్మాణం జరిగింది' అని మోదీ చెప్పారు. దేశంలో మౌలికరంగాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దేశంలోని అన్ని గ్రామాలకూ ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ సదుపాయం కల్పిస్తున్నామని వివరించారు. దేశం నుండి అవినీతి, నల్లధనాన్ని తొలగించేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని వివరించారు. ఈ విషయంలో ఎన్నో విజయాలు సాధించామని గుర్తు చేశారు. ఈ విషయంలో ప్రభుత్వ చర్యల వల్ల కొంతమంది ప్రతిపక్ష నేతలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కొందరు ముఖ్యమంత్రులు ప్రస్తుతం జైల్లో ఉన్నారని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. అవినీతికి పాల్పడేవారు ఎంత బలవంతులైనా శిక్ష తప్పదని మోదీ హెచ్చరించారు. ప్రధాని పదవి చేపట్టిన నరేంద్ర మోదీ ఆధార్ విధానాన్ని రద్దు చేస్తారని కాంగ్రెస్ ప్రచారం చేసింది. అయితే తానుమాత్రం ఆధార్‌ను మరింత పటిష్టం చేసి అమలు చేస్తున్నానని అన్నారు. తమ ప్రభుత్వం వ్యవసాయం, పశుపాలన, పాల ఉత్పత్తి, తేనే ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. యోగా దినోత్సవం నిర్వహిస్తున్నా ప్రతిపక్షం ప్రశ్నిస్తోంది. ఏమిటిది? అని గట్టిగా నిలదీశారు. వెనుకబడిన కులాల కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు ప్రతిపక్షం వ్యతిరేకిస్తోందని మోదీ దుయ్యబట్టారు. 'మేక్ ఇన్ ఇండియా' తదితర పథకాలను కూడా ప్రతిపక్షం విమర్శించటం సిగ్గుచేటన్నారు. తమ ప్రభుత్వం అసంఘటిత రంగంలోని వారికి ఎంతో మేలు చేసిందని, ఉపాధి అవకాశాలు కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు.



చేతకాని విభజన

• అందుకే సమస్యలు తప్పడం లేదు
• కాంగ్రెస్ స్వార్థంవల్లే తలపోట్లు
• ఆంధ్రుల మనోభావాలు దెబ్బతిన్నాయి
• విభజనకు వాజపేయి పద్ధతి సరైనది
• లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సంకీర్ణ ప్రభుత్వం ఆంధ్ర ప్రజల మనోభావాలు పరిగణనలోకి తీసుకోకుండా విభజనకు పాల్పడిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. బుధవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు మోదీ సమాధానమిస్తూ ఈ ఆరోపణలు చేశారు. యూపీఏ సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్ర విభజన చేపట్టే ముందు ఆంధ్ర ప్రజల మనోభావాలు కూడా పరిగణనలోకి తీసుకునివుంటే నేడు తెలుగుదేశం సభ్యులు పోడియం వద్దకు వచ్చి గొడవ చేసే పరిస్థితి ఉండేది కాదని స్పష్టం చేశారు. 'తెలంగాణ ఏర్పాటు చేయాలని తాము కూడా భావించాం. తెలంగాణ అభివృద్ధి చెందాలన్నది మా అభిమతం. అయితే విభజన సమయంలో ఆంధ్ర ప్రజల - మిగతా 6వ పేజీలో


సస్పెన్షన్లకు బెదరొద్దు

• నిర్దిష్ట హామీ ఇచ్చే వరకూ పోరు ఆపొద్దు • ఇన్నాళ్ల తరువాత కొత్త ఫార్ములా ఏమిటి?

• కాంగ్రెస్ తప్పును బీజేపీ సరిదిద్దొచ్చు • బంద్‌లు చేస్తే ప్రయోజనం శూన్యం • ఎంపీలు, పార్టీ నేతలతో చంద్రబాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 7: రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ, కేంద్రం నుంచి నిర్దిష్టమైన హామీ వచ్చే వరకూ పార్లమెంటులో పోరాడాలని ఏపీ సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు ఎంపీలను ఆదేశించారు. సభ నుంచి సస్పెండైనా భయపడాల్సిన పనిలేదన్నా. బుధవారం పార్టీ ఎంపీలు, నేతలతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ తప్పులు చేసిందన్న మోదీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, అప్పటి ప్రభుత్వం తప్పు చేస్తే ఇప్పటి ప్రభుత్వం సరిదిద్దాలని వ్యాఖ్యానించారు. బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం, విభజన హామీల అమలుకు టీడీపీ పార్లమెంటులో నిర్వహిస్తోన్న ఆందోళనను జాతీయ అజెండాగా మార్చడంలో విజయం సాధించామని పార్టీ వర్గాల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అయితే దానిని హేతుబద్ధంగా మరింత ముందుకు తీసుకువెళ్లడంలో ఎంపీలు పోరాటపటిమ చూపించాలని పిలుపునిచ్చారు. 'సభ సాక్షిగా మనకు జరిగిన అన్యాయం అందరూ వినాలి. అంతా కలసి మనకు న్యాయం జరిగేలా చూడాలి. అందులో మీదే ప్రధాన పాత్ర' అన్నారు. ఈ దశలో కేంద్ర మంత్రి సుజనా చౌదరి జోక్యం చేసుకుని ఏదో చెప్పబోగా, ముందు మనకు ఏమిస్తారో నిర్దిష్టంగా హామీ ఇచ్చిన తర్వాత దాని సంగతి చూద్దామని ప్రస్తావనను కట్ చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్, వామపక్షాలు ఇచ్చిన బంద్ పిలుపుపై మాట్లాడుతూ 'ఇది రెండు ప్రభుత్వాల మధ్య సమస్య అని, బంధుల ద్వారా జనజీవనానికి ఇబ్బందులు కలిగించడం భావ్యం కాదన్నారు. మనం విభజనతో అసలే సమస్యల్లో ఉన్నాం. మళ్లీ బందులతో - మిగతా 6వ పేజీలో



బీజేపీ.. వైసీపీ.. మధ్యలో బాబు!

వెంటాడుతున్న లోటు బడ్జెట్ భర్తీ సమస్య
పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్రం రిక్తహస్తం
టీడీపీపై పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి
సమస్యల సుడిగుండంలో చంద్రబాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 7: ఏపీ సీఎం చంద్రబాబు కనిపించే రాజకీయ శత్రువు వైసీపీ, కలసిరాని మిత్రపక్షం బీజేపీతో పోరాడుతున్నారు. ఓ వైపు కేంద్రంలో మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో అందని దన్ను.. మరోవైపు రాజకీయ ఒత్తిడి పెంచుతున్న ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ, ఇతర విపక్షాల రాజకీయ ఉద్యమాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు వంటి కీలకాంశాలపై మరోవైపు కేంద్రంతో పోరాడుతున్నారు. విభజన హామీలు అమలుచేస్తామన్న బీజేపీతో జతకట్టి గెలిచిన తేదేపా, ఇప్పుడు కేంద్రాన్ని నమ్మి జనం దృష్టిలో ముద్దాయిగా నిలబడాల్సిన పరిస్థితి తలెత్తింది. పోలవరం, అమరావతి నగర నిర్మాణం, రెవిన్యూ లోటు భర్తీ వంటి అతి పెద్ద సమస్యలు ఎప్పటికి పరిష్కారమవుతాయో తెలియని గందరగోళం మధ్య వైసీపీ సహా విపక్షాలు రాజకీయంగా వత్తిడి పెంచుతున్నాయి.

ప్రధానంగా రెవిన్యూలోటు భర్తీ కింద 13 వేల కోట్లలో 9 వేల కోట్లు రావలసి ఉందని అధికారులు చెబుతున్నారు. రైల్వే జోన్, విద్యాసంస్థలకు పూర్తిస్థాయి నిధులు, అమరావతి నగర నిర్మాణానికి రావలసిన రెండు వేల కోట్లు వంటి పెద్ద సమస్యలతోపాటు.. ఆంధ్ర-తెలంగాణ ప్రభుత్వాల మధ్య ఇంకా కొనసాగుతున్న విభజన సమస్యలను పరిష్కరించని కేంద్రంతో పోరాడుతున్నారు. బీజేపీ సహాయ నిరాకరణతో ప్రజల్లో వెల్లువెత్తుతోన్న ఆగ్రహం తెదేపా ఖాతాలో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బీజేపీతో మైత్రి ఎంతవరకు కొనసాగుతుందో అర్థంకాని అయోమయ పరిస్థితి నెలకొనడంతో, సంక్షేమ బలంతోనే వచ్చే ఎన్నికల్లో పట్టుసాధించే ప్రణాళికా సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల్లోగా - మిగతా 6వ పేజీలో

దేవుడిని నమ్ముకున్నా

• మీడియా మద్దతుతోనే ఫిరాయింపులు • మద్య నిషేధం అమలు చేసి తీరుతా

• ప్రజారోగ్యమే ప్రామాణికం కావాలి • పాదయాత్రలో జగన్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ

పి రామసుబ్బారావు

ఆత్మకూరు, ఫిబ్రవరి 7: నేను ఆ దైవాన్ని, మంచితనాన్ని నిండుగా నమ్ముకున్న వాడ్ని, ప్రజాస్వామ్యానికి వినాశకరంగా పరిణమిస్తోన్న కుట్రలు, కుతంత్రాలతో పోరాటం చేస్తున్నా. వచ్చే ఎన్నికలతో తప్పక మా పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తా. ప్రజా సమస్యలు గుర్తెరిగి పాలనలోకి వచ్చాక పరిష్కారాన్ని చూపేలా పాటుపడతాను అని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ అధినేత జగన్మోహనరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నెల్లూరుజిల్లా ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో జరిగిన పాదయాత్రలో భాగంగా ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: గతంలోనూ చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు (1999-2004) మీ తండ్రి (వైఎస్) విపక్ష నేతగా కొనసాగారు. అప్పట్లో 90 మంది ఎమ్మెల్యేలు వైఎస్ వెంట నడిచారు. ఒక్క ఎమ్మెల్యే కూడా పార్టీ ఫిరాయింపునకు పాల్పడలేదు. ఇప్పుడు మీరు గెలిపించుకున్న 67మంది ఎమ్మెల్యేల్లో 23 మంది ఫిరాయించారు. లోపం ఎక్కడుంది ?

జవాబు: మీడియాలో ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిజం నాలుగో స్థంభం. ఇలాంటి ఫిరాయింపుల్ని



తప్పుపట్టేలా కాకుండా వంత పాడుతున్నాయి. గెలుపొందిన పార్టీ ద్వారా కలిగిన పదవికి రాజీనామా విషయంలో క్లారిఫై చేయడం లేదు. ఫిరాయింపును సైతం శుద్ధి చేస్తున్నారు. అనుకూల మీడియా అందుబాటులో ఉందనే ధీమాతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. స్పీకర్ మనవాడే, పదవులకు రాజీనామా చేయాల్సిన అవసరం లేదంటూ భరోసా ఇస్తున్నారు. అంతేగాకుండా వారికి మంత్రి పదవులు సైతం కట్టబెట్టారు. వీటితోపాటు ఒక్కో ఫిరాయింపు ఎమ్మెల్యేకు 20 నుంచి 30 కోట్ల వరకు నజరానా ఇస్తున్నారు. ఒకప్పుడు ఫిరాయింపుల చట్టం లేదు. నేడువున్నా ఫిరాయింపులు జోరందుకోవడానికి ఇవే కారణాలు.

ప్ర: మీది అక్రమార్జన, అత్యధిక సంపాదనాపరులని విమర్శిస్తూ తెలుగుదేశం పార్టీనే ఎన్నికల వేళ ఎక్కువ ఖర్చు చేస్తుందనే రాజకీయ విశ్లేషణలున్నాయి. దీనిపై మీ అభిప్రాయం ?

జ: ప్రభుత్వ ముసుగులో దోచుకున్న డబ్బు, అడ్డగోలుగా కూడబెట్టిన సొమ్మును ఖర్చు చేయడాన్ని ముద్దుగా 'పోల్ మేనేజిమెంట్' అంటూ పిలుచుకుంటున్నారు. నేను, మా పార్టీ మాత్రం దైవాన్ని, మంచితనాన్నే నమ్ముకుని ప్రజాక్షేత్రంలో ఎన్నికల బరిలో దిగుతాం.

ప్ర: అధికారంలోకి వస్తే విడతల వారీగా మద్య నియంత్రణ నుంచి నిషేధం వరకు వెళ్తామంటున్నారు. ఏ ప్రభుత్వానికైనా ఆబ్కారీ ఆదాయమే ముఖ్యం. మద్యం నిషేదిస్తే ఆదాయం కోల్పోయి, ఖర్చు పెరిగి ఆర్థిక భారం రెండింతలవుతుందిగా? - మిగతా 6వ పేజీలో

పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీల పోరాటానికి సంఘీభావంగా నేడు ప్రదర్శనలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీల అమలు కోసం పార్లమెంట్ వేదికగా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ సభ్యులు చేస్తున్న ఆందోళనా కార్యక్రమానికి సంఘీభావంగా 8వ తేదీ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో ప్లకార్డులతో ప్రదర్శనలు, సభలు, విలేఖర్ల సమావేశాలు జరపాలని టీడీపీ శ్రేణులకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాష్ట్రాభివృద్ధి కోరుకునే ప్రజలు, మేధావులు అందరూ రాజకీయాలకతీతంగా తెలుగుదేశం పార్లమెంట్ సభ్యులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఈ ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మన హక్కులు సాధించుకునే వరకు మన ఎంపీలు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

బూసన్, సియోల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధుల నియామకం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: దక్షిణ కొరియా నుంచి మరిన్ని పెట్టుబడులను రాష్ట్రానికి ఆహ్వానించేందుకు ఆ దేశంలోని బూసన్, సియోల్ నగరాల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధులను నియమించారు. బూసన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా కొరియా రిపబ్లిక్‌లో కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా జీయోంగ్ డీయోక్-మిన్‌ను, సియోల్‌లో కియా మోటార్ కార్ప్ సీఈవో హన్-వూ పార్క్‌లను నియమించారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. వీరు రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక, పర్యాటక అభివృద్ధికి సంబంధించి కొరియా నుంచి పెట్టుబడులు వచ్చేందుకు, సాంకేతిక, మానవ వనరుల సమీకరణలో ప్రభుత్వ ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయి. వీరు చేసే ఖర్చును ప్రభుత్వ ఖజానా నుంచి భరిస్తుంది.

మళ్లీ కమిటీ నియామకం!

● సభ్యుల సంఖ్య నాలుగుకు పెంపు
● కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల వ్యవహారం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల వివాదం పరిష్కరించే చర్యల్లో భాగంగా రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మరోసారి కమిటీని నియమించింది. గత నెలలో ద్విసభ్య కమిటీని నియమించి, ఆ తరువాత దానిని రద్దు చేసిన విషయం తెలిసిందే. దానిని కాల పరిమితి ముగిశాక రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం విమర్శలకు గురైంది. తాజాగా మరోసారి మాజీ వీసీలు ప్రొఫెసర్లు అల్లం అప్పారావు, ఎన్.ప్రభాకరరావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సిబిఎస్ వెంకటరమణ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కన్వీనర్‌గా కమిటీని నియమించారు. 30 రోజుల్లోగా నివేదిక అందచేయాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రీన్ స్కూల్ అమలులో ఏపీకి మొదటి స్థానం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: సెంటర్ ఫర్ సైన్సు అండ్ ఎన్విరాన్‌మెంట్ నిర్వహిస్తున్న గ్రీన్ స్కూల్ కార్యక్రమం అమలులో ఏపీకి మొదటి స్థానం లభించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లా పరిషత్ పాఠశాలల్లో సహజ నీటి వనరులు కాపాడటం, జీవవైవిధ్యం లెక్కింపు, నీటి నిల్వలకు అనువైన స్థలం గుర్తింపు వంటి అంశాల్లో విద్యార్థులు పాల్గొనేలా గ్రీన్ స్కూల్ కార్యక్రమాన్ని రూపొందించారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లో దీనిని అమలు చేస్తున్నారు. 547 పాఠశాలలు తమ పేర్లను నమోదు చేసుకోగా, రాష్ట్రంలో మూడు పాఠశాలలు ఎంపిక చేశారు. చిత్తూరు జిల్లా పత్తికొండ జడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీకాకుళం జిల్లా అంబుగం పాఠశాల, చిత్తూరు జిల్లా కెవీబీపురంలోని కేజీబీవీ పాఠశాల ఎంపికయ్యాయి. ఈ మేరకు ఢిల్లీలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో అవార్డును రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర నేషనల్ గ్రీన్ కోర్ డైరెక్టర్ బివిఎ కృష్ణ మూర్తి అందుకున్నారు.

కాలుష్యకారక పరిశ్రమలపై ఉక్కుపాదం
29 యూనిట్ల మూసివేతకు ఆదేశం

● మంత్రి శిద్దా సమీక్షలో పీసీబీ చైర్మన్ వివరణ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో కాలుష్యకారక పరిశ్రమలను ఉపేక్షించే ప్రసక్తే లేదని రాష్ట్ర పర్యావరణం, అడవులు, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. వెలగపూడి సచివాలయంలో తన కార్యాలయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ (పీసీబీ) బీఎస్ఎస్ ప్రసాద్‌తో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాలుష్యకారక పరిశ్రమల మీద తీసుకున్న చర్యల గురించి పీసీబీ చైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 19, 2017న జరిగిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు డిసెంబర్ 2017 నుండి ఫిబ్రవరి 5, 2018వ తేదీ వరకు మూడు మాసాల్లో రాష్ట్రవ్యాప్తంగా 3 జోన్లలో 866 పరిశ్రమలను తనిఖీ చేశామని, పీసీబీ నిబంధనలు పాటించని 405 పరిశ్రమలకు నోటీసులు, 301 పరిశ్రమలకు మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. 29 పరిశ్రమల మూసివేతకు ఆదేశాలు ఇచ్చామన్నారు. పీసీబీ నిబంధనల ఆచరణార్థం 23 పరిశ్రమల మీద బ్యాంకు గ్యారంటీ తీసుకున్నామని మంత్రికి పీసీబీ చైర్మన్ తెలిపారు. విపరీతమైన కాలుష్యాన్ని వెదజల్లుతున్న గుంటూరు జిల్లా పేరేచర్ల గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉన్న 59 స్టోన్ క్రషింగ్ యూనిట్లను పీసీబీ అధికారుల బృందం తనిఖీ చేసి డస్ట్ పొల్యూషన్‌ను అరికట్టామని వివరించారు. పీసీబీ నిబంధనలు పాటించని స్టోన్ క్రషర్స్ యూనిట్ల లైసెన్స్‌లు రద్దు చేయవలసిందిగా మంత్రి ఆదేశించారు.

బంద్ విరమించాలి

● పార్లమెంట్‌లో కలసిరండి ● వామపక్షాలకు ప్రభుత్వం తరపున అచ్చెన్నాయుడు, ఆనందబాబు వినతి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 7: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందనే అంశంపై గురువారం రాష్ట్ర బంద్‌కు వామపక్షాలు ఇచ్చిన పిలుపుపై పునరాలోచన చేసి బంద్ విరమించాలని ప్రభుత్వం తరపున మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నక్కా ఆనందబాబు కోరారు. సమస్య న్యాయమైనదేనని, అయితే ఈ అంశంపై పార్లమెంట్‌లో కలిసిరావాలని కోరారు. సచివాలయంలో బుధవారం సాయంత్రం వారు మీడియాతో మాట్లాడారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలను ఒక పద్ధతి ప్రకారం సాధించుకోవాలన్నారు. ఎన్‌డీఏలో తాము భాగస్వాములైనప్పటికీ రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాన మంత్రిని, కేంద్ర మంత్రులను కలుస్తూ, నిరంతరం శ్రమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు మిత్రధర్మాన్ని పాటిస్తున్నారని చెప్పారు. హామీల అమలు విషయంలో కేంద్ర బడ్జెట్ కేటాయింపులో ఏపీకి అన్యాయం జరిగిందన్నారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తడంలో జాతీయ స్థాయిలో టీడీపీ ఎంపీలు విజయం సాధించారని చెప్పారు. నష్టాల్లో ఉన్న రాష్ట్రంలో బంద్ చేయడం వల్ల మరికొంత నష్టం జరుగుతుందన్నారు. వామపక్షాలకు ఇక్కడ శాసనసభలో ప్రాతినిధ్యం లేక పోయినా పార్లమెంట్‌లో వారి సభ్యులు ఉన్నందున కేంద్రంపై ఢిల్లీలో పోరాడాలన్నారు. ఈ అంశంలో ప్రధాని కల్పించుకున్నప్పటికీ స్పష్టమైన హామీ ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని చెప్పారు. ఢిల్లీలో తమ ఎంపీలతో కలిసి ఆ ఆందోళనకు మద్దతు తెలపాలన్నారు. బంద్ వల్ల రాష్ట్రానికి నష్టమేకాకుండా ప్రజలు ఇబ్బందులుపడతారని, అందువల్ల వామపక్షాలు, ఇతర పార్టీలు బంద్‌పై పునరాలోచన చేసి విరమించాలని కోరారు.

ఎక్కడ అన్యాయం జరిగిందో అక్కడే ఆందోళన: ఆనందబాబు

ఎక్కడ అన్యాయం జరిగిందో అదే పార్లమెంట్ వద్ద జాతీయ స్థాయిలో ప్రతిబింబించే విధంగా ఆందోళన చేపట్టాలని మంత్రి ఆనందబాబు అన్నారు. ప్రధాన మంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. హామీలు అమలు చేయమని అడగటం ఏపీ హక్కన్నారు. ఈ విషయంలో రాష్ట్రాన్ని విడదీసిన పార్టీలకు బాధ్యత ఉందని గుర్తు చేశారు. ఎన్‌డీఏలో టీడీపీ భాగస్వామిగా ఉన్నా ఆందోళనలు చేయడంలో వెనుకాడేదిలేదని చెప్పారు.

నేడు రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు, ఆర్టీసీ సర్వీసులు బంద్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు రాష్ట్ర ప్రభుత్వం చివరి క్షణాల్లో అనుకూలంగానే స్పందించింది. ప్రధానంగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌ను వాయిదా వేయటంతోపాటు అన్ని రకాల విద్యా సంస్థలను మూసివేయాలంటూ మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. ముందు జాగ్రత్తగా ఆర్టీసీ బస్సులను ఆయా డిపోల నుంచి బయటకురాకుండా ఆదేశాలు జారీ చేశారు.



విలేఖరులతో మాట్లాడుతున్న మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనందబాబు

మన సొమ్ము మనకొచ్చేలా చూడండి

● పీపీఏల పనులు నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయండి ● లేదంటే ఆ రోజు మార్కెట్ ధర ప్రకారమే చెల్లింపులు: మంత్రి కళా

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 7: విద్యుత్‌శాఖ పరిధిలోని ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థల పరిధిలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాల నియమ నిబంధనలను పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను విద్యుత్ శాఖా మంత్రి కిమిడి కళా వెంకట్రావ్ ఆదేశించారు. బుధవారం వెలగపూడిలోని తన కార్యాలయంలో ఏపీ విద్యుత్ సంస్థల్లో కోర్టు కేసుల పురోగతి, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ), పవన, సౌర విద్యుత్ తదితర అంశాలపై విద్యుత్‌శాఖ అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇంధనశాఖ సలహాదారు కె.రంగనాథం, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ దినేష్ పరుచూరి, ఏపీ ట్రాన్స్‌కో న్యాయ సలహాదారు శివరావు, సీఈ ఐపీసీ రాజబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కళా మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు (పీపీఏలు) సంబంధించి అప్పిలేట్ ట్రిబ్యునల్ ఢిల్లీ, ఏపీ ఈఆర్సీ, హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసులు పరిష్కారం అయితే విద్యుత్ సంస్థలకు ఆదాయం వచ్చే కేసుల పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు కేసులకు సంబంధించి ప్రతి వాయిదాకు క్రమం తప్పకుండా అధికారులు హాజరుకావాలని, ఏఓఆర్/సీనియర్ కౌన్సిల్‌తో సమన్వయం చేసుకొని ట్రాన్స్‌కో తరపున వాదనలు బలంగా వినిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో టెండర్ల నియమావళి రూపొందించే సమయంలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి సమయాన్ని పొందుపొర్చాలని, నిర్ణీత సమయంలో సంబంధిత కంపెనీ పనులు పూర్తి చేయకుండా కాలవ్యవధి పొడిగిస్తే ఆ సమయంలో పీపీఏలో పేర్కొన్న విద్యుత్ కొనుగోలు ధర కంటే మార్కెట్లో విద్యుత్ ధర తక్కువ ఉంటే ఆ రేటు మాత్రమే చెల్లించేలా నిబంధనను చేర్చాలని మంత్రి ఆదేశించారు. ఈ నిబంధనను టెండర్ దరఖాస్తులోను, పీపీఏ నిబంధనల్లోనూ కచ్చితంగా పొందుపర్చాలని, దీనివల్ల విద్యుత్ సంస్థలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో విద్యుత్ కొనుగోలులో ధరలు తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో పవన, సౌర విద్యుత్ ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని, దీనివల్ల విద్యుత్ కొనుగోలు వ్యయం కూడా తగ్గే అవకాశం ఉంటుందన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి కళావెంకట్రావు

సమస్యలు పరిష్కరించకుంటే సమరం తప్పదు

● 10న రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల మహాధర్నా
● జేఏసీ చైర్మన్ పీ అశోక్‌బాబు హెచ్చరిక

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళలను మరింత తీవ్రతరం చేస్తామని, కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తామని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ పీ అశోక్‌బాబు హెచ్చరించారు. సీపీఎస్ రద్దుపై చేపట్టనున్న మహాధర్నా, ఉద్యోగుల డిమాండ్లపై బుధవారం విజయవాడలోని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానంతరం మీడియా ప్రతినిధులతో అశోక్‌బాబు మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దుపై గతంలో మండల స్థాయిలో ధర్నాలను నిర్వహించామని, ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 13 జిల్లాల జిల్లా కేంద్రాల్లో ధర్నా కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు.

సీపీఎస్ విధానం కేంద్రానికి సంబంధించిన అంశంగా పేర్కొని చేతులు దులుపుకోవడం సబబు కాదన్నారు. కేరళ వంటి రాష్ట్రాలు సీపీఎస్ విధానం నుంచి బయటకు వచ్చేందుకు ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాయన్నారు. సీపీఎస్ రద్దు కోసం నెల 25న ఆంధ్రప్రదేశ్ జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ రూపుదిద్దుతామన్నారు.

బెల్ట్ షాపు మాటే వినిపించొద్దు!

● సీఎస్ దినేష్‌కుమార్ ఆదేశం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో ఎక్కడా బెల్ట్ షాపుల మాటే వినబడకూడదని, ప్రభుత్వ హెచ్చరికలు పెడ చెవినపెట్టి షాపులు నిర్వహించే వారిపైనా, వారికి సహకరించే వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. బెల్ట్ షాపుల నిర్వహణకు మద్యం సరఫరా చేసే మద్యం షాపుల యజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. అవసరమైతే ఆయా షాపుల లైసెన్సులను రద్దు చేయాలని సీఎస్ ఆదేశించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో రాష్ట్రంలో బెల్ట్ షాపుల నిరోధంపై తీసుకుంటున్న చర్యల గురించి ఎక్సైజ్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా బెల్ట్ షాపుల నిరోధానికి తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎస్‌కు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి డి.సాంబశివరావువివరించారు. గత ఏడాది జూలై 18వ తేదీన రాష్ట్రమంత్రి మండలి బెల్ట్ షాపులు మూసివేయాలని నిర్ణయించిన నాటి నుంచి నేటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 8,827 కేసులు నమోదు చేశామన్నారు. సీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఎక్కడైనా బెల్ట్ షాపు నిర్వహిస్తే సదరు నిర్వాహకుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసే షాపులపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా షాపుల యజమానులపై కేసులు నమోదు చేయాలని, అవసరమనుకుంటే షాపుల లైసెన్సులు రద్దు చేయాలన్నారు. బెల్ట్‌షాపుల నిర్వహణలో ఎక్సైజ్ సిబ్బంది పాత్ర ఉంటే, వారిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. సీజ్ చేసిన వాహనాలను ఎప్పటికప్పుడు వేలం వేయించి, విక్రయించాలన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి ఈ వేలం నిర్వహించాలన్నారు. నిందితులకు శిక్షలు పడేటట్లు సాక్ష్యాలు కూడా చూపాలన్నారు. బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రచారం చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ ఎం.మాలకొండయ్య, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక కమిషనర్ లక్ష్మీనరసింహం, డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కె.వేంకటేశ్వరరావు, అడిషనల్ డైరెక్టర్ జనరల్ నరేష్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ అక్రమ తరలింపు అడ్డుకోవాలి

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలతో పాటు గ్రానైట్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. ప్రజలకు ఉపాధి, పరిశ్రమలు, ముడిసరుకు ప్రభుత్వానికి ఆదాయం.. ఇదీ గ్రానైట్ మైనింగ్ లక్ష్యం కావాలని స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలోని తన కార్యాలయంలో గనులు, భూగర్భ శాఖాధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు లబ్ధితో పాటు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోడానికి తీసుకుంటున్న చర్యలేమిటని ప్రశ్నించారు. పలు ప్రాంతాల నుంచి ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రానైట్ అక్రమ మైనింగ్‌లో అధికారుల పాత్ర ఉంటే, ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించేది లేదని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజయవాడ నుండి ఇండిగో సర్వీసులు

● మార్చి 2 నుండి

బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలకు విమానాలు

విజయవాడ (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 7: దక్షిణ భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న దేశీయ రంగానికి పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని లోకాస్ట్ క్యారియర్ ఇండిగో విమానాలు విజయవాడ నుండి ప్రారంభిస్తున్నట్లు ఆసంస్థ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సంజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండిగో తమ నెట్‌వర్క్‌లో 50వ గమ్యస్థానంగా విజయవాడను చేర్చిందని, విజయవాడతో పాటు ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, దుబాయ్, సింగపూర్, షార్జా, బెంగళూర్, హైదరాబాద్, చెన్నై నగరాలను కలుపనుందని పేర్కొన్నారు. ఇండిగో తమ ప్రాంతీయ కనెక్టివిటీని మెరుగుపరుస్తూ రాజమండ్రి, తిరుపతిలకు జనవరిలో కార్యకలాపాలను ప్రారంభించినట్లు తెలిపారు. మార్చి 2వతేదీ నుండి ప్రతిరోజు విజయవాడ నుండి హైదరాబాద్‌కు మూడు విమానాలు, బెంగళూర్, చెన్నైలకు ప్రతిరోజు ఒక విమానాన్ని నడపనున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ నుండి ఇండిగో సర్వీసులు పరిచయం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. వృద్ధి పరంగా 2017 సంవత్సరం తమకు అత్యుత్తమ సంవత్సరం అని పేర్కొన్నారు.

నేటి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష 22కు వాయిదా

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: రాష్ట్ర బంద్ సందర్భంగా గురువారం జరగాల్సిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షను ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్లు బోర్డు కార్యదర్శి బి.ఉదయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు.

ఎంపీ రాయపాటి కుటుంబ సభ్యుల కారు డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు, ఫిబ్రవరి 7: నరసరావుపేట ఎంపీ రాయపాటి సాంబశివరావు మనవరాలి కారు డ్రైవర్‌గా పని చేసిన పుట్ల విజయరాజు బుధవారం రాత్రి పొద్దుపోయాక నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విజయరాజు గత నాలుగు నెలల క్రితం వరకు రాయపాటి సాంబశివరావు తనయుడు రాయపాటి రంగారావు కుమార్తె కారు డ్రైవర్‌గా పని చేశాడు. డ్రైవర్లు ఎక్కువగా ఉన్నందున గత రెండునెలల క్రితం విజయరాజును తొలగించారు. పని చేసే సమయంలో రూ. 15వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. అయితే ఆ డబ్బులు తిరిగి చెల్లించాలని కార్యాలయ మేనేజర్ కోటపాటి పూర్ణచంద్రరావు సహ డ్రైవర్లు ఫణి, వెంకటేష్‌లతోపాటు రాయపాటి రంగారావు వేధిస్తున్నారని లిఖిత పూర్వంగా లేఖ రాసి నిద్రమాత్రలు మింగాడు. అపస్మారక స్థితిలో ఉన్న విజయరాజును చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఏపీలో ప్రాంతీయ కేంద్రం

● ముందుకొచ్చిన 'ఇరి'

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఇరి) రీజనల్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పడానికి ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ సూత్రప్రాయంగా అంగీకరించారు. ఈ రీజనల్ సెంటర్‌ను రాష్ట్రంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి, వారితో కలిసి పనిచేస్తుందని తెలిపారు. ఉత్తర భారతదేశంలోని వారణాసిలో స్థాపించిన రీజనల్ సెంటర్ తరహాలో ప్రధానంగా వరి ఉత్పాదకతను పెంచేందుకు, వరి ఆధారిత పంటల వ్యవస్థను అభివృద్ధి చేయటానికి, వరిలో కోత అనంతరం నష్టాలను తగ్గించడానికి, బయో ఫోర్టిఫికేషన్ జోడించేందుకు, చౌడు పొలాల్లో, ఉప్పు నీటిని తట్టుకునే రకాలను వృద్ధి చేయడం, గ్రీన్ సూపర్ రైస్‌ను వృద్ధి చేయటం, తదితర అంశాల లక్ష్యంగా ఈ రీజనల్ సెంటర్ ఏర్పాటుకు ఏపీని ఎంచుకుంది. ఇరితో ఇటీవల రాష్ట్రంలోని వ్యవసాయ విద్యాలయం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వర్శిటీ ప్రాంగణంలో శాటిలైట్ ఆధారిత వరి పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. రూ.33 లక్షల విలువతో ప్రయోగశాలను వర్శిటీలో ఏర్పాటు చేయడానికి సంసిద్ధత తెలియజేశారు. దీనిలో భాగంగానే వ్యవసాయ విశ్వవిద్యాలయం లోని శాస్త్రవేత్తలకు, ఎకనామిక్స్, స్టాటిస్టిక్ డిపార్టుమెంటు అధికారులకు, వ్యవసాయ అధికారులకు మార్చి నెలలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తుంది. ఏపీలో ఏర్పాటు చేయతలపెట్టిన మెగా సీడ్ పార్క్‌లో కూడా ఈ సంస్థ కలిసి పని చేయటానికి సంసిద్ధత తెలియజేసింది. ఇలాఉంటే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నేతృత్వంలో శాస్త్రవేత్తల బృందం ఫిలిప్పీన్స్ దేశంలో ఇరి, దాని అనుబంధ సంస్థలను సందర్శించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌లో తిరుగుబాటు

● చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలు ● డైరెక్టర్ల ఆరోపణ ● టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆందోళన

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు, ఫిబ్రవరి 7: నిరుపేద బ్రాహ్మణులకు ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యమవుతోంది.. గత ఏడున్నర నెలలుగా ఎలాంటి సమావేశాలు, సమీక్షలు నిర్వహించకపోవటంతో పాటు లబ్ధిదారులకు ఫలాలు అందక పోవటంతో నిరాశ, నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి.. ఏటా బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ప్రభుత్వం 50 నుంచి 70 కోట్ల వరకు నిధులు మంజూరు చేస్తోంది. కార్పొరేషన్‌కు చైర్మన్‌తో పాటు ఆరుగురు డైరెక్టర్లు నామినేట్ అయ్యారు. అంతకు ముందు ప్రభుత్వం జిల్లా, నియోజకవర్గ కోఆర్డినేటర్లచేత కార్పొరేషన్ ద్వారా అమలయ్యే పథకాలను విస్తృత ప్రచారం చేయించింది. ఆ వ్యవస్థను రద్దుచేయటంతో అసలు కార్పొరేషన్ ఉందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడున్నర నెలల క్రితం తెలంగాణవాసి వేమూరు ఆనంద సూర్యను చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. అప్పటి వరకు చైర్మన్‌గా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఐవైఆర్ కృష్ణారావు ప్రభుత్వంపై అభియోగాలు మోపటంతో ఆయన్ను తొలగించి ఆనంద సూర్యను నియమించింది. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు డైరెక్టర్ల సమావేశం నిర్వహించలేదని చెప్తున్నారు. అంతేకాదు ఆయా పథకాలకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన జరపక పోవటంతో కార్పొరేషన్ నిర్వీర్యంగా మారుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చైర్మన్ వ్యవహారశైలిని నిరసిస్తూ బుధవారం నలుగురు డైరెక్టర్లు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆందోళనకు దిగారు. ఆరుగురు డైరెక్టర్లలో ఇద్దరు అనివార్య కారణాల వల్ల హాజరుకాలేదు. మిగిలిన నలుగురిలో గుమ్మా నాగరాజు (శ్రీకాకుళం), దువ్వూరి సురేష్ (తూ.గో), యామిజాల నర్సింహమూర్తి (ప.గో), నేపాక పద్మావతి (గుంటూరు) తదితరుల ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, ఎమ్మెల్సీ వీవీవీ చౌదరికి పరిస్థితిని వివరించారు. చైర్మన్ ఆనంద్ సూర్య తెలంగాణకు చెందిన రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటనలో సభ్యులుగా ఉన్న వారికే కార్పొరేషన్‌లో స్థానం కల్పిస్తున్నారని, ఆయన తాబేదార్ల ద్వారా ఏపీలోని 13 జిల్లాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారని వారు ఆరోపించారు. సొంత సంఘంలో ఉన్న వారికే నామినేటెడ్ పదవులు కూడా కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని దీనివల్ల పార్టీకి అన్యాయం జరుగుతోందనే ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీలో ఉన్న వారిని అవమానిస్తూ పార్టీని అంటిపెట్టుకుని పథకాలను ప్రచారం చేస్తున్న కోఆర్డినేటర్లను తొలగించి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని రాష్ట్ర పార్టీ నేతల దృష్టికి తెచ్చారు. కార్పొరేషన్ నామినేటెడ్ పదవుల విషయంలో ఆయా జిల్లా పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, అధిష్ఠానంతో సంబంధం లేకుండా, సంప్రతింపులు జరపకుండా మరో వ్యవస్థను సృష్టించి నియామకాలు జరుపుతున్నారని ధ్వజమెత్తారు. కార్పొరేషన్ అందిస్తున్న సహకారంతో బ్రాహ్మణ కులస్థులు టీడీపీకి వెన్నుదన్నుగా నిలుస్తుంటే చైర్మన్ వారిని దూరం చేసే విధానాలను అవలంబిస్తున్నారని వివిధ జిల్లాల కోఆర్డినేటర్లు సిరిపురపు శ్రీధర్, సీహెచ్ రావు, రామయ్యపాణి, ఎస్ హనుమంతరావు, విబి సువర్ణకుమార్, ఎస్ రఘునాథ్, ఆర్ శర్మ తదితరులు ఆరోపించారు. చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలను నియంత్రించి పార్టీతో సంప్రతింపులు జరిపి నామినేటెడ్ పదవులు భర్తీ చేయాలని, లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన చౌదరి లిఖితపూర్వకంగా వినతిపత్రాన్ని కోరారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తూ తిరుగుబాటు డైరెక్టర్లు, కోఆర్డినేటర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు.



గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న డైరెక్టర్లు, కోఆర్డినేటర్లు

మోదీ మరోసారి వంచించారు

● పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడిన తీరు రాష్ట్ర ప్రజలను మరోసారి వంచన చేసిందంటూ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ సమస్యలను పక్కదోవ పట్టించే కుటిల వ్యూహంతో రాష్ట్రానికి మళ్ళీ ఒక రాజకీయ అబద్ధపు ఆరోపణల ఉపన్యాసం ఇచ్చారని అన్నారు. 2014 ఎన్నికల్లో నరేంద్ర మోదీ ఇలాంటి అబద్దాలనే చెప్పి ఓట్లు దండుకున్నారన్నారు.

అధికారంలోకి వచ్చిన 4 ఏళ్ల గడుస్తున్నా నరేంద్ర మోదీ, బాబు జోడీ ఏపీ ప్రజలకు అన్యాయం చేశారని ఆందోళన చెందుతుంటే ఏ విధంగా న్యాయం చేస్తారో ప్రధానిగా రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పకుండా కాంగ్రెస్‌పైన రాజకీయ ఆరోపణలు చేసి తప్పించుకోవడం నరేంద్ర మోదీ వంచనలో, మోసంలో భాగం తప్ప మరేమీకాదని మరోసారి రుజువైందన్నారు. ప్రధాని మోదీ ఉపన్యాసం మొదలుపెట్టగానే తెలుగుదేశం ఎంపీలు తమ నాటకం ఆపి తోకముడిచారన్నారు. ప్రతిపక్ష వైకాపా ఎంపీలు బాయ్‌కాట్ పేరిట పలాయనం చిత్తగించి పారిపోయారని, దీంతో టీడీపీ, వైకాపాల పోరాటం నాటకమని, బూటకమని తేలిపోయిందంటూ ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ విషయంలో లోక్‌సభలో కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే స్పందించారన్నారు.

శరవేగంగా వసతులు

మున్సిపల్ మంత్రి నారాయణ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: రాజధాని అమరావతిలో మౌలిక వసతుల పనులు శరవేగంగా జరుగుతున్నాయని మున్సిపల్ వ్యవహారాల మంత్రి పి నారాయణ చెప్పారు. రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ కింద భూములు సేకరించేటప్పుడే మూడు సంవత్సరాలలో మౌలిక వసతులు పూర్తి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యాన్ని నెరవేర్చడానికి కృషి చేస్తున్నామన్నారు. బుధవారం రాజధాని ప్రాంతంలో జరుగుతున్న రోడ్ల పురోగతిపై అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం వెలగపూడి ఎన్‌సీసీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ ఉదయం ఎన్-8, ఎన్-10, రోడ్ల పనులు ఏ విధంగా జరుగుతున్నాయో పరిశీలించామన్నారు.

రోడ్లు పూర్తయిన వెంటనే బ్రిడ్జీల నిర్మాణం కూడా జరగటానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ఎన్-10 రోడ్డు పొడవు 16.3 కిలోమీటర్లతో ఎన్- 8 రోడ్డు 13.8 కిలోమీటర్లలో నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రైతుల ప్లాట్లలో కూడా రోడ్లు వేయాల్సి ఉందని ఇవి మొత్తం కలుపుకుంటే అమరావతి రాజధానిలో 1,006 కిలోమీటర్లలో రోడ్డు నిర్మాణాలు 29 గ్రామాలలో 13 ప్యాకేజీలలో చేయాల్సి ఉండగా 10 ప్యాకేజీలలో పనులు చేస్తున్నామన్నారు. మిగిలిన పనులు త్వరలోనే టెండర్లు అవుతాయని, అమరావతి రాజధాని 217 చదరపు కిలోమీటర్లు నిర్మాణంలో చేస్తున్నామని, దీనికి సంబంధించి రైతుల దగ్గర నుంచి ల్యాండ్ పూలింగ్‌లో తీసుకున్న భూముల రైతులకు ప్లాట్స్ అప్పగించామన్నారు. రాజధానిలో ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణంగా 2018 డిసెంబర్ నాటికి రోడ్లు, డ్రైనేజీ, కేబుల్ వైర్లు తదితరమైన మౌలిక వసతులు పూర్తవుతాయన్నారు. సింగపూర్ ప్రభుత్వం ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌కి అనుగుణంగా 320 కిలోమీటర్లలో రాజధానిలో రోడ్లు నిర్మాణం చేయనున్నామన్నారు. అమరావతి రాజధానిలో 34 రోడ్లు, 320 కిలోమీటర్లలో వన్ బై వన్ కిలోమీటరుతో ఈ రోడ్లు వుంటాయన్నారు. తూర్పు నుంచి పడమరకు 16 రోడ్లు, ఉత్తరం నుంచి దక్షిణానికి 18 రోడ్లు నిలువుగా డిజైను చేసి నిర్మిస్తున్నామన్నారు. 24 రోడ్లకు సంబంధించి టెండర్లు పూర్తయి పనులు వేగంగా జరుగుతున్నాయని మిగతా 10 రోడ్లకు సంబంధించి టెండర్ల ప్రక్రియను వచ్చే నెల మొదటి వారం లోపు పూర్తి చేస్తామన్నారు. రాజధాని నగరంలో అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు సంబంధించిన నమూనాలను నార్మన్ పోస్టర్స్ సంస్థ వచ్చే నెలలో పూర్తి నమూనాలు ఇవ్వనుందని ఇచ్చిన వెంటనే టెండర్లకు వెళ్లి పనులు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే అధికారులకు సంబంధించి 3,400 క్వార్టర్ల పనులు గ్రౌండింగ్ జరిగి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని త్వరలోనే ఆ నిర్మాణాలకు శ్లాబ్స్ కూడా వేయనున్నామన్నారు.



సభలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

హెల్త్‌హబ్‌గా అమరావతి

అమృత విశ్వవిద్యాపీఠం శంకుస్థాపన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

మంగళగిరి, ఫిబ్రవరి 7: దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్న అమృత విశ్వ విద్యాపీఠం ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగరానికి శోభ చేకూరుతుందని, దీంతో మంచి పౌరులు తయారవుతారని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధాని అమరావతి రానున్న కాలంలో హెల్త్‌హబ్‌గా మారి మెడికల్ టూరిజానికి కేంద్రంగా మారుతుందన్నారు. రాజధాని పరిధిలోని గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లు - ఎర్రబాలెం గ్రామాల మధ్య సుమారు 150 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న అమృత విశ్వవిద్యాపీఠం నిర్మాణానికి బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ దేశంలోని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో అమృత నెంబర్ వన్ స్థానంలో ఉందని, ఆసియాలోనే 168వ స్థానంలో ఉన్న ఈ సంస్థ అమరావతికి రావడం సంతోషంగా ఉందన్నారు. విలువలతో కూడిన సమాజాన్ని తయారు చేసేందుకు ఇది ఉపయోగ పడుతుందని చంద్రబాబు అన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు అమ్మ ఒక సాధారణ పేద కుటుంబంలో పుట్టి ఒక శక్తివంతమైన వ్యక్తిగా తయారై అనునిత్యం సమాజానికి ఎనలేని సేవలందిస్తున్నారని, పేదరికం ఎక్కడుంటే అమ్మ భక్తులు అక్కడ ఉంటారని , అలాంటి విలువలతో కూడిన అమృత ఇక్కడికి రావడం గర్వకారణమని ఆయనన్నారు. నేడు మాజీమంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఆకస్మికంగా మరణించారని, అక్కడికి వెళ్లాల్సి ఉన్నప్పటికీ ఎప్పుడో నిర్ణయమైన ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనాలని వచ్చానన్నారు. ప్రపంచంలో ఈ సంస్థలు, కాలేజీలు స్పిరిచ్యువాలిటీతో ముందుకు వెళ్తున్నాయని, భక్తుల విజ్ఞప్తి మేరకు ప్రపంచ వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. లక్షల మంది భక్తులు అమ్మకు ఉన్నారని, ఒక దీపం మరొక దీపాన్ని వెలిగించినట్లు ప్రతి ఒక్కరూ వేరే వ్యక్తుల జీవితాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని, ఆ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని చంద్రబాబు అన్నారు. అమరావతిలో 150 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్న అమృత విశ్వ విద్యాపీఠంలో ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, రీసెర్చ్ సెంటర్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్, ఆర్ట్స్ అండ్ సైన్స్, ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ యోగా, స్పిరిచ్యువాలిటీ, గ్లోబల్ పీస్ అండ్ ఎథిక్ సెంటర్ ఉంటాయన్నారు. టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకుని వినూత్నంగా అమృత ముందుకు సాగుతోందన్నారు. రెండోదశలో నిర్మించనున్న అమృత హెల్త్ సిటీలో 750 పడకలతో ఆస్పత్రి, 1500 పడకలతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, డెంటల్, ఫార్మశీ, నర్సింగ్, నేచురోపతి, ఆయుర్వేద, ఇంటర్నేషనల్ హెల్త్ కాలేజీ, మల్టీ స్పెషాలిటీ అల్లాయిడ్ కాంపస్ వస్తాయని, ఇంటర్ డిసిప్లెన్ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వస్తాయని, 45 నుంచి 50 వేల మంది పిల్లలు ఇక్కడ చదువుకునే అవకాశం ఉందని చంద్రబాబు అన్నారు. రాజధానిలో ఎస్‌ఆర్ఎం, విట్, అమృత సంస్థలు వచ్చాయని ఆయనన్నారు. అమరావతిని అద్భుతమైన రాజధానిగా నిర్మించాలన్నదే తమ లక్ష్యమన్నారు. కొత్త రాజధానిలో 9 సిటీలు, 27 టౌన్‌షిప్‌లు ఉంటాయని, నాలెడ్జ్, హెల్త్, ఫైనాన్స్, టూరిజం, అడ్మినిస్ట్రేషన్, జస్టిస్, ఎలక్ట్రానిక్, స్పోర్ట్స్, మీడియా అండ్ కల్చరల్ సిటీస్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రపంచంలో ఉన్న అన్ని యూనివర్శిటీలను తెస్తున్నామన్నారు.

ముద్దుకృష్ణమకు ఘన నివాళి



వెంకటరామాపురంలో గాలి పార్థివ దేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి ఘటిస్తున్న సీఎం

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, ఫిబ్రవరి 7: ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమ నాయుడు మరణం నమ్మశక్యంగా లేదని, విధి బలీయమైందని, ఇది భ్రమైతే బాగుండునని, పార్టీ ఒక గొప్ప నాయకుడుని, ప్రజలు ఒకపెద్ద సేవకుడిని కోల్పోయారని, ముద్దు మరణం పార్టీకి భర్తీ చేయలేని లోటని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం వెంకట్రామపురంలో ముద్దు పార్థివ దేహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 13 జిల్లాలు పర్యటించి వచ్చి అన్ని విషయాలు చర్చిస్తానని చెప్పి వెళ్లిన ముద్దుకృష్ణమనాయుడుని ఈ విధంగా చూడాల్సి రావడం ఎంతో బాధగా ఉందని సీఎం అన్నారు. ముద్దుతో తన అనుబంధం విడదీయరానిదని, ఆయన ఆశయసాధనకోసం పనిచేస్తామన్నారు. ముద్దుకృష్ణమనాయుడు నిరంతరం ప్రజల మనిషి అని, ప్రజా అభివృద్ధి కోసం అలుపెరగకుండా పనిచేసేవాడని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేవాడని, ప్రజలకు తాను ఒక భరోసా కల్పించేవాడని తెలిపారు. ఆయన మృతితో ఒక ముఖ్య సహచరుడ్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ముద్దుకృష్ణమనాయుడు మరణం పార్టీకి తీరని లోటని తెలిపారు. ముద్దుకృష్ణమనాయుడు రాజకీయ దురంధరుడని ఎంపీ శివ ప్రసాద్ అన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు మృతికి సీపీఐ నారాయణ, శాసన మండలి చైర్మన్ ఫరూఖ్,నన్నపనేని రాజకుమారి, వైఎస్ జగన్ సంతాపం తెలిపారు.

మూగబోయిన వెంకట్రామాపురం

చిత్తూరు జిల్లా నగరి నియోజక వర్గ ప్రజలు ఎంతో ప్రేమతో 'ముద్దన్న'గా పిలుచుకుంటున్న, పిలిస్తే పలికే నేతగా, ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని విధానాలతో పోరాడే నేతగా కీర్తి గడించిన ప్రజాబంధువు, టీడీపీ ఎమ్మెల్సీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు (71) డెంగ్యూ జ్వరంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున 2.15 గంటలకు తుదిశ్వాస విడిచారు. గురువారం ఉదయం వెంకట్రామాపురం సమీపంలోని మామిడితోటలో ముద్దు పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇదిలావుండగా ఈవార్త తెలిసిన వెంటనే జిల్లా ప్రజలు, టీడీపీ శ్రేణులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ముద్దు స్వగ్రామమైన వెంకట్రామాపురం విషాద ఛాయలు అలుముకున్నాయి. ఏ ఇంట చూసినా విషణ్ణ వదనాలతో అందరి మాటలు మూగ బోయాయి. కడసారి చూపు కోసం నగరి, పుత్తూరు ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముద్దు మరణ వార్త విన్న టీడీపీ శ్రేణులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ముద్దు మరణ వార్త విని ఖిన్నుడయ్యారు. హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచిన ముద్దు భౌతిక కాయాన్ని బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో రేణిగుంట పాత విమానాశ్రయానికి తీసుకువచ్చారు. వెంకట్రామాపురంలోని ఆయన ఇంటి వద్దకు మధ్యాహ్నం 1.30 గంటలకు చేర్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, నారాయణ, దేవినేని ఉమా మధ్యాహ్నం 2.40 గంటలకు వెంకట్రామాపురం చేరుకున్నారు. ముఖ్యమంత్రిని చూసిన ముద్దు సతీమణి సరస్వతి, ఆయన కుమారులు జగదీష్, భాను ఒక్కసారిగా బోరుమని విలపించారు.

విద్యామంత్రిగా భేష్

విజయవాడ: ఉమ్మడి రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా దాదాపు 25 మందికి పైగానే బాధ్యతలు చేపట్టినప్పటికీ భవనం వెంకట్రామ్, మండలి వెంకట కృష్ణారావు, గాలి ముద్దుకృష్ణమ నాయుడు ముగ్గురే వినుతికెక్కారు. దాదాపు దశాబ్దకాలం పాటు అధ్యాపక వృత్తిలో కొనసాగిన గాలి ముద్దుకృష్ణమనాయుడు మాత్రం ఎన్టీఆర్ మంత్రివర్గంలో విద్యాశాఖను ఏరికోరి తీసుకోవటం అటుంచి అనేక కొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా అధ్యాపకులకు, ఉపాధ్యాయులందరికీ శత్రువుగా మారారు. విద్యా సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా అక్కడ విధులు నిర్వర్తించే ఎయిడెడ్ అధ్యాపకులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని వారిపై చర్యలు తీసుకున్నారు.

నేటి బంద్‌కు వైసీపీ మద్దతు

సంకల్ప యాత్రకు విరామం

ఆంధ్రభూమి బ్యూరో

నెల్లూరు, ఫిబ్రవరి 7: వామపక్షాలు గురువారం నిర్వహించే రాష్ట్ర బంద్‌కు వైసీపీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్, దుగరాజపట్నం నౌకాశ్రమం, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు కర్మాగారం తదితర విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న బంద్‌కు ఆ పార్టీ అధినేత సంపూర్ణ మద్దతు తెలియజేయటంతో పాటు తాను చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రకు బుధవారం విరామం ప్రకటించారు. గురువారం యధావిధిగా పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకత్వం ఆ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిలదీస్తూ రాష్ట్ర ప్రయోజనాల కోసం చేపట్టిన బంద్‌కుప్రజలందరూ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

ఒక్క హామీ కూడా నెరవేరలేదు

బాబు సర్కార్‌పై జగన్ నిప్పులు

అనుమసముద్రంపేట, ఫిబ్రవరి 7: ముస్లిం మైనారిటీలను ఆదుకోవడంలో నాలుగు శాతం రిజర్వేషన్ అమలుకు శ్రీకారం చుడుతూ తన తండ్రి వైఎస్ ఓ అడుగు ముందుకు వేశారని, తాను అధికారంలోకి వస్తే వివిధ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి మరో అడుగు ముందుకు వేస్తానని వైకాపా అధినేత జగన్మోహనరెడ్డి స్పష్టం చేశారు. నాన్న ఫోటోతో నా తరువాత నా ఫోటోకూడా మీ ఇళ్లలో జత కలవాలని ఆకాంక్షిస్తున్నానని చెప్పుకొచ్చారు. బుధవారం ప్రజా సంకల్ప పాదయాత్ర సంగం నుంచి ప్రారంభమై ఏఎస్‌పేట మండలం హసనాపురం సమీపానికి చేరుకున్న సందర్భంలో ముస్లిం మైనారిటీలతో ప్రత్యేకంగా ఆత్మీయ సదస్సు నిర్వహించారు. జగన్ మాట్లాడుతూ బాబు పాలనలో అందరూ మోసపోయారని విమర్శించారు. అదే కోవలో ముస్లిం మైనారిటీలు సైతం నిలువునా దగాకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇస్లామిక్ బ్యాంక్‌లను నెలకొల్పి ముస్లిం యువతకు రూ.5 లక్షల వడ్డీలేని రుణాలు ఇస్తామన్న హామీ నెరవేరిందా అంటూ సభికులను ఉద్దేశించి సంధించిన ప్రశ్నకు అటు నుంచి లేదు...లేదు అంటూ సమాధానం హోరెత్తింది. ముస్లిం చిన్నారులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిందా అంటూ వేసిన ప్రశ్నకూ అదే మాదిరి సభ నుంచి సమాధానం వచ్చింది. తాము అధికారంలోకి వస్తే ముస్లిం ఇమామ్‌లకు నెలకు రూ.10వేలు, మౌజన్‌లకు రూ.5వేలను అందచేస్తామని హామి ఇచ్చారు. ఇవి అన్ని మసీదులకు అందేలా చూస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2018-19 బడ్జెట్‌పై తనకు అనుకూలంగా ఉండే మీడియాతో చంద్రబాబు చిటపటలాడుతున్నట్లు లీకులు పంపుతూ వార్తలు రాయించుకుంటాడని తప్పుబట్టారు. కేంద్ర కేబినెట్‌లో ఆమోదించిన తరువాత మాత్రమే పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెడుతున్నారన్నారు. అలాంటప్పుడు చంద్రబాబు తెలుగుదేశంకు చెందిన ఇరువురు కేంద్ర మంత్రులకు తెలిసి కూడా అక్కడ సమ్మతిస్తూ ఇక్కడ మొసలి కన్నీరు కారుస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. నిన్నటి కంటే నేడు, రేపుబాగుంటేనే అభివృద్ధి అంటారే తప్ప చంద్రబాబు పరిపాలనలో జరుగుతున్న అడుగడుగు మోసాలకు ఆ పదాన్ని ఆపాదించడం ఏమాత్రం సమంజసం కాబోదన్నారు.



భృంగి వాహనంపై ఆది దంపతులు

శ్రీశైలం టౌన్, ఫిబ్రవరి 7: శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆది దంపతులకు భృంగి వాహనసేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో సుగంధ పుష్పాలతో అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భృంగి వాహనంపై ఆశీనులను చేయించారు. హారతి, పూజల అనంతరం ఆలయ మాడావీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ముందుభాగంలో ప్రదర్శించిన కళారూపాలు భక్తులు ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవంలో దేవస్థానం ఈవో నారాయణ భరత్‌గుప్తా, అసిస్టెంట్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, ఏఈఓ కృష్ణారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి హంసవాహన సేవ నిర్వహిస్తారు.

ప్రతిపైసా కేంద్రానిదే

రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ నేత కన్నా విసుర్లు

అచ్చంపేట, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న ఖర్చులో ప్రతి పైసా కేంద్రప్రభుత్వం నుంచి వస్తున్న నిధులేనని, అయితే ప్రత్యేక విమానాల్లో తిరుగుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు వృథా ఖర్చులు చేస్తున్నారని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. ఇచ్చిన సొమ్ముకు లెక్కాపత్రాలు చూపకపోగా, కేంద్రంపై నిందారోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గుంటూరు జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అటవీప్రాంతంలో ఉన్న సత్తెమ్మతల్లి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం గింజుపల్లి వద్ద రైతులతో మాట్లాడారు. సిజెంట, బెడగి మిర్చి విత్తనాలతో పైరువేస్తే దిగుబడులు తగ్గాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ విత్తనాలు నకిలీవన్న అనుమానం కలుగుతుందని కన్నా ఎదుట వాపోయారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈ విషయమై అధికారులతో మాట్లాడతామని, దీనికితోడు రాష్ట్రప్రభుత్వం కూడా సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సంపూర్ణ గ్రామీణాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వాలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు అందిస్తోందని పేర్కొన్నారు. పోలవరంపై రాష్ట్రప్రభుత్వం రాజకీయం చేస్తుందని ఆరోపించారు. పట్టిసీమ నిర్మాణంలో బజారుకెక్కని రాష్ట్రప్రభుత్వం పోలవరంపై ఎందుకు బజారుకెక్కుతుందని ప్రశ్నిస్తూ కేంద్రప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవుపలికారు.

భూ అక్రమాలపై కేసు నమోదు

తుళ్లూరు, ఫిబ్రవరి 7: రాజధాని అమరావతి పరిధిలోని మందడం గ్రామానికి చెందిన భూ కుంభకోణంపై గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుత భూ సమీకరణ అధికారిణి కెఇ సాధన ఫిర్యాదు మేరకు నిందితులపై 420, 468, 478, 409 సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు సిఐ సుధాకరరావు తెలిపారు. ఈ మేరకు నిందితులు పఠాన్ గౌస్‌ఖాన్, కంప్యూటర్ ఆపరేటర్ సందీప్‌లను అదుపులోకి తీసుకున్నారు. కుంభకోణంపై దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలు గురువారం తెలియజేస్తామని పోలీసులు చెప్పారు.

ఖాళీ స్థలాలను ఆదాయ వనరులుగా మార్చండి

దేవస్థానానికి దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి సూచన

సింహాచలం, ఫిబ్రవరి 7: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానానికి హక్కులున్న ఖాళీ స్థలాలను ఆదాయ వనరులుగా మార్చాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ మన్మోహన్‌సింగ్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన శ్రీకృష్ణాపురంలోని వంద ఎకరాల నృసింహవనాన్ని పరిశీలించారు. ఇక్కడ సహజ ఎరువులతో సాగుచేస్తున్న కాయగూరలను ప్రత్యక్షంగా చూసిన ముఖ్య కార్యదర్శి ఆనందం వ్యక్తం చేసారు. దేవస్థానం భూములకు సంబంధించి ఈవో రామచంద్రమోహన్ వివరిస్తున్న సమయంలో ముఖ్య కార్యదర్శి ఖాళీ స్థలాలలో ఆదాయం వచ్చే చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికశాతం గ్రీన్‌బెల్ట్ ప్రాంతమేనని ఈవో సమాధానం చెప్పిన నేపథ్యంలో అవసరమైతే అటవీశాఖ, వ్యవసాయశాఖలతో సమావేశం ఏర్పాటు చేసుకొని ఒక ప్రణాళిక తయారు చేసుకుందామని ముఖ్య కార్యదర్శి అన్నారు. కొన్ని చోట్ల మునగ మొక్కలను పెంచే ప్రతిపాదన చేసామని ఈవో చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ,కేంద్ర మంత్రి అశోక్ గజపతి సూచనల మేరకు కొండ చుట్టూ కల్యాణ మండపాల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నామని ఈవో ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన ఆర్కిటెక్ట్ కృష్ణన్‌తో ముఖ్య కార్యదర్శి మాట్లాడారు. సాధారణ, మధ్య తరగతి ప్రజలు వివాహాలు చేసుకునే స్థాయిలో కల్యాణమండపాల నిర్మాణం చేయాని సంకల్పించినట్లు ఈవో ముఖ్య కార్యదర్శికి వివరించారు. దివ్యక్షేత్రం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఇంతవరకు చేపట్టిన పనులు, భవిష్యత్ ప్రతిపాదనలకు సంబంధించిన ప్రణాళికలను ఈవో ముఖ్య కార్యదర్శికి వివరించారు. మాస్టర్ ప్లాన్‌లో గోవులశాలను కూడా చేర్చాలని ముఖ్య కార్యదర్శి ఈవోకి సూచించారు. సుమారు వెయ్యి గోవులకు అవసరమైన విధంగా ఏర్పాట్లను విస్తరించాలని ఆయన ఈవోని ఆదేశించారు.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
గురువారం, 8 ఫిబ్రవరి 2018

'కశ్మీర్ కాండ'కు కారకులు?

జమ్మూ కశ్మీర్‌లో బీటలు వారిన భద్రతా వ్యవస్థ పోలీసులను, సైనికులను బలిగొంటోంది. 'పాకిస్తాన్ దురాక్రమిత కశ్మీర్'కూ, మనకు మిగిలి ఉన్న జమ్మూ కశ్మీర్‌కు మధ్య ఏర్పడి ఉన్న 'అధీన రేఖ'- లైన్ ఆఫ్ కంట్రోల్- ఎల్ఓసీ- పొడ వునా 'భద్రతాకుడ్యం'లో కన్నాలు పెరుగుతున్నాయి! ఈ కన్నాల గుండా పాకిస్తానీ జిహాదీ బీభత్సకారులు నిరంతరం చొరబడి వస్తున్నారు. అంతర్గత భద్రతా సౌధం నిండా దేశవిద్రోహులు రహస్య ద్వారాలు ఏర్పాటు చేసుకొంటున్నారు. ఇలాంటి రహస్య ద్వారాలు కశ్మీర్ లోయలో నిరంతరం విస్తరించడం ఆవిష్కృతం అవుతుండడం కొనసాగుతున్న బీభత్సం. నవీద్ జట్ అలియాస్ అబూ హంజుల్లా అనే పాకిస్తానీ జిహాదీ హంతకుడు మంగళవారం ఇలాంటి రహస్య ద్వారాన్ని తెరుచుకొని సురక్షితంగా పారిపోవడం భద్రతా ఛిద్రాలకు సరికొత్త ఉదాహరణ. కడుపునొప్పి సాకుతో శ్రీనగర్‌లోని జైలు నుంచి 'మహారాజా హరిసింగ్ వైద్యశాల'కు చేరగలిగిన నవీద్ అక్కడ నుంచి ఉడాయించడానికి వైద్యశాలలోని చికిత్సార్థులు సహకరించడం భద్రతా వ్యవస్థ డొల్లతనానికి ప్రమాణం.. చికిత్సార్థులలో చేరి ఉన్న ఇద్దరు దుండగులు నవీద్ వెంట ఉండిన ఇద్దరు పోలీసులను కాల్చి చంపి, నవీద్‌తో కలసి పారిపోయారు. వైద్యశాల ప్రాంగణంలో నిలిచి ఉండిన మోటార్ సైకిల్ ఎక్కి ముగ్గురూ పరారీ అయ్యే వరకూ భద్రతా వ్యవస్థ ఉలిక్కిపడలేదు. జమ్మూ కశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వ భద్రతావ్యవస్థ- పోలీసు యంత్రాంగంలో దేశద్రోహులు, పాకిస్తానీ జిహాదీలు, వారి సమర్థకులు చేరి పోయి ఉన్నారన్నది భద్రతా వ్యవస్థ వైపరీత్యం! 1990లో అప్పటి జమ్మూ కశ్మీర్ గవర్నర్ జగ్‌మోహన్ స్వయంగా ఈ దుస్థితిని వివరించడం చరిత్ర. జైలు నుంచి నవీద్‌ను వైద్యశాలకు తరలించిన సమయంలో అతగాడి వెంట కేవలం ఇద్దరు పోలీసులు మాత్రమే ఉండడం భద్రతా నిర్వాహకుల ఘోరమైన వైఫల్యానికి, క్రూరమైన నిర్లక్ష్యానికి నిదర్శనం. శ్రీనగర్‌లోను, కశ్మీర్ లోయలోను మాత్రమే గాక జమ్మూ ప్రాంతంలో సైతం జిహాదీలు, పాకిస్తానీ బీభత్సకారులు పోలీసు ఠాణాల మీద, సైనిక స్థావరాల మీద, సైనిక వాహన శ్రేణుల మీద ధైర్యంగా దాడులు చేస్తున్నారు. పోలీసులను, సైనికులను పొట్టన పెట్టుకుంటున్నారు. అందువల్ల కరడుకట్టిన, పేరుమోసిన నవీద్ అనే ఉగ్రవాది వెంట కేవలం ఇద్దరు పోలీసులను పెడితే చాలని నిర్ధారించిన అధికారుల క్రూరమైన నిర్లక్ష్యానికి ముస్తాక్ అహమ్మద్, బాబర్ అహమ్మద్ అనే పోలీసు సిబ్బంది ఈ నిర్లక్ష్యానికి బలిపోయారు. పాకిస్తాన్‌లోని 'ముల్తాన్'కు చెందిన ఈ నవీద్ 'లష్కర్ ఏ తొయ్యబా' ముఠా వాడు. షోపియా జిల్లాలోను, లోయ ప్రాంతంలోను అనేక మంది పోలీసులను, సైనికులను హత్యచేశాడు, గాయపరిచాడు. 2014లో పట్టుబడే నాటికే ఈ జిహాదీ ముష్కరుడు 'నర రూప రాక్షసుడి'గా పేరు మోశాడు. ఇలాంటివాడిని ఒకచోట నుంచి మరోచోటుకు తరలించే సమయంలో అతడిని విడిపించుకొని వెళ్లడానికి 'లష్కర్'లు ప్రయత్నించగలరన్న అనుమానం పోలీసు అధికారులకు కలగక పోవడం అంతుపట్టని వ్యవహారం!

అలాంటి అనుమానం కలిగి ఉండినట్టయితే మరికొందరు పోలీసులను, సైనికులను నవీద్ వెంట పంపి ఉండేవారు. వైద్యశాలలో 'చికిత్సార్థుల సమూహంలో' నవీద్ నిలుచుని ఉండిన సమయంలో అప్పటికే అక్కడ వేచి ఉండిన దుండగులు కాల్పులు జరిపారు. గుర్తు తెలియని ఇద్దరు 'సాయుధులు' చికిత్సార్థులలో కలిసిపోయి అక్కడ నిలబడ్డారు. నవీద్‌ను వైద్యశాలకు తరలించిన సమయంలో వైద్యశాల అధికారులకు పోలీసులు ముందుగానే సమాచారం అందజేసి ఉండాలి. వైద్యశాల ప్రాంగణంలో 'నిఘా' నయనాలు పర్యవేక్షణ జరిపి ఉండాలి. అలా 'నిఘా' నిద్దుర లేచి ఉండినట్టయితే నవీద్ వైద్యశాలకు చేరకముందే తుపాకులు మోసుకొని మోటార్ సైకిల్‌పై వచ్చి ఉండిన ముష్కరులు పట్టుబడి ఉండేవారు. వైద్యశాల ప్రధాన ద్వారం వద్ద ఉన్న 'రక్షకుడు'- సెక్యూరిటీ గార్డు-కాని, 'నమోదు గవాక్షం' వద్ద ఉండిన సిబ్బంది కాని ఈ సాయుధ ముష్కరులను గమనించక పోవడం, పట్టించుకొనక పోవడం అజాగ్రత్తకు మాత్రమే తార్కాణమా? లేక విద్రోహ వ్యూహ విస్తరణకు సాక్ష్యమా! 'నవీద్‌కు కడుపునొప్పి వచ్చి నట్టు, తరచూ అతగాడు కడుపునొప్పితో బాధ పడుతున్నట్టు' అతడిని మంగళవారం వైద్యశాలకు తీసుకువస్తున్నట్టు వేచి ఉండిన జిహాదీ సాయుధులకు ఎలా తెలిసింది? ఎవరు ఉప్పందించారు? నవీద్‌ను బయట తిప్పినట్టయితే అతగాడు పారి పోయే ప్రయత్నం చేస్తాడని జైలు అధికారులు గుర్తించి ఉండాలి. జైలుకే వైద్యులను, చికిత్స పరికరాలను రప్పించి ఉండాలి. అదేమీ జరగలేదు.

నవీద్‌తో పాటు పట్టుబడిన ఆరుగురు పాకిస్తానీ బీభత్సకారులను డిసెంబర్‌లో శ్రీనగర్ కేంద్ర కారాగారం- సెంట్రల్ జైలు- నుంచి జమ్మూ నగరంలోని కారాగృహానికి తరలించారు! కానీ నవీద్‌ను మాత్రం తరలించలేదు. నవీద్‌ను శ్రీనగర్ లోనే నిర్బంధించి ఉంచాలని ఒక స్థానిక న్యాయస్థానం ఆదేశించడం ఇందుకు కారణం. ఆ న్యాయస్థానం అలాంటి ఆదేశం జారీ చేయడమే విస్మయకరం. 'లోయ' ప్రాంతంలో పాకిస్తానీ ఉగ్రవాదులు, స్థానిక బీభత్సకారులు వికృత తాండవం చేస్తున్నారు. సైనికులపై నిరంతరం రాళ్లు రువ్వుతున్నారు. అందువల్ల కరడుగట్టిన నేరస్థులు, పేరుమోసిన పాకిస్తానీ బీభత్సకారులను శ్రీనగర్‌లో గాక జమ్మూలో నిర్బంధించాలన్నది భద్రతా వ్యూహం! కానీ నవీద్ తరఫున స్థానిక న్యాయస్థానంలో 'న్యాయ యాచిక' దాఖలు కావడం, న్యాయమూర్తి అతగాడికి అనుకూలమైన ఆదేశం జారీ చేయడం 'కశ్మీర్ కాండ'కు ఒక కొలమానం! ప్రభుత్వం నిర్బంధించిన చోట నేరస్థులను నిర్బంధించాలా? నేరస్థుడు కోరిన చోటనే అతగాడిని కొనసాగించాలా? అనేక దేశాలలో దేశద్రోహులు, శత్రుదేశాల మద్దతుదారులు, బీభత్సకారులు, శత్రుదేశాల గూఢచారులు పట్టుబడుతున్నారు. ఒకటి రెండు సంవత్సరాలలో వారి నేరాలను విచారించి దోషులను, నిర్దోషులను నిగ్గు తేల్చే న్యాయ ప్రక్రియ ఆయా దేశాల్లో జరిగిపోతుంది. కానీ మన దేశంలో మాత్రం ఇలాంటి బీభత్స హంతకులను విచారించి శిక్షించే ప్రక్రియ మూడు నాలుగు ఏళ్లలో పూర్తి కావడం లేదు. కొందరి విషయంలో దశాబ్దాలు తరబడి అభియోగాలు అపరిష్కృతంగా ఉన్నాయి. ఫలితంగా జిహాదీ దుండగులు ఏళ్ల తరబడి నిర్బంధ గృహాలలో సుఖజీవనం సాగిస్తున్నారు. ఇలాంటి పాకిస్తానీలు, పాకిస్తాన్‌కు కొమ్ము కాస్తున్న మన దేశంలోని ముష్కరులు తప్పించుకొని పారిపోవడం ఇది మొదటిసారి కాదు. 2010 అక్టోబర్‌లో మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లా కారాగారం నుంచి ఆరుగురు ముష్కరులు ఎత్తయిన గోడను దూకి పారిపోయారు. ఇద్దరు రక్షకులను తీవ్రంగా గాయపరచి ఉడాయించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే! జైలు నుంచి బయటకు సొరంగ మార్గాలను తవ్విన ఘటనలు కూడా వెలుగు చూశాయి. సిరియా వారి సహాయంతో తాను జైలు నుంచి పారిపోగలనని యాసీన్ భత్కల్ అనే జిహాదీ ఉగ్రవాది 2015 జూలైలో తన భార్యకు ఫోన్ చేసి చెప్పడం మన భద్రతా వైఫల్యం పట్ల బీభత్సకారులకున్న 'విశ్వాసానికి' మరో నిదర్శనం.

జమ్మూ కశ్మీర్‌లో కొనసాగుతున్న బీభత్సకాండకు మౌలిక కారణం 1947 నుంచి కొంత కశ్మీర్ పాకిస్తాన్ అక్రమ అధీనంలో ఉండడం. స్వాతంత్ర్యం వచ్చాక సర్దార్ వల్లభ భాయి పటేల్ ప్రధానమంత్రి అయి ఉండినట్టయితే పాకిస్తాన్ దురాక్రమిత కశ్మీర్- పీఓకే- సమస్య ఏర్పడి ఉండేది కాదని ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం లోక్‌సభలో చెప్పారు. 'పీఓకే' అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వైఫల్యానికి ఫలితం! కానీ ఇప్పుడు సైనికులపై నిరంతరం రాళ్లు వేయిస్తున్నవారు 'పీఓకే' నుంచి రాలేదు. 'లోయ' ప్రాంతంలోనే వీరందరూ పుట్టి పెరిగారు. ఈ జిహాదీ దుండగులను ప్రభుత్వాలు ఎందుకు శిక్షించడం లేదు? పట్టుబడిన వారిని ఎందుకు నిర్బంధం నుంచి విడుదల చేస్తున్నాయి?

జాతరమ్మ జాతర.. రాజకీయ జాతర!

గతించిన కాలాన్ని కాచి వడబోయడం కష్టసాధ్యం. నిన్నటి చరిత్ర నేటి తరానికి చేరడానికి అనేక పద్ధతులుంటాయి. అందులో ప్రజలే అసలైన చరిత్రకారులు. వివిధ కళారూపాల్లో ఆ గాథలను జనం మననం చేసుకుంటూ వుంటారు. ఆ గాథల్ని ఆధునిక చరిత్రకారులు అందుబాటులో వుండే ప్రాథమిక ఆధారాల్ని (శాసనాలు) దృష్టిలో పెట్టుకుని అనేక వ్యాఖ్యానాలు చేస్తూ వుంటారు. ఫలానా చరిత్రకారుడిదే సరైన కథనం అని నిగ్గు తేల్చడం కూడా జరగని పనే!

ఈ కోవలో కాకతీయుల నాటి కాలాన్ని అనగా మొదటి ప్రతాపరుద్రుడి (రుద్రదేవుడు) నుండి కాకతీయ సామ్రాజ్యం పతనమైన రెండో ప్రతాపరుద్రుని కాలానికి గల నాలుగు తరాల పలుకుబడిని కచ్చితమైన తేదీలతో, సంవత్సరాలతో చెప్పడం కష్టమే! అయినా రుద్రమదేవి మరణాన్ని 27 నవంబర్‌గా చెప్పినా, సంవత్సరాన్ని కచ్చితంగా (1289/1295) చెప్పని పరిస్థితి. వీరి ఏలుబడి కాలంలోనిదే కోయరాజు పడిగిద్దరాజు కథ. అయితే ఈ సంఘటనకు కొందరు మొదటి ప్రతాపరుద్రుడి కాలానికి ముడిపెడితే, మరికొందరు రెండవ ప్రతాపరుద్రుడి కాలానికి చెందినదని చెపుతారు. కొన్ని కథనాల్లోని యుగంధరుడి ప్రస్తావనను బట్టి, ఈ కథ రెండవ ప్రతాపరుద్రుడి కాలానికి చెందిందనే నిర్ధారణకు వస్తారు. ఇవన్నీ భిన్న పరికల్పనలైతే నాడు ఏం జరిగిందనేది మాత్రం ఒకే కథనం వినవస్తుంది.

కాకతీయుల కాలమంతా యుద్ధాలతో గడవగా, ముందుగా పశ్చిమ చాళుక్యులకు ఆ తర్వాత ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీకి సామంతులుగా వుండడం జరిగింది. అంటే పాలెగాళ్లుగా, కప్పం కట్టే వారన్నమాట! రుద్రమదేవి కాలంలో ఓరుగల్లును సందర్శించిన మార్కోపోలో కాకతీయుల వైభవాన్ని ఎత్తిపట్టి చూపినంతగా నాటి సామాజిక పరిస్థితుల్ని, అంతర్గత వైరుధ్యాల్ని, ప్రజలతో వున్న సంబంధాల్ని ప్రస్తావించినట్లు ఆధారాలేమీ లేవు. ఒకవేళ వాస్తవిక ఆధారాలేమైనా వుంటే చరిత్రను మరో కోణంలో అన్వయించే అవకాశం వుండేది.

ఈ మొత్తం వ్యవహారంలో పడిగిద్దరాజు నాయకత్వంలో ఆదివాసులు యుద్ధం చేసారని, ఈ యుద్ధంలో రాజుతోపాటు ఆయన కూతుర్లయిన సారలమ్మ, నాగులమ్మ, కొడుకు జంపన్న, అల్లుడు గోవిందరాజులు అసువులు బాయగా, (రాజకీయ పరిభాషలో చంపబడడం), భార్య సమ్మక్క యుద్ధం చేస్తూ గాయాలపాలై అటవిలోకి వెళ్లిందని, చిలకల గుట్ట ప్రాంతంలో కుంకుమ భరణి రూపంలో దర్శనమిచ్చిందని, ఆ ప్రదేశమే ఆమె బాలికగా ఆమెను పెంచిన మేడరాజుకు లభించిందనేది ఓ నమ్మకం. ఏదిఏమైనా రాజ వంశానికి చెందిన రాజుతోపాటు మొత్తం కుటుంబం మరో రాజ్యకాంక్షలో భాగంగా చంపబడ్డారు.

ఈ మారణకాండకు కారణమేంటని ప్రశ్నించుకుంటే, ఆధిపత్యంతో, అంగబలంతో, సామ్రాజ్య విస్తరణతో మరో ప్రాంత రాజ్యంపై దండెత్తడమని, ఆక్రమించడమని తెలుస్తుంది. లొంగనివారిని నయానా, భయానా చెరబట్టడమని, సామంతులుగా చేసుకుని బలవంతంగా కప్పం వసూలు చేయడమని- ఓ రాజకీయ పరిభాష! ఈ రాజకీయ పరిభాష అర్థమైతే, కప్పం కట్టేవారి ప్రజాస్వామిక హక్కుల్ని హరించడమేనన్నమాట! వరుసగా కరువు కాటకాలు రావడం, చివరికి వరప్రదాయిని అయిన గోదావరి వట్టిపోవడంతో పంటలే లేక ఆకలితో అల్లాడుతుంటే, కప్పం ఎలా కట్టగలమనేది కోయల వాదన! ఈ న్యాయమైన వాదనని మనం ఘనంగా కీర్తిస్తున్న కాకతీయులు గుర్తించకపోగా, గర్హించి యుద్ధాన్ని ప్రకటించి ఆదివాసులపై మారణకాండ సాగించడమే ఓ అప్రజాస్వామిక చర్య! దీన్నిబట్టి వీరు (కాకతీయులు) మరో రాజుకు సామంతులుగా వుంటూ స్వతంత్రాన్ని ప్రకటించుకుని రాజ్యవిస్తరణ చేయడం మనకు గొప్పగా అనిపిస్తుంది. కాని ఇదే ఆలోచన ఓ ఆదివాసీ రాజు చేయడం తప్పుగా తోస్తుంది. నేరంగా అనిపిస్తుంది. ఈ సంధి కాలంలో, అనగా దాదాపు ఏడు శతాబ్దాలుగా పాలించిన ప్రతి పాలకుడు కాకతీయ దర్పాన్నే ప్రదర్శించినా, ప్రజలు మాత్రం ఆదివాసుల పక్షాన్నే నిలబడడం గుర్తించబడని రాజకీయం మనది. అంటే ఆదివాసులే కరెక్టు, కాకతీయులదే తప్పు అని నిగ్గు తేల్చాల్సి వస్తుంది.

ఆనాడు ఆదివాసీ పోరాటాలు నేటికీ అదే గోదావరి పరీవాహక ప్రాంతంలో, దండకారణ్యంలో కొనసాగుతూనే వున్నాయి. నాడు, నేడు ఉనికి కోసం, చింతన లేని కునుకు కోసం, వున్న నేల కాళ్లకింది నుంచి కదలకుండా వుండడం కోసం జరుగుతున్నాయి. ఈ పోరాటాలన్నీ కూడా ఆయా రాజ్యాలకు వ్యతిరేకంగానే కావడం గమనార్హం! పోతే, అలనాడు అణచబడినట్లే, ఆదివాసులు నేడు కూడా అణచివేయబడుతున్నారు. రాజ్యహింసకు గురవుతున్నారు. ఇది వాస్తవమని గుర్తిస్తే, ఆదివాసుల హక్కులు కాలరాయ బడుతున్నాయని అర్థమవుతుంది. ఇది అర్థమైతే ఆదివాసుల్ని కాకతీయ దృష్టితో చూడలేము. అలాగే నేటి పాలకపక్షం భావజాలంతో కూడా చూడలేము. మరి ఇది జరుగుతున్నదా? జరిగే పనేనా? అనేది నేటి ప్రశ్న! ఈ వైరుధ్యాల్ని పట్టించుకోకుండా ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన ఓ నాయకత్వాన్ని సంబంధిత ఆదివాసులు స్మరించుకుంటూ, సంబురాల్ని జాతర పేరున చేసుకుంటుంటే, వారి హక్కుల్ని కాలరాసిన నాటి కాకతీయల పక్షాన ఆలోచించేవారు, నేటి పాలకుల స్వభావాన్ని సమర్థించేవారు ఆ సంబురాల్లో చొరబడి, తాము సైతం.. అంటూ జండాలెత్తడం ఏంటనేది ఓ ధర్మ సందేహం! ఈ సందర్భంగా ఆదివాసులు ఆరాధిస్తున్నప్పుడు మనం ఆరాధిస్తే తప్పేంటనే ప్రశ్న రావచ్చు. కాని ఆదివాసేతరులుగా వారి హక్కుల్ని ఎంతమేరకు గుర్తిస్తున్నామనేది అసలు సమస్య! దీనిపై విస్తృత చర్చ జరగాలి. అలా జరిగినప్పుడు విధిగా కాకతీయుల అణచివేత విధానాన్ని, వారి వారసులుగా చలామణి అవుతున్న నేటి పాలకుల్ని విభేదించాల్సి వస్తుంది. ప్రస్తుతం ఈ సాహసం మనం చేయగలమా?

నిజానికి ఆదివాసీ వన జాతర దాదాపు 1998 దాకా దండకారణ్యానికే పరిమితంగా వుండేది. ఆదివాసుల ఆచార వ్యవహారాల ప్రచారమే జరిగేది. నాటి జ్ఞాపకాలకు అనుగుణంగా పూజలు సాగేవి. ఒకప్పుడు వేలకు, తర్వాత లక్షలకు ఇప్పుడు కోటిమందికిపైగా హాజరయ్యే విధంగా జాతర ఎదిగింది. అయితే ఈ ఎదుగుదల భావాల పరంగా, ఆదివాసుల దైన్యస్థితిని దృష్టిలో పెట్టుకుని, వారి హక్కుల్ని నిలబెట్టాలని ఎదిగితే అభినందనీయమే! పైగా ఏ కాకతీయులకు వ్యతిరేకంగా ఆదివాసులు ధ్వజమెత్తారో, ఆ కాకతీయుల పేరునే స్వాగత ద్వారాన్ని నిర్మించడం ఏ రాజనీతో మనకు అర్థమై చావదు. అడవి తరగి, తారు రోడ్లతో ఆ ప్రాంతమంతా ధ్వంస రచన జరుగుతుంటే, అభివృద్ధి అని భ్రమిస్తున్నాం. పాలకులు ఇదే అభివృద్ధి నమూనా అంటున్నారు. ఇలా హాజరవుతున్న జనాల్లో ఆదివాసేతరుల సంఖ్య అధికం కాగా, అసలు సిసలు ఆదివాసులు తెరమరుగు కావడం జరుగుతున్నది. ఇంకా ఎదపైన మారుగుడ్డ లేని స్త్రీలు, బుడ్డ గోచి గాళ్లు.. మన వివిపిల రాక సందర్భంగా పక్కకు తొలగాల్సి వస్తున్నది. ఇలా జాతర నేపథ్యంలో ప్రభుత్వం మద్యం పేరున కాంట్రాక్టర్లు, ఇతర వ్యాపారులు ఆ పోరాట గాథల్ని సీడీలుగా మార్చి సొమ్ము చేసుకునే దళారులు భారీగా లబ్ధి పొందుతుంటే, అమాయక ఆదివాసులు ఇంకా నిస్సహాయలుగానే మిగిలిపోతున్నారు.

నిన్నటిదంతా గతించిన కాలమనుకుంటే, నేడు జరుగుతున్నది నిన్నటి చరిత్ర పునఃప్రస్తావనే! ప్రాజెక్టుల పేరున, ఖనిజ సంపద వెలికితీత పేరున పుట్టి పెరిగిన అడవిని ఆదివాసులు వీడాల్సి వస్తున్నది. అభివృద్ధి అనే అంకుశంతో హింసకు గురైతున్నారు. దీన్ని ఆపడం మన తరం కాకపోవచ్చు! కాని ఈ వైపుగా ఆలోచిస్తున్నామా అనేదే ప్రశ్న! ఆ ప్రాంత కోయలు, కొండరెడ్లు, గోండుల బాధలు తెలియాలంటే పోవల్సింది జాతరకు కాదు, ఆదివాసీ గూడేలకు. అక్కడికి వెళ్లి వారి గుండె చప్పుళ్లను వినగలగాలి. ఆ ఓపిక మనకు ఎలాగు లేదు. ఏ రాయికి మొక్కితే ఎంతో లాభిస్తుందోననే చింతనతో ఆదివాసులు ఓ నమ్మకంతో నిర్మించుకున్న సంస్కృతీ సంప్రదాయాలలో చొరబడడం వారి సంస్కృతిని ధ్వంసం చేయడమే అవుతుంది. ఈ మేడారం జాతరకు పోయేవారికెవరికైనా షెడ్యూల్డు ఏరియా నిబంధనలు, 1/70 చట్టం, పెసా రాజ్యాంగ బద్ధత గూర్చి ఏమైనా తెలుసా? అవి అనునిత్యం ఉల్లంఘనకు గురైతున్న విషయం తెలుసా? వీరికి తెలిసిందల్లా ఎలా కోట్లకు పడగెత్తాలి, రాజకీయాల్లో ఎలా రాణించాలి, కాంట్రాక్టులు ఎలా కొట్టేయాలి, రియల్ ఎస్టేట్‌లో ఎలా సంపాదించాలి, పిల్లల్ని ఐఐటి, ఐఐఎంలలో ఎలా చేర్పించాలి, ఐఎఎస్‌లుగా ఎలా తీర్చిదిద్దాలి, అమెరికాకు ఎలా ఎగిరించాలనే స్వార్థ చింతన తప్ప ఆ ఆదివాసులు ఏ లక్ష్యం కోసం పోరాడారనేది ఏనాడు పట్టదు. సమ్మక్కకు, సారలమ్మకు పొర్లు దండాలు పెడితే, అనుకున్న లక్ష్యం నెరవేరుతుందనే అత్యాశ తప్ప మరొకటి కాదు.

నేటి ఆదివాసులే ఈ దుస్థితిలో వుంటే 7 దశాబ్దాల క్రితం వారి పూర్వీకుల దైన్యస్థితి ఎలా వుండేదో అర్థం చేసుకోవాలి. అలాకాకుండా ఆదివాసులు పెంపొందించుకున్న నమ్మకాల్ని శాస్త్రీయంగా ఆలోచించకుండా, వారిని ఎదిరించకుండా వారిని అలానే మగ్గేలా చేయడమే నేడు రాజకీయాలుగా మారడం శోచనీయం!

- డా. జి.లచ్చయ్య సెల్: 94401 16162

'జమిలి'కి ఇది సమయం కాదు సుమా..!


వీరాజీయం
veeraji.columnist@gmail.com

నిజానికి 'ఒక్క ఐడియా దేశాన్ని మార్చేస్తుంది' అన్నమాట జిఎస్‌టి విషయంలో ఏమో గానీ, జమిలి ఎన్నికల విషయంలో చలామణి అయ్యేటట్లు లేదు. అయినా ప్రధాని నరేంద్ర మోదీజీ మనసులో మాట కనుక దేశవ్యాప్తంగా అది చర్చలలో షికార్లు కొడుతోంది. దేశంలో మొట్టమొదట 1952లో ఒకేసారి ఎన్నికలు జరిగాయి కాని, 1954లోనే కొత్త రాష్ట్రాలు కేరళ, పంజాబు పోలింగ్ బూత్ వైపు పరుగులు తీశాయి. ఎన్నికలు జరిగాక అనుకోని అవాంతరాలు, అత్యవసర పరిస్థితులు వస్తే తప్ప కొత్త ఎన్నికలు రాజ్యాంగ రీత్యా సాధ్యం కావు. అయితే దేశవ్యాప్తంగా లోక్‌సభకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలైపోతే అక్కడితో స్థిరంగా- కేంద్రంలోను, రాష్ట్రాలలోను కూర్చుని పరిపాలన కొనసాగింవచ్చు అన్న ఆశ- కేవలం రంజు అయిన చర్చలకు మాత్రమే బాగుంటుంది తప్ప అది ఆచరణ సాధ్యమా? అన్నది కేవలం ప్రధాని మోదీ మనసులోనే- ఇంకా శిశువుగా పాలు తాగుచున్నది. అయితే, ఈ 'జమిలి' ఎన్నికల ఐడియా ఇదివరకే- వెంకయ్య నాయుడి మాటల్లో చెప్పాలి అంటే 'లోహ పురుషుడు' లాల్‌కిషన్ అద్వానీ తన మనసులో మాటగా- 2012లోనే జమిలి ఎన్నికల ఐడియాని అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి లేఖాస్త్రం సంధించి మరీ తెరమీదకి తెచ్చాడు.

కానీ, దేశంలో రాజ్యాంగ స్ఫూర్తితో నెలకొన్న ఫెడరల్ సిస్టం- కీడెంచి మేలెంచమన్నట్లున్నది. కేంద్రం దారి కేంద్రానిదే, ప్రాంతీయ ఎన్నికల దారి వాటిదే అన్న రీతి ప్రజాస్వామ్యాన్ని మూడు సంక్షోభాలు- ఆరు ఆందోళనలుగా ఎన్నికల జాతరలు కొనసాగాయి. ఓడిపోయిన పార్టీ తపన ఆగకుండా మళ్లీ ఎన్నికల దాకా ఆర్తనాదాలు చేస్తునే ఉంటుంది. ఈ నేపథ్యంలో నుంచి సంకీర్ణ రాజకీయాలు పుట్టొకొచ్చాయి. వింత పొత్తులు, విచిత్ర పార్టీ కలయికలు ఇవన్నీ 'కిస్సా కుర్సీకా' చూపెట్టిన మాటలే.. అదంతా ఓ నాటి భారతం- ఎన్‌డిఏ, యుపియ్యేలు ఏర్పడ్డాక దేశ రాజకీయాలు లూజుగానే అయినా రెండు ముఖ్య కూటములుగా స్థిరపడటంతో కేంద్రంలో ఈ భావం మారిపోయింది.

కేంద్రం తీరు ఒకటి, రాష్ట్రాల రీతి మరొకటిగా వుండి- భారతీయ జనతాపార్టీ పుంజుకోవడానికి దారితీసింది. కానీ, బండ మెజారిటీ వున్న పార్టీకి బాస్- అరివీర భయంకరుడయిన నరేంద్ర మోదీ బుర్ర నిండా నిత్యనూతనంగా- నోట్ల రద్దు మొదలు జిఎస్‌టి దాకా ఐడియాలు రావడంతోబాటు- దేశ పటం తెల్లరిపాటికి అలాగే వుంటుందా? అన్నది అనుమానం అయిపోయింది. అనడానికి 'సబ్కా సాథ్' అంటున్నా హమారా హుకుం జారీ రహేగా- అన్న ధోరణి పార్టీలోనూ, దేశంలోనూ తలఎత్తుతున్న దశలో విపక్ష హోదా సంపాదించుకోలేకపోయినా- ఇంగువ కట్టిన గుడ్డగా మిగిలిన కాంగ్రెస్ పార్టీమీద- సానుభూతి ఒకటి 'పిల్లతెమ్మరలుగా' ఎదురురావడం- పోయిన సంవత్సరం జరిగిన ఆరు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో కొంచెం కొంచెంగా మోదీజీ, అమిత్‌షాలకి కాస్త ఎదురుదెబ్బలా తగిలింది. 'ఏ భాయ్ జరా దేఖ్కే చలో' అన్న వార్నింగ్ బెల్స్ కొట్టాయి. దక్షిణాదిన ప్రాంతీయ పార్టీల జోరుని, తీరుని కూడా మోదీ గాలి నిలవరించలేకపోడం- ఇవాళ్టి వర్తమాన దేశ రాజకీయ 'చిత్రం'. కేంద్రంలో పాతుకుపోయిన పార్టీలో ఉలికిపాటుకు తెచ్చింది. యుపిలో యోగిని పెట్టగలిగినంత యోగం కలిసివచ్చినప్పటికీ - మోదీ సొంత గడ్డ గుజరాత్- అప్రతిహత అఖండ విజయాలన్నమాటకి- సొడ్డు పెట్టిన రీతిలో కంగు తిన్పించాయి. పంజాబ్ కాంగ్రెస్ పార్టీకి నూకలు చెల్లలేదనీ- రుజువు చేస్తే 'కాంగ్రెస్ ముక్త్ భారత్' కాదు సామీ- కష్టాలు లేని సంక్షేమ రాజ్యం కావాలని ప్రజలు ఎలుగెత్తినట్లయింది. పోలింగు బూత్‌ల దగ్గర- ఏటిఎం క్యూల క్షోభని జనం వెళ్లబోసుకుంటూ ముందుకు సాగడాన్ని చూడలేదు. భాజపా పార్టీని 'థింకు ట్యాంకు- థింకు ట్యాంకు' అంటూ ఎవరన్నారు? అది 'అమిత్ షా మోదీజీలేగా.

మోదీ సంస్కరణలు- కొన్ని రాష్ట్రాల ప్రజలలో చాలామందికి ఇష్టం లేదేమో అన్న అనుమానం- గుజరాత్ ఎన్నికలు- గట్టి దెబ్బతీసి మరీ రుజువు చేయడంతో- 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అన్న ఐడియాకి బలం చేకూరింది. ఒకేసారి ఎన్నికలు - అసెంబ్లీకి, లోక్‌సభకి చేసి పడేస్తే బోలెడంత ఖర్చు, సమయం ఆదా అవుతాయి అన్న మనసులోని మాట గట్టిగా బయటపెట్టారు. దీనికి వూతంగా కాంగ్రెసు రాజ్యసభ్యుని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నాచప్ప సుదర్శన్ కమిటీ కూడా జమిలికి జై అన్నది. ఒకేసారి సామూహిక సత్యనారాయణవ్రతం లాగా,



అనడానికి 'సబ్కా సాథ్' అంటున్నా హమారా హుకుం జారీ రహేగా- అన్న ధోరణి పార్టీలోనూ, దేశంలోనూ తలఎత్తుతున్న దశలో విపక్ష హోదా సంపాదించుకోలేకపోయినా- ఇంగువ కట్టిన గుడ్డగా మిగిలిన కాంగ్రెస్ పార్టీమీద- సానుభూతి ఒకటి 'పిల్లతెమ్మరలుగా' ఎదురురావడం- పోయిన సంవత్సరం జరిగిన ఆరు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో కొంచెం కొంచెంగా మోదీజీ, అమిత్‌షాలకి కాస్త ఎదురుదెబ్బలా తగిలింది.

కళ్యాణ మహోత్సవంలాగా లాగించేస్తే- ఎంతో ఖర్చు, సమయం, శ్రమా వగైరా కలసివస్తాయి అన్న ఐడియా సారుగారి బుర్రలో బాజా వాయించేస్తోంది. హల్లో సీఈసీ సారూ.. మీరేమంటారు? అంటే- మేము రెడీ అన్నారు కొత్త ఈసీ బాస్ గారు కూడా.

1952 తరువాత ఏకాండీ ప్రక్రియగా ఎన్నికలు సాధ్యం కాలేదు.. ఒక్క ఆంధ్ర, తెలంగాణ, సిక్కిం, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్‌లలో మాత్రం- ఒకేసారి కేంద్రానికి, రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జమిలిగా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ అధికారిక బాకాయేగా రాష్ట్రపతి ప్రసంగం- ఇటీవల రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగంలో కూడా జమిలి ఐడియా చోటుచేసుకున్నది. దేశం అంతా ఒకటే ఎన్నికలు, ఒకటే అవ్వాలి అన్న మోదీజీ ఐడియా బ్రహ్మాండమే గానీ రాజ్యాంగం సమాఖ్య ప్రతిపత్తిని ఉటంకిస్తూనే పురుడు పోసుకున్నందున ఒక రాష్ట్రంలో గవర్నమెంటును తీసేసి జనరల్ ఎన్నికల దాకా ప్రక్కన కూర్చోబెట్టి- మేము వున్నాం సెంటర్లో పాలిస్తాము అంటే కుదరదు. అసెంబ్లీలో మెజారిటీ పోగొట్టుకున్న పార్టీ బేరసారాలు చేసుకోవచ్చును- మధ్యంతర ఎన్నికలకు రెడీ అవవచ్చును- మనసులో మాట అక్కడ చెల్లదు- చలో మంటూ ఎన్నికలకి ఏర్పాట్లు చెయ్యడం ఈసీ విధి అయితే వాటిని నిర్వహించడం కేంద్ర సర్కారు పని- మోదీజీ ఐడియాకి ఎదురులేదు, ఎందుకంటే మోదీ గాలి అంటారో, వేవ్ అంటారో అది ఆయన విమానాలలో తిరుగుతున్నప్పుడు క్షణక్షణానికి జోరందుకున్నందువల్ల భాజపా ఎదురులేని పార్టీ అయ్యింది. ఓ పెద్దాయన అంటే- సీనియర్ సిటిజనుడు జోకేడు కూడాను.. 'ఆయనకేమిటండీ.. ఇంట్లో ఇల్లాలి పోరు లేదు- పార్లమెంటులో విపక్షాల పోరు జోరు రెండూ నాస్తి.. విదేశాలలో పూల రంగడేన'ని. అరవై తొమ్మిది సంవత్సరాల చరిత్రలో నవంబర్ ఎనిమిది డేటు (పెద్దనోట్లు రద్దు) మరొక్కటి రాదు.


ఒకే దేశం కనుక ఒకే పన్ను - జిఎస్‌టి తెచ్చిన మేధావికి- ఆధార్ కార్డు మీద సుప్రీం కోర్టుని తల బద్దలు కొట్టుకునేలాగ చేస్తున్న ఆయన మరో ఆంబిషన్ పెట్టుకున్నాడు. దేశంలో ఎక్కడా కాంగ్రెస్ పార్టీ 'నక్కో'- కాంగ్రెస్సు రహిత దేశ్ అన్నాడు- గరీబీ హటావో అన్నట్లు- కాని ఇంగువ కట్టిన గుడ్డ- పార్టీ- గుజరాత్‌లోనే దాక్కొని వుంది సుమా అని తెలిసింది. ఎన్నికలకి వెళ్ళడం బెటరా? అన్న ఐడియా కూడా వస్తోంది. ఎన్నికలంటే మాటలా? ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యం- అంటే అతి పెద్ద వోటర్లేగా. అతి ఎత్తుఅయిన హిమాలయాలు- అయ్యా! అలాగే అతి లోతయిన హిందూ మహాసముద్రము- ఇక్కడే వున్నట్లు ఇరవై తొమ్మిది రాష్ట్రాలు- అరవై రకాల ఆలోచనలు వున్నాయి. ఎన్నికల సంఘం వారి లెక్కల ప్రకారం జనరల్ ఎన్నికలకు, చెలరేగే హింసాతిరేకానికి కూడా లెక్కలున్నాయ్- ఎన్నికలకి మొత్తం ఎనిమిది వేల కోట్ల రూప్యములు 'ఖర్చ్ కర్నా పడేగా..' అనగా ఏటా భారీగా ఖర్చన్న మాట- వోటర్ల సంఖ్యతో తులాయించి చూస్తే ఓటరు ఒక్కింటికి ఇరవై ఏడు రూపాయలు పడుతుందని పేపర్లో చదివాను- అమ్మో? అని గుండె బాదుకునే ఖర్చు కాదిది. శాంతి భద్రతలకి- పార్టీ ప్రతిష్ఠకి- అభ్యర్థి అవసరానికి మత్రమే పై ఖర్చు. పైగా కేంద్రంలో ఆపద్ధర్మ ప్రభుత్వం రాష్ట్రాలలో ప్రెసిడెంటు రూలు పెట్టి- అన్నిరకాల ఎన్నికలని ఓ గాట కట్టాలి అంటే సరంజామా ఏదీ? మందీ మార్బలం ఎక్కడివాళ్లక్కడ పనికిరారాయే.. సైన్యం దిగి యుద్ధం కోసం రెడీగా వుంటే తప్ప- పార్టీల పౌరుషం ఆగదాయే- ఈలోగా ఓ స్పీడు బ్రేకరు వచ్చింది- రాజస్థాన్ అనే సొంత స్టేటులో మూడు సీట్లు- అందులో రెండు పార్లమెంటు స్థానాలు పోయేయి. భారీ లాస్‌గా సోదిలోకి రాకుండా చేద్దామనుకున్న పార్టీ- పైలట్ సచిన్ అనే కుర్రాడి ఆధ్వర్యంలో గెలిచింది- బెంగాల్ సంగతి పక్కనబెట్టండి. అక్కడ ప్రాంతీయ పార్టీ వుంది.

ఎన్నికలు ఈ ఏడాది లేవు కాని ఈ ఏడాది ఎన్నికలకి పోయే రాష్ట్రాలో కర్ణాటక, మధ్యప్రదేశ్‌లతో బాటు రాజస్థాన్ కూడా వున్నది. రెండు పార్లమెంటు స్థానాలు పోవడం అంటే పదహారు అసెంబ్లీ సీట్లు, ప్లస్ పోయిన ఒక సీటు కలిపితే మొత్తం పదేడు విధానసభ సీట్లకి సొడ్డు అన్నమాట. అవతల దక్షిణాదికి మోదీజీకి వేవ్‌లెంగ్త్‌లో బాగా డిఫరెన్స్.. పోనీ-ఇటు ఈసీ రిపోర్టు చూద్దామా? అంటే జమిలికి సూత్రప్రాయంగా రెడీ కాని 2018 దాకా సాధ్యం కాదు- ఇప్పుడేగా మీరు నిధులు మంజూరు చేసారు అన్నాడు ఈసిగారు- మహారాష్ట్రలో గ్రామాల్లో హీటు ఎక్కువయిపోయింది- అందుకనే బడ్జెట్‌ను సీనియర్ (విమర్శకులు వాళ్లేగా) సిటిజనులని - రైతుల్నీ దువ్వడానికి వాడుకున్నారు. వచ్చేసారి 2024 నాటికి ఇంకా 'అచ్చాదిన్ వస్తాయేమో?' ఈలోగా జమిలికి రెడీ అవుదాము అనుకోక తప్పదు మోదీజీకి

బెటర్ ఫేస్ ది అసెంబ్లీ ఎలెక్షన్స్.. ఫస్ట్.. గో టు కర్నాటక..!

పసితనం వర్ధిల్లుగాక!

ఉపాధ్యాయునికి తరగతి గది గొప్ప వరం లాంటిది. అందుకు ప్రతి ఉపాధ్యాయుడు రుణపడి ఉండాలి. కొన్ని పాఠాలు చెబుతూంటే స్వతహాగా ఉపాధ్యాయుని మీదకు ఏదో తెలియని పసితనం ఆవహిస్తుంది. ఉదాహరణకు నాకు ఇప్పటికీ ఆ వడ్డీ లెక్కలు చెబుతున్నపుడు రైతులు, పేదలు పడే క్షోభ నాకళ్ల ముందు కనపడుతుంది. ఆ ఘడియలో ఒక ఉద్రేకం వస్తుంది. బహుశా చరిత్ర ఉపాధ్యాయునికి కూడా ఇలాంటి ఉద్రేక సంఘటనల గురించి తరగతి గదిలో పిల్లలకు చెప్పవలసి ఉంటుంది. సైన్స్ టీచర్ మున్సిపల్ వాటర్‌లో పురుగులను చూసి ఆందోళన చెందుతాడు. మూత్రపిండాల మార్పు జరుగుతుంటే ఎంత చలిస్తాడో, మూత్రపిండాల అమ్మకం గురించి విని ఉపాధ్యాయుడు



అంతే ఆవేదన చెందుతాడు. ఇలాంటి సంఘటనలు చెబుతున్నపుడు అనుభవించే పరిస్థితి సబ్జెక్టుతో వచ్చే ప్యాషన్ అది. ఓ మంచి పాఠాన్ని ఎన్నిసార్లు చెప్పినా కానీ అది చెబుతున్నపుడు టీచర్ భావాలు, పోకడలు, హావభావాలు, ముఖ కవళికలు పిల్లల మనోఫలకంపై తప్పకుండా పడతాయి. బోధించే అంశంలో ఇమిడి ఉన్నటువంటి లక్షణం అది. టీచర్ బోధనలో తనను తాను మరచిపోతాడు. ఈ దృశ్యం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ క్లాసులు చెప్పే ప్రొఫెసర్ వీరభద్రునిలో చూశాను. ఆయన షేక్స్‌పియర్ పాఠం చెబుతున్నపుడు ఒక్కొక్క దృశ్యాన్ని కళ్లకు కట్టినట్టు తన ముఖవర్చస్సును మార్చి పాఠంలో లీనమై బోధన చేసేవాడు. ఆ పాఠం వింటుంటే పిల్లల్లో ఉద్రేకం కలిగేది. అదే దృశ్యాన్ని ప్రొఫెసర్ దివాకర్ల వెంకటావధాని 'శాకుంతలం' పాఠం చెబుతుండగా చూశాను.

ఉపాధ్యాయుడిగా కొందరు నన్ను చూసి- 'నీకు 90 ఏళ్లు వచ్చినా పసిపిల్లల లక్షణం పోలేదు' అని అంటారు. ఆ సంబంధిత సబ్జెక్టు బోధించడం వల్ల వచ్చిన లక్షణం అది. అది ఒక రకమైన ప్యాషన్. పాఠాలు చెప్పే ఉపాధ్యాయునికి ఆ ప్యాషన్ ఎక్కడి నుంచి వస్తుందంటే- పాఠం నుంచి వస్తుంది. మాతృత్వానికి ప్యాషన్ ఆ తల్లి పురిటినొప్పులలో అంతర్లీనంగా ఉంటుంది. సంకెళ్లు తెగుతున్నపుడు, బానిస బంధనాలు విడిపోతున్నపుడు ఆ ఘడియల్లో కలిగే అనుభూతి గొప్పది, అది మాటలకు అందనిది. ఏటా ఆగస్టు 15 వచ్చిందంటే ప్రతి భారతీయుని దృక్పథమే మారిపోతుంది. కొన్ని రోజుల్లో కొన్ని వస్తువుల్లో ప్యాషన్ ఇమిడి ఉంటుంది. అందుకే- తరగతి గదే కదా ఉపాధ్యాయునికి దక్కిన గొప్ప వరం. ఈ పసితనం కలకాలం వర్ధిల్లుగాక!

- చుక్కా రామయ్య

ఆధార్ సమాచారం పూర్తిగా సురక్షితం

లోక్‌సభలో మంత్రి రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఆధార్ సమాచారం బయటకు వెల్లడయ్యే అవకాశం ఏమాత్రం లేదని, ఇది పూర్తిగా సురక్షితమని, ఈ పథకాన్ని దేశంలో ఎక్కువమంది విశ్వసిస్తున్నారని కేంద్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. లోక్‌సభలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ ఆధార్ దేశాన్ని కీలక మలుపు తిప్పిన పరిణామమని ఆయన చెప్పారు. ప్రస్తుతం 120 కోట్లమంది ఆధార్ కార్డులు పొందారని, 57 కోట్ల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయించుకున్నారని, అందువల్ల 57వేల కోట్ల రూపాయలు పొదుపు సాధ్యమైందని రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆధార్ లేనిపక్షంలో ఈ మొత్తం అక్రమార్కుల జేబుల్లోకి చేరేదని చెప్పారు. మనదేశంలో రూపొందించిన విశిష్ట గుర్తింపు సంఖ్య విధానం (ఆధార్) అద్భుతంగా, బహుళ అంచెల్లో బలమైన వ్యవస్థగా రూపొందించారని వివరించారు. అదేసమయంలో ఈ సురక్షిత విధానాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తూ సమాచార భద్రతకు, గోప్యత, సమగ్రత లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు.

ఏపీకి అన్యాయం

కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ ఎంపీ జయదేవ్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందని గుంటూరు టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ విమర్శించారు. విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను పదేపదే మోసం చేయాలేరని ఆయన అన్నారు. బుధవారం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ రాష్ట్రానికి కీలక కేటాయింపులు లేవని మిత్రపక్షాలకు బీజేపీ ఇచ్చే సంకేతాలు ఇవేనా? అంటూ నిలదీశారు. 2014లో బీజేపీతో కలిసి ఎన్నికలకు వెళ్లి ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చామని గల్లా చెప్పారు. తీరా వాస్తవంలోకి వస్తే ఏపీకి కేంద్రం వల్ల వొనగూరిందేమీ లేదని దుయ్యబట్టారు. ఇప్పటి వరకూ మిత్ర ధర్మాన్ని అనుసరించి ఎదురు చూశామని ఇంకా సహనం తమ వల్ల కాదని ఆయన హెచ్చరించారు. రాజకీయంగా కాకుండా ఏపీ గురించి కేంద్రం ఆలోచించాలని అన్నారు. విభజన హామీలు అమలు ఐదు కోట్ల ప్రజలకు ప్రధాని ఎటువంటి సంకేతాలు ఇస్తున్నారని సమాధానం చెప్పాలని కోరారు. విభజన చట్టం అమలుపై అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభ సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 29 సార్లు ఢిల్లీకి వచ్చి విభజన హామీలు అమలుపై కేంద్ర పెద్దలను కలిసి పలుమార్లు విజ్ఞప్తి చేశారని జయదేవ్ గుర్తుచేశారు. ఇప్పటి వరకు విభజన చట్టంలోని 19 అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని చెప్పారు.

టీడీపీ ప్రభుత్వం అవినీతిమయం

వైఎస్‌ఆర్‌సీపీ ధ్వజం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వం అడ్డూఅదుపూలేని అవినీతికి పాల్పడుతోందని వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ వరప్రసాద్‌రావు ఆరోపించారు. బుధవారం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన పాల్గొని ప్రశంగించారు. టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై వరప్రసాద్‌రావు, వైవి సుబ్బారెడ్డి ఘాటుగానే స్పందించారు. గల్లా వ్యాఖ్యలకు అభ్యంతరం వ్యక్తం చేశారు. జయదేవ్ తమ పార్టీ నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, తమ అధినేత ఇక్కడ లేనప్పుడు వారి గురించి ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. జయదేవ్ తీరు పార్లమెంటరీ నిబంధనలకు పూర్తి విరుద్ధమని విమర్శించారు. జయదేవ్ తీరుపై డిప్యూటీ స్పీకర్ జోక్యం చేసుకుని అన్‌పార్లమెంటరీ పదాలు ఉంటే తొలగిస్తున్నట్టు ప్రకటించారు. వరప్రసాద్‌రావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఏపీ ప్రభుత్వంపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. మిత్రపక్షంగా ఎన్డీయేలో కొనసాగుతూ విభజన హామీలు అమలు చేయించడంలో టీడీపీ ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. మూడున్నరేళ్లుగా అధికారంలో ఉండి ఇప్పుడు తప్పులు వెతుకుతున్నారని, ఎన్డీయే నుంచి విభజన హామీలు అమలు విషయంలో ఎప్పుడో రాజీనామా చేసి ఉండాల్సిందని అన్నారు.

హామీలు అమలుచేయాలి

ఎంపీ జితేందర్‌రెడ్డి డిమాండ్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీఆర్‌ఎస్ లోక్‌సభ పక్షనాయకుడు జితేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జితేందర్‌రెడ్డి లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్నారు. గత ఏడాది ఫిబ్రవరి నెలలో తెలంగాణకు ఎయిమ్స్ కేంద్రం ప్రకటించిందని కాని ఇప్పటివరకు నిధులు కేటాయించలేదన్నారు. ఆర్థికమంత్రి జైట్లీ లోక్‌సభలో ఇచ్చిన హామీ అమలు కాకపోతే ఏలా? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వంపై నమ్మకం ఎలా వస్తుంది? తక్షణమే కేంద్రం ఎయిమ్స్‌కు నిధులు కేటాయించాలని కోరారు. విభజన సందర్భంగా ఏపీకి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కాగా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ గందరగోళంగా ఉందని, ఎవరికి ఏం ఇచ్చారో అర్థం కాని పరిస్థితి నెలకొందని జితేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. విభజన హామీలను రెండు రాష్ట్రాలకు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

డ్రైవింగ్ లైసెన్సులకూ ఆధార్ అనుసంధానం

- కొనసాగుతున్న ప్రక్రియ
- నకిలీ లైసెన్సుల ఏరివేత లక్ష్యం
- అన్ని రాష్ట్రాలకు ఒకే సాఫ్ట్‌వేర్
- సుప్రీంకోర్టుకు రహదారి భద్రతా కమిటీ నివేదిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: డ్రైవింగ్ లైసెన్సులకు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని, నకిలీ డ్రైవింగ్ లైసెన్సులను ఏరివేసేందుకు వీలుగా అన్ని రాష్ట్రాలకు వర్తించే సాఫ్ట్‌వేర్‌ను అనుకున్న సమయంలోగా సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతోందని రహదారి భద్రతా కమిటీ సుప్రీంకోర్టుకు తెలిపింది. సర్వోన్నత న్యాయస్థానం నియమించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.ఎస్.రాధాకృష్ణన్ సారథ్యంలోని రహదారి భద్రతా కమిటీ ఈ విషయాన్ని జస్టిస్ మదన్ బి లోకూర్, దీపక్ గుప్తాతో కూడిన ధర్మాసనానికి బుధవారం నివేదించింది.

ఆధార్ పథకానికి రాజ్యాంగపరంగా చెల్లుబాటు ఉందా అని సవాలు చేస్తూ దాఖలైన వివిధ పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ప్రస్తుతం విచారిస్తున్న నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యత సంతరించుకుంది.

గత ఏడాది నవంబర్‌లో జాతీయ రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శితో భేటీ అయ్యామని, రహదారి భద్రత, నకిలీ డ్రైవింగ్ లైసెన్సుల గుర్తింపు, వాటి నిర్మూలన వంటి అంశాలను చర్చించామని ఆ కమిటీ తన నివేదికలో వివరించింది. నకిలీ లైసెన్సులను గుర్తించి నిర్వీర్యం చేసేందుకు ఉపకరించే సాఫ్ట్‌వేర్ 'సార్థ్-4'ను జాతీయ గణాంకాల సంస్థ రూపొందిస్తోందని కమిటీ తెలిపింది. దీనివల్ల అన్ని రాష్ట్రాలలోని డ్రైవింగ్ లైసెన్సులను ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయాల్సి ఉంటుందని, అన్ని రాష్ట్రాలకు ఒకే సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానం ఉంటుందని ఆ నివేదికలో పేర్కొంది. ఆయా డ్రైవింగ్ లైసెన్సులకు నకలు తయారు చేయడం లేదా నకిలీలను సృష్టించడం ఎవరికీ, ఏ సంస్థకూ ఇక సాధ్యం కాదని స్పష్టం చేసింది. రహదారి భద్రతా కమిటీ న్యాయవాది కోర్టుకు ఈ నివేదికలోని అంశాలను వివరిస్తూ ఈనెల 22, 23 తేదీలలో కమిటీ మరోసారి జాతీయ రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ అధికారులతో భేటీ అవుతుందని చెప్పారు. కాగా రోడ్డు ప్రమాదాల వల్ల సంభవిస్తున్న మరణాల సంఖ్య 2016తో పోలిస్తే 2017లో మూడు శాతం తగ్గాయని మంత్రిత్వశాఖ తరపున వాదిస్తున్న అడిషనల్ సొలిసిటర్ జనరల్ పింకీ ఆనంద్ ధర్మాసనానికి విన్నవించారు.



బాబోయ్ బీ-52

క్షణాల్లో శత్రువులు నిశ్శేషం ● 96 గంటల్లో తాలిబన్ శిబిరాలు నేలమట్టం

వాషింగ్టన్, ఫిబ్రవరి 7: చూడ్డానికి అదో మహా పర్వతం. గాల్లో ఎగురుతున్నట్టుగా కనిపిస్తుంది. ఇక దాన్నుంచి బాంబుల వర్షం కురిసిందా భూమ్మీద ఉన్న దేనిపైన అయినా పిడుగులు పడినట్టే. అమెరికా వైమానిక దళానికి చెందిన బీ 52 బాంబర్‌కు ఉన్న ప్రత్యేకతలు ఎన్నో.. గురితప్పకుండా శత్రువులను నిశ్శేషం చేసే పటిమ దీనికి ఉంది. కేవలం 96 గంటల వ్యవధిలో 24 తాలిబన్ స్థావరాలను ఈ బాంబర్ నేలమట్టం చేసింది. బీ 52 ఆధునికమైనది కాకపోయినా ఇప్పటికీ అమెరికా వైమానిక దళంలో దాని పాత్ర కీలకమే. లక్షా 85వేల పౌండ్ల బరువుగల బీ 52 మొదటి సారిగా 1950వ దశకంలో అమెరికా వైమానిక దళంలోకి ప్రవేశించింది. అప్పట్లో అమెరికా-రష్యా మధ్య భీకర స్థాయిలో ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులున్నాయి. దీర్ఘశ్రేణి లక్ష్యాలను అత్యంత ఎత్తునుంచి ధ్వంసం చేయగలిగే అవసరాలు తీర్చుకోడానికి ఈ బాంబర్‌ను తీసుకొచ్చినట్టు ఓ ప్రకటనలో అమెరికా తెలిపింది. అంతేకాదు అప్పట్లో సోవియట్ యూనియన్‌లోకి చొచ్చుకెళ్లి దాడిచేసే సామర్థ్యం కూడా బీ 52కి ఉండటంతో దీని అవసరాన్ని ఎప్పటికప్పుడు పెంచుతూనే వచ్చింది. ఈ బాంబర్ తదుపరి నమూనా బీ 52 1962లో వైమానిక దళంలో చేరింది. 159 అడుగుల పొడవైన ఈ యుద్ధ విమానం ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో అమెరికా సైన్యానికి నిరుపమాన సేవలు అందించింది. ఒక్కోదానిలో దాదాపు 70వేల పౌండ్ల బరువుగల బాంబులు, క్షిపణులు, మందుపాతరలను ప్రయోగించే అవకాశం ఉంది. తాజాగా అఫ్గాన్‌లో తాలిబన్ మిలిటెంట్లు గత వారం 100 మందిని మట్టుబెట్టిన నేపథ్యంలో ఈ మహా బాంబర్ రంగంలోకి దిగి 24 తాలిబన్ శిబిరాలను నేలమట్టం చేసింది.

మీరే ప్రశ్నిస్తే ఎలా?

- రాఫెల్ అవినీతి ఊసెత్తరేం
- మీరు ప్రధానా? విపక్షనేతా?
- మోదీకి రాహుల్ చురకలు
- మోదీ చెప్పింది పాత సోదే: సోనియా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి మాటల దాడికి దిగారు. దేశంలోని అవినీతిపరులను రక్షించే ప్రయత్నాలు మోదీ చేస్తున్నారంటూ రాఫెల్ డీల్‌ను ప్రస్తావించారు. 'మోదీ తాను ప్రధానిన్న విషయం మర్చిపోయారు. ప్రతిపక్ష నేత అనుకుంటున్నారు. అందుకే, దేశ సమస్యలపై ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా, పార్లమెంట్ సాక్షిగా ఎదురు ప్రశ్నలు సంధిస్తున్నారు' అంటూ రాహుల్ ఎద్దేవా చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. మోదీ ప్రసంగాన్ని తప్పుబట్టిన రాహుల్ 'పార్లమెంట్‌లో ఆయన ప్రసంగం ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తోంది' అని వ్యంగ్యాస్త్రం సంధించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ సైతం రాహుల్ వ్యాఖ్యలను సమర్థిస్తూ, లోక్‌సభలో మోదీ ప్రసంగంలో కొత్తదనం ఏమీలేదని కొట్టిపారేశారు. పాత విషయాలనే మోదీ మళ్లీ మళ్లీ ప్రస్తావించారన్నారు. 'ప్రజలు ఉద్యోగాల కోసం చూస్తున్నారు. వాళ్ల భవిష్యత్‌ను వాళ్లు తెలుసుకోవాలని అనుకుంటున్నారు' అని ఆమె వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్‌తో కుదుర్చుకున్న రాఫెల్ జెట్ డీల్‌లో పెద్ద కుంభకోణమే ఉందన్న విషయం లోక్‌సభలో నరేంద్ర మోదీ ప్రసంగాన్ని బట్టి మరోసారి అర్థమైందని రాహుల్ వ్యాఖ్యానించారు. అవినీతి వ్యతిరేక గొంతులపై ప్రధాని ప్రతిదాడికి దిగుతోన్న విషయం మోదీ ప్రసంగాన్ని వింటే అర్థమవుతుందన్నారు. 'రాఫెల్ డీల్‌లో అవినీతి నిజం. అవినీతిపరులకు ప్రధాని మోదీ కొమ్ముకాస్తున్నారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. 'పార్లమెంట్‌లో ప్రధాని ప్రసంగం దేశాన్ని ఉద్దేశించి మాట్లాడినట్టు లేదు, ఎన్నికల ప్రసంగాన్ని తలపించింది. గంటపాటు అనర్గళంగా మాట్లాడిన ఆయన, రాఫెల్ జెట్ డీల్ గురించి ఒక్క ముక్కా ప్రస్తావించలేదు. నిజానికి దేశ ప్రజలు ప్రశ్నిస్తారు. ప్రధాని సమాధానం చెప్పాలి. అయితే, మోదీ వ్యవహారం భిన్నంగా ఉంది. పార్లమెంట్ నుంచి ఆయన ప్రశ్నిస్తున్నారు.. దేశం జవాబు చెప్పాలన్నట్టు...' అని రాహుల్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రధాని హోదాలో వున్న వ్యక్తి కాంగ్రెస్ పార్టీపై విమర్శలు బహిరంగ సభల్లో చేస్తారేతప్ప, పార్లమెంట్‌లో కాదన్నారు. 'ఆయనకు కాంగ్రెస్ గురించి మాట్లాడే హక్కు ఉంది. కానీ, మాట్లాడే ప్రదేశం మాత్రం పార్లమెంట్ కాదు' అన్నారు. 'ఆయన ప్రతిసారీ అంతే. కాంగ్రెస్ గురించి మాట్లాడతారు. కాంగ్రెస్ నేతలను తిడతారు. తన గొప్పలు చెప్పుకుంటారు. ఇంతకుమించి ఆయనేమీ మాట్లాడరు' అన్నారు. దేశం ముందు అనేక సమస్యలున్నా, వాటి గురించి మోదీ ప్రస్తావించలేదన్నారు. రైతుల భవిష్యత్ ఏమిటి? నిరుద్యోగులకు ఉపాధి ఎలా కల్పిస్తారు?.. లాంటి ప్రధాన సమస్యలకు మోదీ సమాధానం ఇవ్వలేదన్నారు.

తైవాన్‌లో భూకంపం.. ఆరుగురి మృతి

హువాలిన్, ఫిబ్రవరి 7: తైవాన్ తూర్పుతీరంలో సంభవించిన భూకంపం ధాటికి పలు భవనాలు కుప్పకూలిపోయాయి. పెద్దసంఖ్యలో పౌరులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు సహాయకబృందాలు నిర్విరామంగా పనిచేస్తున్నాయి. భూకంపం సృష్టించిన విధ్వంసంలో కనీసం ఆరుగురు మరణించగా, 88మంది ఆచూకీ తెలియలేదు. 256 మంది తీవ్రంగా గాయపడ్డారు. తైవాన్‌లోని హువాలిన్ కౌంటీలో ఎటు చూసినా శిథిలాల గుట్టలుగా మారిపోయిన భవనాల దృశ్యాలే కనిపిస్తున్నాయి. నాలుగు బహుళ అంతస్థుల భవనాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. పాక్షికంగా దెబ్బతిన్న అపార్టుమెంటుల్లో చిక్కుకుపోయినవారిని రక్షించేందుకు అగ్నిమాపక దళాలు ప్రయత్నిస్తున్నాయి. మంగళవారం రాత్రి సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.4గా నమోదైంది. ప్రకంపనల తీవ్రతకు కుప్పకూలిన మార్షల్ హోటల్ శిథిలాల్లో చిక్కుకుపోయిన కార్మికుడిని, మరో ఉద్యోగిని సహాయక బృందాలు కాపాడి బంధువుల చెంతకు చేర్చాయి. భూప్రకంపనల ధాటికి రహదార్లు, విద్యుత్, మంచినీటి వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. శిథిలాల్లో చిక్కుకున్నవారిలో సజీవంగా ఉన్నవారిని రక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తైవాన్ అధ్యక్షుడు తాయ్ ఇంగ్ విన్ పేర్కొన్నారు. భూకంప ప్రభావిత హువాలిన్‌ను ఆమె సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. సహాయక, పునరావాస చర్యల్లో సహకరించేందుకు చైనా సిద్ధంగా ఉందని తైవాన్ వ్యవహారాలను చూసే చైనా అధికారి పేర్కొన్నారు.

పారదర్శకత పూజ్యం

భద్రతా మండలి పనితీరుపై భారత్ మండిపాటు

న్యూయార్క్, ఫిబ్రవరి 7: ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి నిర్వహణ తీరులో పారదర్శకత లోపించిందని భారత్ ధ్వజమెత్తింది. ముఖ్యంగా వీటో అధికారం కలిగిన దేశాలు వ్యవహరిస్తున్న తీరు ఎంతమాత్రం సమంజసంగా లేదని పేర్కొంది. ఎలాంటి కారణం లేకుండా ఉగ్రవాదులకు సంబంధించి ఈ దేశాలు వ్యవహరిస్తున్నాయని చైనాను పరోక్షంగా దుయ్యబడుతూ భారత్ చురకలు వేసింది. ముఖ్యంగా పాకిస్తాన్ కేంద్రంగా పని చేస్తున్న మసూద్ ఆజాద్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించాలన్న అంశంపై చైనా మోకాలడ్డటాన్ని భారత్ నిరసించింది. భద్రతా మండలి పనితీరు విధానాలపై జరిగిన చర్చలో పాల్గొన్న భారత శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ మాట్లాడుతూ 'వీటో అధికారం కలిగిన దేశాల్లో ఏ దేశం తన అధికారాన్ని ఉపయోగిస్తోందో అర్థంకాని పరిస్థితి చాలా సందర్భాల్లో కనిపిస్తుంది' అని అన్నారు. కొందరు ఉగ్రవాదుల విషయంలో ఈ వీటో దేశాలన్నీ ఏకగ్రీవంగానే తమ నిర్ణయాన్ని ప్రకటిస్తున్నాయని, ఇందులో పారదర్శకత ఏ కోశానా కనిపించడం లేదని అక్బరుద్దీన్ అన్నారు. పైగా ఈ దేశాలు తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి సహేతుకత విషయంలోనూ ఎలాంటి స్పష్టతా కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. అక్బరుద్దీన్ తన ప్రసంగంలో ఏ దేశం పేరు ప్రస్తావించకున్నా, పాక్ ఉగ్రవాదులకు సంబంధించి తరచూ వీటో అధికారాన్ని ఉపయోగించిన చైనాను దృష్టిలో పెట్టుకునే ఆయన మాట్లాడారన్న విషయం స్పష్టంగా ద్యోతకమైంది. జైషే మహ్మద్ అధినేత అజార్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించేందుకు భారత్ చేసిన ప్రతి ప్రయత్నాన్నీ చైనా అడ్డుకున్న విషయం తెలిసిందే. భద్రతా మండలి ఆంక్షల కమిటీలో చైనా తన వీటో అధికారాన్ని అడ్డుపెట్టి భారత్ ప్రయత్నాలకు గండికొడుతూ వచ్చింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో మొత్తం 14 ఆంక్షల కమిటీలు ఉన్నాయని, ఈ కమిటీలు తీసుకునే నిర్ణయాలపై ఎలాంటి వివరణా ఉండకపోవడం విడ్డూరంగా ఉంటోందని అన్నారు.





బుధవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశానికి తరలివస్తున్న మహిళా మంత్రులు మేనకాగాంధీ, నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ, బీజేపీ ఎంపీ హేమమాలిని.

సైనిక శక్తి చాటండి

రక్షణ విభాగానికి ట్రంప్ ఆదేశం ● ఏర్పాట్లపై పెంటగాన్ కసరత్తు

వాషింగ్టన్, ఫిబ్రవరి 7: 'సర్వసత్తాక సైనిక పాటవానికి ప్రపంచ ప్రశంసలు దక్కేలా వాషింగ్టన్ వేదికపై అద్భుత పరేడ్ నిర్వహించండి' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రక్షణ విభాగాన్ని ఆదేశించారు. అయితే చైనా, ఫ్రాన్స్, ఇండియాలాంటి అనేక దేశాలు తమ సైనిక సత్తాను ప్రదర్శించుకుంటున్నట్టే, ఇదీ సాధారణ పరేడ్ మాత్రమేనని వైట్ హౌస్ అంటోంది. నిజానికి ప్రపంచంలోనే అత్యంత గొప్ప మిలటరీ శక్తి కలిగిన అమెరికాకు వార్షిక సైనిక పరేడ్‌లు నిర్వహించే ఆనవాయితీ లేదు. 'అమెరికా రక్షణ కోసం ప్రాణాలు ఫణంగా పెట్టే మిలటరీ అంటే ట్రంప్‌కు ఎంతో ఇష్టం. అందులో భాగంగానే సైనికులకు అమెరికన్ల ప్రశంసలు అందేలా అద్భుతమైన పరేడ్ నిర్వహించాలని రక్షణ విభాగాన్ని కోరారు' అని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ సారా శాండర్స్ వెల్లడించారు. అతి పెద్ద సైనిక పరేడ్ నిర్వహించాలన్న ట్రంప్ ఆసక్తి పట్ల మిశ్రమ స్పందన వ్యక్తమవుతున్నట్టు వాషింగ్టన్ పోస్ట్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా జాతీయవాదులు, మాజీ మిలటరీ అధికారులు వ్యతిరేక మనోభావాలు వ్యక్తం చేస్తున్నారని కథనంలో పేర్కొంది. సైనిక సత్తాను ప్రదర్శించే సంస్కృతి శతాబ్దాల క్రితంనాటిదని, ప్రపంచ యుద్ధాల తరువాత క్రమంగా అది కనుమరుగవుతూ వచ్చిందని తన కథనంలో పేర్కొంది. గల్ఫ్ యుద్ధం ముగిసిన తరువాత 1991 జూన్‌లో వాషింగ్టన్ డీసీ వేదికగా రాజ్యాంగ నిర్ణయం మేరకు సైనిక ప్రదర్శన నిర్వహించారని తన కథనంలో గుర్తు చేసింది. ఇదిలావుంటే, అకస్మాత్తుగా సైనిక సత్తా ప్రదర్శన నిర్వహించాలన్న ట్రంప్ నిర్ణయంలో నిజాయితీ కనిపించడం లేదని పలువురు అంటున్నారు. తన సార్వభౌమాధికారానికి తగిన గౌరవం అందుకోవడానికే తప్ప, సైనికులకు ప్రశంసల కోసం కాదని రిటైర్డ్ మేజర్ జనరల్ పాల్ ఎటోన్ అభిప్రాయపడ్డారు. వార్షిక సంప్రదాయంగా దీన్ని కొనసాగించే యోచన కూడా ఉండి ఉండొచ్చన్నారు. గత ఏడాది ఫ్రాన్స్‌లో నిర్వహించిన బాస్టిల్ డే వేడుకలకు హాజరైన ట్రంప్, రెండు గంటలపాటు అక్కడి పరేడ్ చూసి ఆశ్చర్యపోయారు. 'అద్భుతం' అంటూ కితాబిచ్చారు. ఆ క్షణంలోనే అమెరికాలోనూ నిర్వహించాలన్న తలంపును ప్రకటిస్తూ 'మేమూ ప్రయత్నిస్తాం' అన్నారు.

రోడ్డు ప్రమాదంలో మోదీ భార్యకు గాయాలు

- ట్రక్‌ను ఢీకొన్న కారు
- జశోదాబెన్ బంధువు మృతి

జైపూర్, ఫిబ్రవరి 7: ప్రధాని నరేంద్రమోదీ భార్య జశోదాబెన్ రాజస్థాన్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆమె ప్రయాణిస్తున్న కారు ఓ ట్రక్కును ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ఈ దుర్ఘటనలో జశోదాబెన్ బంధువు మృతి చెందినట్టు స్టేషన్ ఆఫీసర్ పర్సోలీ శ్యామ్ సింగ్ వెల్లడించారు. కారులో ప్రయాణిస్తున్న మిగతా నలుగురూ గాయపడ్డారన్నారు. మోదీ భార్యకు స్వల్పగాయాలే అయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ జశోదా బంధువు బసంత్‌భాయ్ మోదీ (67) చికిత్స పొందుతూ మరణించినట్టు పోలీసులు తెలిపారు. రాజస్థాన్‌లోని కోటలో ఓ ఫంక్షన్‌కు హాజరై చిత్తోర్‌గఢ్‌కు వస్తుండగా ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న ట్రక్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కారు ఢీకొంది. జశోదాబెన్ ప్రయాణిస్తున్న కారులో ఇద్దరు పోలీసు కమెండోలున్నట్టు శ్యామ్ సింగ్ చెప్పారు. గాయపడ్డవారిలో ఓ కమెండో ఉన్నారని ఆయన అన్నారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఆదాయంలో బీఎస్పీ టాప్

- ఐదు జాతీయ పార్టీల ఆదాయం రూ.299 కోట్లు
- రెండోస్థానంలో సీపీఎం
- ఇంకా వివరాలు ఇవ్వని బీజేపీ, కాంగ్రెస్
- ఏడీఆర్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: దేశంలోని ఏడు జాతీయ పార్టీలలో ఐదు రాజకీయ పక్షాలు 2016-17 ఆర్థిక సంవత్సరంలో గడించిన ఆదాయాన్ని ప్రకటించాయి. వాటి ఆదాయం మొత్తం విలువ రూ.299.54 కోట్లు కాగా ఇందులో బీఎస్పీ అత్యధిక ఆదాయం, 173.58 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఢిల్లీ కేంద్రంగా పనిచేసే మేధోబృందం ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్-ఏడీఆర్) విడుదల చేసిన తాజా నివేదికలో ఈ వివరాలు పేర్కొంది. అక్టోబర్ 30, 2017లోగా తమతమ పార్టీల ఆదాయ వివరాలు సమర్పించాల్సి ఉండగా ఇప్పటివరకు భారతీయ జనతా పార్టీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఇంకా ప్రకటించలేదు. 2015-16 సంవత్సరంలో జాతీయ పార్టీలన్నింటిలోకీ బీజేపీ 570.86 కోట్ల ఆదాయంతో అగ్రస్థానంలో ఉండగా కాంగ్రెస్ 261.56 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది.

కాగా అప్పటి ఆదాయవ్యయ వివరాలను ఆ రెండు పార్టీలు ఇంకా ఎన్నికల సంఘానికి సమర్పించకపోవడం గమనార్హం. అయితే 2016-17కు సంబంధించి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), సీపీఎం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు తమ ఆడిట్ నివేదికలను గడువులోగా సమర్పించాయి. సీపీఐ గడువుముగిసిన 22 రోజుల తరువాత, రెండు నెలలు ఆలస్యంగా అంటే, ఈ ఏడాది జనవరి 19న ఎన్‌సీపీ తమ ఆదాయ వివరాలను ఎన్నికల సంఘానికి అందజేశాయి. ఐదు జాతీయ పార్టీల 2016-17 ఆర్థిక సంవత్సర ఆదాయంలో అత్యధికంగా బీఎస్పీ సాధించిందని, 173.58 కోట్లతో జాతీయ పార్టీల ఆదాయంలో 57.95 శాతంతో అగ్రస్థానంలో నిలిచిందని ఢిల్లీ కేంద్రంగా పని చేసే మేధోబృంద సంస్థ ఏడీఆర్ పేర్కొంది. రూ. 100.2 కోట్లతో సీపీఎం రెండో స్థానంలో ఉండగా మరో వామపక్షం సీపీఐ రూ. 2.07 కోట్లతో చివరిస్థానంలో నిలిచింది. ఆయా పార్టీలు సమర్పించిన ఐటీ రిటర్న్‌లు, కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్లలోని గణాంకాల ఆధారంగా ఏడీఆర్ ఈ విశ్లేషణలు చేసింది.

గడచిన ఏడాదితో పోలిస్తే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆదాయంకన్నా 280 శాతం అధికంగా ఖర్చు చేసింది. 2015-16తో పోలిస్తే బీఎస్పీ ఆదాయం 2016-17లో 266.32 శాతం మేరకు పెరిగింది. అదేసమయంలో ఎన్‌సీపీ ఆదాయం 88.63 శాతం పెరిగింది. కాగా తమ మూడు ఆదాయ మార్గాల్లో ఒకటైన విరాళాల వివరాలను జాతీయ పార్టీలు వెల్లడించాయి. బీఎస్పీ విరాళాల ద్వారా రూ.75.26 కోట్లు, సీపీఎం రూ.36.727 కోట్లు, ఎన్‌సీపీ రూ.6.62 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ రూ.2.17 కోట్లు సాధించాయి.



వ్యాజ్యాల్లో స్థానిక భాష మంచి ఆలోచనే: వెంకయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టుల వ్యాజ్యాల్లోనూ స్థానిక భాషలనే ఉపయోగించడం అర్థవంతమైన చర్య అవుతుందని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు అన్నారు. మద్రాస్ హైకోర్టు వ్యాజ్యాల్లో తమిళ భాషను అధికార భాషగా ఉపయోగించడానికి అనుమతించాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ పంపిన తీర్మానాన్ని పునఃపరిశీలించాలని అన్నాడిఎంకె సభ్యురాలు శశికళ పుష్ప చేసిన ప్రకటనపై వెంకయ్య ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు.

వడ్డీ రేట్లు యథాతథం

ద్రవ్యోల్బణం భయంతో తగ్గించని ఆర్‌బీఐ



ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్

ముంబయి, ఫిబ్రవరి 7: ఎక్కువ మంది అంచనా వేసినట్టుగానే రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని బుధవారం నిర్ణయించింది. ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయంతో పాటు విస్తృతమైన ద్రవ్యలోటు కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందనే కారణంతో కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. ప్రస్తుతం ఉన్న రెపో రేటును ఆరు శాతంగా, రివర్స్ రెపో రేటును 5.75 శాతంగా కొనసాగించాలని ఆరుగురు సభ్యులతో కూడిన ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటి (ఎంపీసీ) నిర్ణయించింది. అనేక అంశాల అనిశ్చితి కారణంగా ద్రవ్యోల్బణం పెరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రాలలో ఏడో వేతన సంఘం సిఫార్సుల అమలు, అధికంగా ఉన్న చమురు ధరలు, కస్టమ్స్ పన్నుల పెరుగుదల, 2017-18లో ద్రవ్య లోటు 3.5 శాతానికి పెరుగుతుండటం, 2018-19లోనూ ద్రవ్య లోటు లక్ష్యం ఎక్కువగా ఉండటం వంటి అంశాలను ప్రస్తావిస్తూ, వీటి కారణంగా ద్రవ్యోల్బణం పెరిగే సూచనలు ఉన్నందున కీలక రేట్లను యథాతథంగా ఉంచాలని నిర్ణయించినట్టు ఎంపీసీ వివరించింది. అయితే, ఆహార ధాన్యాల కనీస మద్దతు ధరల (ఎంఎస్‌పీ) ప్రభావాన్ని ఇప్పుడే మదింపు చేయడం, ద్రవ్యోల్బణంపై దాని ప్రభావాన్ని ఇప్పుడే అంచనా వేయడం తొందరపాటే అవుతుందని ఆర్‌బీఐ పేర్కొంది. గత ద్రవ్య విధాన సమీక్షలో ఆర్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సర రెండో అర్ధ భాగంలో ద్రవ్యోల్బణం అంచనాను 4.3-4.7 శాతానికి పెంచింది.

ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ సహా ఎంపీసీలోని అయిదుగురు సభ్యులు కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలని పేర్కొనగా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మిఖాయెల్ పాత్ర మాత్రం కీలక రేట్లను పెంచాలని వాదించారు.

ద్రవ్యోల్బణం అంచనా 5.1 శాతం

ఇదిలా ఉండగా, ఆర్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సర చివరి త్రైమాసికంలో చిల్లర ద్రవ్యోల్బణం అంచనాను 5.1 శాతానికి పెంచింది. పెరుగుతున్న ముడి చమురు ధరలు, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలలో పెరుగుదల కారణంగా చివరి త్రైమాసికంలో చిల్లర ద్రవ్యోల్బణం పెరుగుతుందని అంచనా వేసింది. అలాగే 2018-19 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగంలో ద్రవ్యోల్బణం 5.1-5.6 మధ్య నమోదవుతుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. అయితే, రెండో అర్ధ భాగంలో 4.5-4.6 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది.

తగ్గిన అంచనా వృద్ధి రేటు

మార్చి 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సర వృద్ధి రేటు అంచనాను కూడా ఆర్‌బీఐ గతంలో నిర్ణయించిన 6.7 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. అయితే, 2018-19లో ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 7.2 శాతానికి పెరుగుతుందని ఆర్‌బీఐ అంచనా వేసింది.

ఈసారి ఆర్‌బీఐ దెబ్బ!

మళ్లీ స్టాక్ మార్కెట్ పతనం • 113 పాయింట్లు తగ్గిన సెనె్సక్స్ • 21 పాయింట్లు దిగజారిన నిఫ్టీ

ముంబయి, ఫిబ్రవరి 7: రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తన ద్రవ్య విధాన సమీక్షలో కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడంతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు అంచనాను 6.7 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించడం బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో బుధవారం లావాదేవీలు ఒడిదుడుకుల మధ్య కొనసాగి, చివరకు సెనె్సక్స్ 113 పాయింట్లు పడిపోయి, 34,082.71 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ కూడా 21.55 పాయింట్లు తగ్గి, 10,476.70 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎక్కువ మంది అంచనా వేసినట్లుగానే ఆర్‌బీఐ రెపో రేటును ఆరు శాతంగా, రివర్స్ రెపో రేటును 5.75 శాతంగా కొనసాగించాలని నిర్ణయించింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సర వృద్ధి రేటు అంచనాను మాత్రం గతంలో నిర్ణయించిన 6.7 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. ద్రవ్యోల్బణం, ద్రవ్య లోటు పెరగనుందనే ప్రమాదాలను ప్రస్తావించింది. ఈ అంశాలు దేశీయ స్టాక్ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.



ప్రపంచ పరిణామాలలో డౌజోన్స్ పటిష్ఠమైన స్థితిలో అధిక స్థాయి వద్ద ముగియడంతో భారత స్టాక్ మార్కెట్‌లో మదుపరులు ఉపశమనం పొందారు. ప్రపంచ మార్కెట్ల సానుకూల ప్రభావంతో సెనె్సక్స్ బుధవారం ఉదయం జరిగిన లావాదేవీల్లో 470 పాయింట్లు పుంజుకుంది. అయితే, అధిక స్థాయిల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు పూనుకోవడంతో 34,008.42 పాయింట్ల కనిష్ఠ స్థాయికి దిగజారింది. అయితే, చివరకు స్వల్పంగా పెరిగి, క్రితం ముగింపుతో పోలిస్తే 113.23 పాయింట్లు (0.33 శాతం) నష్టంతో 34,082.71 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సూచీ వరుసగా ఏడు సెషన్లలో కలిపి 2,200 పాయింట్లు పడిపోయింది. నిఫ్టీ కూడా క్రితం ముగింపుతో పోలిస్తే బుధవారం 21.55 పాయింట్లు (0.21 శాతం) తగ్గి, 10,476.70 పాయింట్ల వద్ద స్థిరపడింది. అంతకు ముందు ఇంట్రా-డేలో ఈ సూచీ 10,614- 10,446.40 పాయింట్ల మధ్య కదలాడింది. ఇదిలా ఉండగా, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇనె్వస్టర్లు (ఎఫ్‌పీఐలు) మంగళవారం నికరంగా రూ. 2,326.10 కోట్ల విలువయిన షేర్లను విక్రయించగా, దేశీయ సంస్థాగత మదుపరులు రూ. 1,699.74 కోట్ల విలువయిన షేర్లను కొనుగోలు చేశారు.

బుధవారం నాటి లావాదేవీల్లో పీఎన్‌బీ, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్ల విలువ 2.18 శాతం వరకు పడిపోయింది. దీంతో బ్యాంకింగ్ సూచీ 0.43 శాతం దిగజారింది. టెలికం, టెక్నాలజి, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ రంగాల సూచీలు కూడా 1.12 శాతం వరకు పడిపోయాయి. ఇందుకు భిన్నంగా స్మాల్-క్యాప్ ఇండెక్స్ 1.95 శాతం, మిడ్-క్యాప్ 0.43 శాతం చొప్పున పెరిగాయి. చమురు- సహజ వాయువు, స్థిరాస్తి, పీఎస్‌యూ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆరోగ్య సంరక్షణ, కన్స్యూమర్ డ్యూరేబుల్స్, పవర్, ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగాల షేర్ల విలువ పెరిగింది. నష్టపోయిన పెద్ద సంస్థల్లో ఎల్‌అండ్‌టీ, టీసీఎస్, భారతి ఎయిర్‌టెల్, విప్రో, హిందుస్తాన్ యూనిలీవర్, ఎంఅండ్ఎం, మారుతి సుజుకి, టాటా స్టీల్, సన్ ఫార్మా, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ ఉన్నాయి.

రెండు పంటల సాగుకు జయంతి రోహు చేపలు

మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్‌నాయక్



విలేఖర్లతో మాట్లాడుతున్న మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్ నాయక్

ఆంధ్రభూమి బ్యూరో

భీమవరం, ఫిబ్రవరి 7: ఏడాదికి రెండు పంటలు విధానాన్ని చేపల పెంపకానికి వర్తింపచేయాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటోంది. రెండు పంటలు సాగుచేయడానికి అనువైన వెరైటీ చేప పిల్లలను రైతులకు అందించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా 'జయంతి రోహు' చేప ఇందుకు అనువైనదిగా గురించామని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్ నాయక్ చెప్పారు. ముఖ్యంగా ఈ వెరైటీ చేప పెరుగుదల ఇతర చేపల కంటే ఎక్కువగా ఉండటంతోపాటు, ధర కూడా ఇతర వెరైటీల కంటే అధికంగా లభిస్తుందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో బుధవారం మంచినీటి చేపల హేచరీలు, చేపల పిల్లల ఉత్పత్తిదారులు, ఆదర్శ చేపల రైతులతో మత్స్యశాఖ నిర్వహించిన సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన కమిషనర్ రమాశంకర్ నాయక్ విలేఖర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో చేపల రైతులకు మంచి రోజులు తీసుకురావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తున్నారని వివరించారు. రెండు పంటలకు అవసరమైన జయంతి రోహు తల్లి చేపలను భువనేశ్వర్‌లోని 'సిఫా' నుంచి తీసుకువచ్చి, రాష్ట్రంలోని హేచరీల్లో పెంచాలని భావిస్తున్నామన్నారు. ఇలా పెంచిన సీడ్‌ను 50 గ్రాముల వరకు పెంచిన సీడ్‌ను రైతులకు పంపిణీచేస్తామన్నారు. దీనివల్ల త్వరగా చేపలు పట్టుబడికి వస్తాయన్నారు. దీనివల్ల ఏడాదిలోనే మరోసారి సాగుకు అవకాశం కలుగుతుందన్నారు. దీనిపై ఇప్పటికే నిష్ణాతులైనవారి అభిప్రాయాలను తీసుకున్నామన్నారు. రైతులకు వీటిపై మరింత అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆక్వా కల్చర్‌ని రెగ్యులరైజ్ చేసి, క్లస్టర్ల వారీగా విభజన చేస్తామని కమిషనర్ రమాశంకర్ నాయక్ తెలిపారు.

21 రోజుల్లోనే అనుమతులు

- ప్రాసెసింగ్ పరిశ్రమకు ఏపీ అనుకూలం
- పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన అన్ని అనుమతులను 21 రోజుల్లోనే మంజూరు చేస్తామని జర్మనీలోని పలు కంపెనీల ప్రతినిధులకు పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి హామీ ఇచ్చారు. నవ్యాంధ్రకు పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా విదేశీ పర్యటన కొనసాగిస్తున్న మంత్రి బుధవారం హాంబర్గ్ (జర్మనీ)లో జర్మన్ ఆసియా - పసిఫిక్ బిజినెస్ అసోసియేషన్, హంబర్గ్ ఫారిన్ ట్రేడ్ ప్రమోషన్ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అగ్రి బిజినెస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, షిప్ బిల్డింగ్ పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలు, మౌళిక వసతులు గురించి వివరించారు. రొయ్యలు, మిరప, మామిడి, టమోటా, ఫిష్, మాంసం (మీట్)ఉత్పత్తులు ఆంధ్రప్రదేశ్‌లో పుష్కలంగా దొరకుతాయని, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు ఏపీ అనుకూలంగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఏపీ 12 శాతం వృద్ధి సాధించిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ అగ్రస్థానంలలో ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పాలసీలను అమలు చేస్తుండడంతో కియా లాంటి ప్రపంచ స్థాయి కంపెనీ ఏపీలో పెట్టుబడులు పెట్టిందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో రెండు అత్యున్నత పారిశ్రామిక కారిడార్లు 50 వేల ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. ఇప్పటికీ ఏపీలో పారిశ్రామికాభివృద్ధి పెద్దఎత్తున జరుగుతోందని, ఏపీలో కంపెనీలు ఏర్పాటు చేసే వారికి పలు రాయితీలు ఇస్తామన్నారు. కాగా ఈ నెల 24 నుంచి విశాఖలో ప్రారంభమయ్యే భాగస్వామ్య సదస్సులో పాల్గొంటామని పలు కంపెనీల ప్రతినిధులు మంత్రికి హామీ ఇచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ప్రీతమ్ రెడ్డి, ఈడీబీ అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్యభూమి

భారతీయ రైల్వే ఆదాయ లక్ష్యం

రెండు లక్షల కోట్లు

విశాఖ డీఆర్‌ఎం మాథూర్



ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ఫిబ్రవరి 7: భారతీయ రైల్వే 2018-19 ఆర్థిక సంవత్సరంలో రెండు లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు విశాఖ రైల్వే డివిజనల్ మేనేజర్ మాథూర్ తెలియచేశారు. రైల్వే బడ్జెట్‌కు సంబంధించిన వివరాలను బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన తెలియచేశారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేకు 1,87,000 కోట్ల ఆదాయం సమకూరగా 1,81,000 కోట్ల రూపాయలు వ్యయమైనట్టు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని లక్ష్యంగా నిర్ణయించారని, ఇందులో 1,88,000 కోట్ల రూపాయలు వ్యయంగా చూపించారని ఆయన తెలియచేశారు. ఈ బడ్జెట్‌లో వచ్చే పదేళ్లలో భారతీయ రైల్వేలో భద్రత, మౌలిక సదుపాయాలకల్పనకు అధిక ప్రాధాన ఇస్తూ, ఆ దిశగా కార్యక్రమాలు రూపొందించిందని ఆయన చెప్పారు. అలాగే దేశంలోని అనేక ప్రాంతాల్లో రైల్వే లైన్ల డబ్లింగ్‌కు ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. 2009-14 మధ్య భారతీయ రైల్వే లైన్ల డబ్లింగ్‌కు 2400 కోట్ల రూపయలు ఖర్చు చేయగా, 2018-19లో 17,300 కోట్ల రూపాయలు కేటాయించినట్టు మాథూర్ వివరించారు. అలాగే కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి 2009-14 మధ్య ఐదు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయగా, 2018-19 ఆర్థిక సంవత్సరానికిగానురి 28,500 కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని నిర్ణయించిందని డీఆర్‌ఎం తెలియచేశారు. అలాగే రైల్వే లైన్ల విద్యుదీకరణకు 2009-14 మధ్య 884 కోట్ల రూపాయలు ఖర్చు చేయగా, 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఇందుకోసం 6,300 కోట్ల రూపాయలు కేటాయించారని ఆయన తెలియచేశారు. ఆర్‌ఓబీ, ఆర్‌యుబీల కోసం గతంలో కేవలం 916 కోట్ల రూపాయలు కేటాయించగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 6,300 కోట్ల రూపాయలు మంజూరు చేశారని చెప్పారు. అలాగే 2009-14 మధ్య పెట్టుబడి వ్యయం 45,980 కోట్లు కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 1,46,500కు పెంచారని ఆయన తెలియచేశారు. రైల్వే సేవలను మరింత విస్తృతం చేయాలన్న లక్ష్యంగా ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులను గణనీయంగా పెంచిందని అన్నారు.

ఐసీఐసీఐకి ఫోరం భారీ వడ్డింపు

- దస్తావేజుల మాయం కేసులో ఖాతాదారుడికి ఐదు లక్షల పరిహారం
- గుంటూరు జిల్లా వినియోగదారుల ఫోరం సంచలనాత్మక తీర్పు

గుంటూరు (లీగల్), ఫిబ్రవరి 7: ఐసిఐసిఐ బ్యాంకు రుణం కోసం దస్తావేజులు సెక్యూరిటీగా ఇచ్చిన వినియోగదారుడు బాకీ తీర్చినప్పటికీ దస్తావేజులు తిరిగి అందించని కేసులో వినియోగదారుడికి ఐదు లక్షల రూపాయల పరిహారం చెల్లించాలంటూ గుంటూరు జిల్లా వినియోగదారుల ఫోరం బుధవారం సంచలనాత్మక తీర్పు వెలువరించింది.

కేసు వివరాలిలా ఉన్నా యి... బాపట్లకు చెందిన బైరవరపు భావన్నారాయణ ఐసిఐసిఐ బ్యాంకు, లక్ష్మీపురం బ్రాంచ్‌లో 2003 ఆగస్టు 30వ తేదీ న 7 లక్షల రూపాయల రుణం తీసుకున్నా రు. వడ్డీతో సహా ఆ మొత్తాన్ని చెల్లించిన అనంతరం ఒరిజినల్ దస్తావేజులు తిరిగి ఇవ్వాలని భావన్నారాయణ పలుమార్లు కోరినప్పటికీ బ్యాంకు అధికారులు అం దించలేకపోయారు. నోటీసులు పంపించినప్పటికీ సమాధానం లేకపోవడంతో న్యాయవాది చేజర్ల వెంకట్రావ్ ద్వారా ఫోరంలో ఫిర్యా దు చేశారు. కేసు విచారించిన ఫోరం అధ్యక్షుడు బి రామారావు, సభ్యురాలు సునీత ఫిర్యాదుదారుడికి ఒరిజినల్ దస్తావేజులు అందించాలని, లేనిపక్షంలో దస్తావేజులు తిరిగి రూపొందించాలని, 13 సంవత్సరాల వరకు ఫిర్యాదుదారుపై ఎవరైనా దస్తావేజుల్లోని ఆస్తి గురించి క్లెయిమ్ చేస్తే దానికయ్యే ఖర్చులు కూడా బ్యాంకువారు చెల్లించాలని, దీంతోపాటు ఐదు లక్షల రూపాయల నష్టపరిహారం, కోర్టుఖర్చుల కింద 5 వేల రూపాయలు చెల్లించాలని ఐసిఐసిఐ బ్యాంకును ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది.

1వ పేజీ తరువాయి

దేవుడిని నమ్ముకున్నా

జ: మాదక ద్రవ్యాలు అమ్మితే ఇంకా ఎక్కువ ఆదాయం వస్తుందని డ్రగ్స్‌పై నిషేధం ఎత్తివేయాలనుకుంటామా? మద్యం వ్యవహారాల్లోనూ నిర్మాణాత్మక ధోరణితో చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వాలకు ప్రజారోగ్యమే ప్రామాణికం కావాలి. అంతేతప్పా ఆర్థిక అంశాలతో ప్రజారోగ్యాన్ని ముడి పెట్టడం తగదు. భావి తరాలకు సైతం మంచి ఆరోగ్యం అందాలనేది మా ఆకాంక్ష. అధికారంలోకి రాగానే తప్పక మద్య నియంత్రణ నుంచి విడతలవారీగా నిషేధం అమలులోకి వచ్చేలా కృషి చేస్తా.

ప్ర: గతంలో వైయస్ అధికారంలోకి రాగానే జన్మభూమిని రద్దు చేసి ప్రజాపథం ప్రవేశపెట్టారు. అలాగే ఇప్పుడు జన్మభూమి- మా ఊరు పేరుతో ప్రస్తుత ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మీరు అధికారంలోకి వస్తే రద్దు చేస్తారా? కొనసాగిస్తారా ?

జ: అధికార్లు జనావాసాల్లోకి వచ్చి సమస్యలు పరిష్కరించేలా 'గ్రామ సచివాలయం' వ్యవస్థను పకడ్బందీగా రూపొందించి అమలు చేస్తాం. జన్మభూమి ముమ్మాటికీ తెలుగుపార్టీ ప్రచార కార్యక్రమమే. దీనివల్ల ప్రజలకు ఎలాంటి మేలు జరగడం లేదు. ప్రజలకు క్షేత్ర స్థాయిలోనే సమస్యలు పరిష్కరించేలా వారధిగా ఉండేలా గ్రామ సచివాలయ వ్యవస్థను అమలు చేస్తాం. ఇందులో పదిమంది ఉద్యోగులు ఉంటారు. సముచితమైన ప్రజా సమస్యలకు 72 గంటల్లోనే పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన పని లేకుండా పని చేస్తాము.

ప్ర: ఇంటర్‌ను కూడా హైస్కూల్ స్థాయిలోనే +2 వరకు విద్యాభ్యాసంగా సాగాలని మీ పార్టీకి చెందిన నెల్లూరు జెడ్పీ చైర్మన్ ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ విషయంలో మీ అభిప్రాయం ?

జ: ఇంటర్ విద్యాభ్యాసాన్ని కూడా 12వ తరగతిగా హైస్కూల్‌లోనే కొనసాగించాలనే భావన ఎంతో సముచితం. కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడికి అడ్డుకట్ట వేసేలా ఇలాంటి విప్లవాత్మకమైన విధానాలు అమలు చేసేందుకు ముందుంటాం.

ప్ర: రెవెన్యూ రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 5లక్షల ఎకరాల చుక్కల భూములు ఉన్నాయి. నెల్లూరుజిల్లాలోనే లక్ష ఎకరాల వరకు ఆ భూములున్నాయి. ఈ చుక్కల భూముల రైతులకు ఆర్థిక స్వేచ్ఛ లేక అవసరమైన సమయాల్లో అనేక అవస్థలు పడుతున్నారు.

జ: రెవెన్యూ డైగ్లాట్- ఆర్‌ఎస్‌ఆర్ (రీ సెటిల్‌మెంట్ రిజిష్టర్)లో చుక్కల భూములు ఉన్నా పలుకుబడితో కూడిన బడా రైతుల పనులన్నీ బాగానే జరిగిపోతున్నాయి. కేవలం సన్న, చిన్నకారు రైతులు మాత్రమే ఇక్కట్లకు గురవుతున్నారు. హైకోర్టు సైతం స్పష్టంగా తీర్పునిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం చుక్కల భూములకు అనుగుణంగా చర్యలు తీసుకోకపోవడం వెనుక అనేక కారణాలున్నాయి. సాక్షాత్తు ముఖ్యమంత్రికి చెందిన వ్యక్తిగత స్థిరాస్తుల్లో చుక్కల భూములు ఉన్నాయి. ఇవి ఎలాగొచ్చాయనేది అందరికీ తెలిసిందే.

ప్ర: దీపం గ్యాస్ కనెక్షన్లకు సింగిల్ సిలిండర్లు మాత్రమే ఇస్తున్నారు. సిలిండర్ ఖాళీ అయితే బుకింగ్ చేసినప్పటి నుంచి డెలివరి అయ్యేలోగా గ్యాస్ సిలిండర్లు చాలా సమయం పడుతుంది. 'దీపం' సమస్యపై మీరేమైనా స్పందిస్తారా.

జ: రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా అమలు చేస్తున్న దీపం పథకంలో అంతర్గత లోపాలను సమగ్రంగా సవరించాల్సి ఉంది. వీటిపై పరిశీలన చేసి తప్పక పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. అలాగే సంవత్సరానికి అందచేసే గ్యాస్ సిలిండర్ల పంపిణీ కోటా సంఖ్యపై కూడా అవసరమైన చర్యలకు పరిశీలిస్తా. దీపం కనెక్షన్లను కూడా బదలాయించుకునే వెసులుబాటు కల్పిస్తాం.

ముద్దు మృతి తీరని లోటు

కాదు రాష్ట్రానికే తీరనిదని వ్యాఖ్యానించారు. ముద్దుకృష్ణమకు గత ఏడాది గుండె శస్త్రచికిత్స జరిగింది. కొద్దికాలంగా జ్వరంతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు నగర శివారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. కాగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆయన తుది శ్వాస విడిచారు. బుధవారం టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ ఇతర నాయకులు ముద్దు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం భౌతిక కాయాన్ని ఎయిర్ ఇండియా విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి తరలించారు. అక్కడి నుంచి భౌతికకాయాన్ని స్వగ్రామమైన వెంకటరామాపురానికి బంధువులు, పార్టీ కార్యకర్తలు ఊరేగింపుగా తీసుకువెళ్లారు.

చేతకాని విభజన

మనోభావాలూ పరిగణనలోకి తీసుకుని ఉండాల్సింది' అని మోదీ అన్నారు. అటల్ బిహారీ వాజపేయి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఉత్తరాఖండ్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఏర్పాటు చేసినప్పుడు అనుసరించిన విధానం మంచిదని మోదీ చెప్పారు. కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసే సమయంలో వాజపేయి దూరదృష్టితో వ్యవహరించారని ఆయన కొనియాడారు. యూపీఏ ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆంధ్రను విభజించింది. విభజనలో తొందరపాటు చూపించిందని నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. విభజన మూలంగా ఎదురయ్యే సమస్యల గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. అందుకే విభజన జరిగి నాలుగేళ్లు అవుతున్నా సమస్యలు వెంటాడుతున్నాయని ఆయన అన్నారు. విభజన సమస్యల గురించి మాట్లాడిన నరేంద్ర మోదీ విభజన చట్టం హామీల గురించి మాత్రం ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావించలేదు. అంతటితో ఆగకుండా మంగళవారం లోకసభలో ప్రతిపక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతున్నప్పుడు తెలుగుదేశం సభ్యులు గొడవ చేయకుండా ఉంటే బాగుడేదని వారికి చురక అంటించారు.

ఆంధ్రుల అభిమానాన్ని దెబ్బతీశారు

కాంగ్రెస్ నేతలు మొదటినుండీ ఆంధ్రుల అభిమానాన్ని దెబ్బతీశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని నరేంద్ర మోదీ ఆరోపించారు. అత్యధిక మెజారిటీతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన రాజీవ్ గాంధీ హైదరాబాద్ విమానాశ్రయంలో అప్పటి అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి టి అంజయ్యను అవమానించారు. బడుగువర్గాలకు చెందిన అంజయ్యను అవమానించి ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని కాంగ్రెస్ దెబ్బతీసిందని దుయ్యబట్టారు. ఆ అగ్నినుంచే ఎన్టీ రామారావు రాజకీయ నాయకుడిగా ఎదిగారని, తెలుగుదేశం పార్టీ పుట్టుకొచ్చిందని మోదీ ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నీలం సంజీవ రెడ్డి రాష్ట్రపతి పదవికి పోటీ చేసినప్పుడు వెన్నుపోటు పొడించింది కాంగ్రెస్ పార్టీ కాదా? అని ప్రధాన మోదీ ప్రశ్నించారు.

సస్పెన్షన్లకు బెదరొద్దు

అటు ప్రజలను, ఇటు ప్రభుత్వ ఆదాయానికి ఇబ్బంది కలిగించడం మంచిది కాదు. బందులు చేసేవాళ్లకు పార్లమెంటులో ఎంపీలున్నారు. వాళ్లను ఢిల్లీలో కేంద్రంపై పోరాడమని చెబుతున్నాం. అది వదిలేసి ఇక్కడ బందులు చేస్తే ఎవరికి ప్రయోజన'నమని ప్రశ్నించారు. జైట్లీ ఫార్ములాపై బాబు అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇన్నాళ్ల తర్వాత కొత్తగా ఫార్ములా మాటలేమిటి? మనం ఆర్థిక లోటు గురించి డిమాండ్ చేస్తుంటే వాళ్లేదో కొత్త ఫార్ములా చెప్పడం సమంజసం కాదు. విభజనకు ఏం ఫార్ములా ఉందని చేశారు? దానికి లేని ఫార్ములా మనల్ని ఆదుకోవడంలో ఎందుకు? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు మనం సంతృప్తి కలిగించాలని, వారిలో ఉన్న అసంతృప్తిని తొలగించి రాష్ట్రం కోసం మనమేం చేస్తున్నామో, ఏ పరిస్థితిలో ఉండి పోరాడుతున్నామో వారికి తెలిపేలా పోరాటం ఉండాలని ఎంపీలకు సూచించారు. పునర్ వ్యవస్థీకరణ బిల్లులో ఏం పెట్టారు? మనకెంత నష్టం జరిగింది? ఈ నాలుగేళ్లలో దాని భర్తీ కోసం ఏం చేశారు? ఇప్పుడేం చేస్తారో స్పష్టంగా చెప్పించడమే కాదు, నిర్దిష్ట కాలవ్యవధితో కూడిన కార్యాచరణ ప్రకటించాలి. అప్పుడే ప్రజల అసంతృప్తికి మనం జవాబు చెప్పవచ్చని స్పష్టం చేశారు.

బీజేపీ.. వైసీపీ.. మధ్యలో బాబు!

29 ఇరిగేషన్ ప్రాజెక్టులు, 5 లక్షల ఇళ్లు నిర్మించాలన్న లక్ష్యంతో వెళ్తున్న బాబు సర్కారు.. ఇప్పటికే లక్షా 25 వేల మందితో గృహప్రవేశాలు చేయించారు. అధికారంలోకి వచ్చాక సాధించిన సంక్షేమాన్ని ప్రచారం చేసుకునే ఎన్నికలు ఎదుర్కోవాలన్న ఆలోచనా లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు మళ్లీ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం, విభజన హామీలపై అమలు కోసం రాజకీయ పరంగా కేంద్రంపై పార్లమెంటులో పోరాటానికి అమరావతి నుంచి దిశానిర్దేశం చేస్తూనే, గురువారం దుబాయ్‌లో పారిశ్రామికవేత్తలను కలిసేందుకు వెళ్తున్నారు.

పారిశ్రామిక, సేవా రంగాలపై దృష్టి

- వృద్ధి రేటు పెంపునకు వీలుగా కేటాయింపులు
- ఆర్థిక శాఖ అధికారులకు యనమల ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో పారిశ్రామిక, సేవా రంగాల వృద్ధి రేటు పెరిగే వీలుగా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఉండాలని అధికారులను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ఆదేశించారు. విజయవాడలో తన క్యాంప్ కార్యాలయంలో ఆయన బుధవారం అధికారులతో బడ్జెట్ రూపకల్పనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా రంగం, పారిశ్రామిక రంగంలో వృద్ధి రేటు మరింత నమోదు కావాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. వృద్ధి రేటు పెరిగే విధంగా కేటాయింపులు జరిగేలా చూడాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేటాయింపులు, ఖర్చుల వివరాలను పరిశీలించారు. 2018-19 సంవత్సరంలో ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కేటాయింపులు ఉండాలని ఆదేశించారు. రాష్ట్రంలో రెండంకెల వృద్ధి రేటు 15 శాతం ఉండే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉండాలన్నారు. కాగా కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలను పెంచుతూ మంత్రుల బృంద నిర్ణయం తీసుకోవడంపై యనమలకు ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ బాబు, కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం తెలంగాణ కార్యదర్శిగా మళ్లీ తమ్మినేని

60 మందితో రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

ఆంధ్రభూమి బ్యూరో

నల్లగొండ, ఫిబ్రవరి 7: నల్లగొండలో నాలుగు రోజుల పాటు సాగిన సీపీఎం తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలు బుధవారం నాటితో ముగిశాయి. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్‌కారత్, బి.వి.రాఘవులు ఈ మహాసభలకు హాజరై సీపీఎం ప్రతినిధులకు పార్టీ పరమైన రాజకీయ మార్గదర్శకం చేశారు. మహాసభల్లో రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలకుసంబంధించి 40కిపైగా తీర్మానాలను చర్చించి ఆమోదించారు. తెలంగాణలో సీపీఎం బలోపేతానికి కావాల్సిన నూతన కార్యాచరణను ఖరారు చేసుకున్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం సాధనకు తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్, టీఆర్‌ఎస్‌లకు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లి రాజ్యాధికార సాధనకు కృషి చేయాలని నిర్ణయించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, పేదలు, కార్మిక వ్యతిరేక విధానాలపై, విభజన రాజకీయాలపైన, రాష్ట్రంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, నియంతృత్వ, కుటుంబ పాలన విధానాలపైన, భూనిర్వాసితులు, రైతుల సమస్యలపైన పార్టీ పరం గా ఉద్యమాలు నిర్మించాలని మహాసభల్లో తీర్మానించారు.



సీపీఎం రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న తమ్మినేని

సీపీఎం తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో పార్టీ రాష్ట్ర కమిటీ నూతన కార్యదర్శిగా వరుసగా రెండోసారి తమ్మినేని వీరభద్రంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం 60మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణలో సీపీఎం బలోపేతానికి గత మూడేళ్లుగా తమ్మినేని వివిధ ప్రజాసమస్యలపై ప్రజా ఉద్యమాల నిర్మాణాలతో సాగించిన కృషి, నాలుగువేల కిలోమీటర్ల పాదయాత్ర, టి.మాస్ నిర్మాణం, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ నిర్మాణంలో ఆయన చొరవను ప్రతినిధులు కొనియాడారు. మరోసారి తమ్మినేనినే రాష్ట్ర పార్టీ సారథిగా ఎన్నుకున్నారు. తమ్మినేనితో పాటు 13మంది ఎస్.వీరయ్య, సీతారాములు, నాగయ్య, నంద్యాల నరసింహారెడ్డి, రాజయ్య, బి.వెంకట్, టి.జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, సుదర్శన్‌రావు, జి.రాములు, డి.జి.నరసింహారావులను రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నుకోగా వారితో పాటు మరో 17మందిని రాష్ట్ర కేంద్ర కమిటీలోకి ఎన్నుకున్నారు.

క్రీడాభూమి

టీమిండియా హ్యాట్రిక్

మూడో వన్డేలోనూ నెగ్గిన కోహ్లీ సేన

కేప్ టౌన్, ఫిబ్రవరి 7: దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగిన మూడో వన్డే ఇంటర్నేషనల్‌ను కూడా విరాట్ కోహ్లీ కెప్టెన్సీలోని టీమిండియా గెల్చుకొని, ఆరు మ్యాచ్‌ల సిరీస్‌పై 3-0 ఆధిక్యాన్ని సంపాదించింది. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ అజేయ శతకంతో కదంతొక్కగా, దక్షిణాఫ్రికాలో భారత జట్టు మొదటిసారి వరుసగా మూడు వన్డేల్లో విజయాలను నమోదు చేసింది. భారత జట్టు సాధించిన 303 పరుగులకు సమాధానంగా దక్షిణాఫ్రికా 40 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. యువ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, యుజువేంద్ర చాహల్ చెరి నాలుగు వికెట్లు పడగొట్టి, దక్షిణాఫ్రికాను దారుణంగా దెబ్బతీశారు. భారత్ 124 పరుగుల భారీ తేడాతో విజయభేరి మోగించింది.

టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా ఫీల్డింగ్ ఎంచుకోగా, తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ మొదటి ఓవర్ చివరి బంతిలో తొలి వికెట్‌ను చేజార్చుకుంది. కాగిసో రబడా వేసిన తొలి ఓవర్ మొదటి ఐదు బంతులను రక్షణాత్మకంగా ఆడిన రోహిత్ శర్మ చివరి బంతిని హెన్రిచ్ క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. పరుగుల ఖాతా తెరవకుండానే వికెట్ కూలినప్పటికీ ఎలాంటి ఒత్తిడికి గురికాని రెండో ఓపెనర్ శిఖర్ ధావన్, ఫస్ట్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లీ అవకాశం దొరికిన ప్రతిసారీ భారీ షాట్లు కొడుతూ స్కోరుబోర్డును ముందుకు దూకించారు. దక్షిణాఫ్రికా బౌలింగ్‌ను సులభంగా ఎదుర్కొన్న వీరు రెండో వికెట్‌కు 140 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. 63 బంతులు ఎదుర్కొని, 12 ఫోర్లతో 76 పరుగులు చేసిన శిఖర్ ధావన్‌ను అయిడెన్ మర్క్‌రాన్ క్యాచ్ పట్టగా జీన్ పాల్ డుమినీ ఔట్ చేయడంతో ఈ భాగస్వామ్యానికి తెరపడింది. కోహ్లీ ఒకవైపు క్రీజ్‌లో నిలదొక్కుకొని ఆడితే, అజింక్య రహానే 11, హార్దిక్ పాండ్య 14, మాజీ కెప్టెన్, వికెట్‌కీపర్ మహేంద్ర సింగ్ ధోనీ 10, కేదార్ జాధవ్ ఒకటి చొప్పున పరుగులు చేసి పెవిలియన్ చేరారు. చివరిలో భువనేశ్వర్ కుమార్ (15)తో కలిసి నాటౌట్‌గా నిలిచిన కోహ్లీ159 బంతులు ఎదుర్కొని 160 పరుగులు సాధించాడు. అతని స్కోరులో 12 ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. దక్షిణాఫ్రికా బౌలర్లలో డుమినీ రెండు వికెట్లు పడగొట్టాడు. కాగిసో రబాదా, క్రిస్ మోరిస్, అండిల్ ఫెహ్లూక్వాయో , ఇమ్రాన్ తాహిర్ తలా ఒక్కో వికెట్ పంచుకున్నారు.

ఒక పరుగుకే తొలి వికెట్

భారత్‌ను ఓడించడానికి 304 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బ్యాటింగ్ ఆరంభించిన దక్షిణాఫ్రికా కేవలం ఒక పరుగు స్కోరు వద్ద ఓపెనర్ హాషీం ఆమ్లా వికెట్‌ను కోల్పోయింది. రెండు బంతులు ఎదుర్కొని, ఒక పరుగు చేసిన అతనిని జస్‌ప్రీత్ బుమ్రా ఎల్‌బిగా ఔట్ చేశాడు. అయితే, కెప్టెన్ అయిడెన్ మర్క్‌రాన్, ఆల్‌రౌండర్ డుమినీ జట్టును భారత బౌలింగ్‌కు ఎదురు నిలవడంతో దక్షిణాఫ్రికా ఊపిరి పీల్చుకుంది. రెండో వికెట్‌కు 79 పరుగులు జోడించి, ప్రమాదరకంగా కనిపించిన ఈ భాగస్వామ్యాన్ని కుల్దీప్ యాదవ్ తన మొదటి ఓవర్‌లోనే బ్రేక్ చేశాడు. 42 బంతుల్లో, రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 32 పరుగులు చేసిన మర్క్‌రాన్ షాట్‌కు ప్రయత్నించి, వికెట్‌కీపర్ ధోనీ స్టంప్ చేయడంతో పెవిలియన్ చేరాడు. హెన్రిచ్ క్లాసెన్ 6 పరుగులు చేసి, యుజువేంద్ర చాహల్ బౌలింగ్‌లో ఎల్‌బి అయ్యాడు. అర్ధ శతకాన్ని సాధించిన డుమినీ వికెట్‌ను కూడా చాహల్ పడగొట్టాడు. ఎల్‌బిగా ఔటైన డుమినీ 67 బంతుల్లో 51 పరుగులు చేశాడు. కొంత సేపు భారత బౌలింగ్‌ను ప్రతిఘటించిన డేవిడ్ మిల్లర్ 24 పరుగుల వ్యక్తిగత స్కోరువద్ద జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో ధోనీకి చిక్కాడు. హార్డ్ హిట్టర్ క్రిస్ మోరిస్ 14 పరుగులు చేసి, కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో ఎల్‌బి అయ్యాడు. 150 పరుగుల వద్ద దక్షిణాఫ్రికా ఆరో వికెట్ కోల్పోయి కష్టాల్లో పడింది. మరో పరుగు కూడా జత కాకముందే, ఖయా జొన్డో వికెట్ కూలింది. 17 పరుగులు చేసిన అతనిని సబ్‌స్టిట్యూట్ ఆటగాడు మనీష్ పాండే క్యాచ్ అందుకోగా, యుజువేంద్ర చాహల్ పెవిలియన్‌కు పంపాడు. ఇమ్రాన్ తాహిర్ 8 పరుగులు చేసి, యుజువేంద్ర చాహల్ బౌలింగ్‌లోనే కోహ్లీకి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. చివరిలో, కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో లుంగీ ఎన్గిడీ (6) ఎల్‌బి కావడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 40 ఓవర్లలో 179 పరుగుల వద్ద ముగిసింది.



కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన విరాట్ కోహ్లీ (160 నాటౌట్)

కెరీర్‌లో 34వ వన్డే ఇంటర్నేషనల్ సెంచరీ సాధించే క్రమంలో విరాట్ కోహ్లీ రెండు రికార్డులను అధిగమించాడు. కెప్టెన్‌గా వన్డేల్లో ఎక్కువ సెంచరీలు చేసిన సౌరవ్ గంగూలీని అతను అధిగమించాడు. కెప్టెన్‌గా సేవలు అందిస్తున్న సమయంలో గంగూలీ 11 శతకాలు సాధిస్తే, కోహ్లీ కెప్టెన్‌గా 12వ సెంచరీని నమోదు చేశాడు. అంతేగాక, 34 సెంచరీలను తక్కువ ఇన్నింగ్స్‌లో పూర్తి చేసిన భారత బ్యాట్స్‌మన్‌గా కూడా అతను చరిత్ర సృష్టించాడు. 197వ ఇన్నింగ్స్‌లోనే అతను ఈ మైలురాయిని చేరుకోగా సచిన్‌కు 101 ఇన్నింగ్స్ అధికంగా, అంటే, 298 ఇన్నింగ్స్ పట్టింది.

స్కోరుబోర్డు

__భారత్ ఇన్నింగ్స్:__ రోహిత్ శర్మ సి హెన్రిచ్ క్లాసెన్ బి కాగిసో రబడా 0, శిఖర్ ధావన్ సి అయిడెన్ మర్క్‌రాన్ బి డుమినీ 76, విరాట్ కోహ్లీ 160 నాటౌట్, అజింక్య రహానే సి అండిల్ ఫెహ్లూక్వాయో బి డుమినీ 11, హార్దిక్ పాండ్య సి హెన్రిచ్ క్లాసెన్ బి క్రిస్ మోరిస్ 14, మహేంద్ర సింగ్ ధోనీ సి లుంగీ ఎన్గిడీ బి ఇమ్రాన్ తాహిర్ 10, కేదార్ జాధవ్ సి హెన్రిచ్ క్లాసెన్ బి అండిల్ ఫెహ్లూక్వాయో 1, భువనేశ్వర్ కుమార్ 16 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 15, __మొత్తం (50 ఓవర్లలో 6 వికెట్లకు) 303.__

__వికెట్ల పతనం:__ 1-0, 2-140, 3-160, 4-188, 5-228, 6-236.

__బౌలింగ్:__ కాగిసో రబడా 10-1-54-1, లుంగీ ఎన్గిడీ 6-0-47-0, క్రిస్ మోరిస్ 9-0-45-1, అండిల్ ఫెహ్లూక్వాయో 6-0-42-1, ఇమ్రాన్ తాహిర్ 9-0-52-1, జీన్ పాల్ డుమినీ 10-0-60-2.

__దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:__ హాషీం ఆమ్లా ఎల్‌బి జస్‌ప్రీత్ బుమ్రా 1, అయిడెన్ మర్క్‌రాన్ స్టంప్డ్ మహేంద్ర సింగ్ ధోనీ బి కుల్దీప్ యాదవ్ 32, జీన్ పాల్ డుమినీ ఎల్‌బి యుజువేంద్ర చాహల్ 51, హెన్రిచ్ క్లాసెన్ ఎల్‌బి యుజువేంద్ర చాహల్ 6, డేవిడ్ మిల్లర్ సి మహేంద్ర సింగ్ ధోనీ బి జస్‌ప్రీత్ బుమ్రా 25, ఖయా జొన్డో సి (సబ్‌స్టిట్యూట్) మనీష్ పాండే బి యుజువేంద్ర చాహల్ 17, క్రిస్ మోరిస్ ఎల్‌బి కుల్దీప్ యాదవ్ 14, అండిల్ ఫెహ్లూక్వాయో సి విరాట్ కోహ్లీ బి కుల్దీప్ యాదవ్ 3, కాగిసో రబడా 12 నాటౌట్, ఇమ్రాన్ తాహిర్ సి విరాట్ కోహ్లీ బి యుజువేంద్ర చాహల్ 8, లుంగీ ఎన్గిడీ ఎల్‌బి కుల్దీప్ యాదవ్ 6, ఎక్స్‌ట్రాలు 4, మొత్తం (40 ఓవర్లలో ఆలౌట్) 179.

__వికెట్ల పతనం:__ 1-1, 2-79, 3-88, 4-95, 5-129, 6-150, 7-150, 8-158, 9-167, 10-179.

__బౌలింగ్:__ భువనేశ్వర్ కుమార్ 7-0-41-0, జస్‌ప్రీత్ బుమ్రా 7-0-32-2, హార్దిక్ పాండ్య 8-0-35-0, యుజువేంద్ర చాహల్ 9-0-46-4, కుల్దీప్ యాదవ్ 9-1-23-4.

ఫెడ్ కప్ టెన్నిస్

చైనా చేతిలో భారత్ ఓటమి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఫెడ్ కప్ ఆసియా, ఓషియానా గ్రూప్-1 పోటీల్లో భాగంగా బుధవారం చైనాను ఢీకొన్న భారత్ 1-2 తేడాతో పరాజయాన్ని చవిచూసింది. మొదటి మ్యాచ్‌లో 19 ఏళ్ల కర్మాన్ కౌర్ 2-6, 2-6 తేడాతో యఫాన్ వాంగ్ చేతిలో ఓడింది. రెండో మ్యాచ్‌లో అంకిత రైనా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తన కంటే ఎంతో మెరుగైన స్థానంలో ఉన్న లిన్ ఝూను 6-3, 6-2 తేడాతో ఓడించడంతో ఇరు జట్లు చెరొక విజయంతో సమవుజ్జీగా నిలిచాయి. అయితే, కీలకమైన చివరి డబుల్స్ మ్యాచ్‌లో ప్రార్థన థంబారే, అంకిత రైనా జోడీ 2-6, 6-7 తేడాతో యఫాన్ వాంగ్, జయావోజువాన్ యాంగ్ జోడీ చేతిలో ఓటమిపాలైంది. చైనాతో పోటీని కోల్పోయిన భారత్ గురువారం కజకస్తాన్‌ను ఢీకొంటుంది. హాంకాంగ్‌ను 3-0 తేడాతో చిత్తుచేసిన కజకస్తాన్‌ను ఓడిస్తేగానీ, భారత్ ముందంజ వేసే అవకాశం ఉండదు.

క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి

మైన్మార్, ఫిబ్రవరి 7: ఆసియా పారా సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో మూడు పతకాలు సాధించి క్లీన్ స్వీప్ చేసే దిశగా భారత్ కృతనిశ్చయంతో ఉంది. భారత పారా సైక్లింగ్ జట్టు కోచ్ ఆదిత్య మెహతా నేతృత్వంలో భారత్ బహ్రెయిన్‌లో గత ఏడాది మూడు పతకాలను కైవసం చేసుకుంది. జట్టులో 25 ఏళ్ల అభిషేక్ షేఖు బంగారు పతకం సాధించగా, దివిజ్ షా కాంస్యం, హరీందర్ సింగ్ రజత పతకం గెలుచుకున్నారు. మళ్లీ ఇపుడు శుక్రవారం నుండి మైన్మార్‌లో జరుగబోయే పోటీలకు తమ జట్టు అన్నివిధాల సన్నద్ధమవుతోందని, తప్పనిసరిగా చాంపియన్‌షిప్ సాధిస్తామని కెప్టెన్ ఆదిత్య మెహతా ధీమా వ్యక్తం చేశాడు.

ఝూలన్ రికార్డు

కింబర్లీ: మహిళల వన్డే ఇంటర్నేషనల్స్‌లో 200 వికెట్ల మైలురాయిని చేరుకున్న తొలి బౌలర్‌గా భారత మీడియం పేసర్ ఝూలన్ గోస్వామి రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగిన రెండో వన్డేలో లారా ఉల్వార్ట్‌ను సుష్మా వర్మ క్యాచ్ పట్టగా ఔట్ చేయడంతో ఆమె వన్డేల్లో 200వ వికెట్‌ను తన ఖాతాలో వేసుకుంది. మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ల జాబితాలో ఝూలన్ నంబర్ వన్ స్థానంలో కొనసాగుతుండగా, రెండో స్థానంలో ఉన్న కాథరిన్ ఫిజ్‌పాట్రిక్స్ 180 వికెట్లు పడగొట్టింది. లీసా స్టాలేకర్ 146 వికెట్లతో మూడో స్థానంలో ఉంది. వీరిద్దరూ ఆస్ట్రేలియా బౌలర్లే.



ముక్కోణపు టీ20

మాక్స్‌వెల్ ఆల్‌రౌండ్ ప్రతిభ

ఇంగ్లాండ్‌పై ఆస్ట్రేలియా గెలుపు



అజేయ శతకంతో రాణించిన గ్లెన్ మాక్స్‌వెల్

హోబర్ట్, ఫిబ్రవరి 7: న్యూజిలాండ్ కూడా పాల్గొంటున్న ముక్కోణపు టీ-20 ఇంటర్నేషనల్ సిరీస్‌లో భాగంగా బుధవారం ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌ని ఆస్ట్రేలియా ఐదు వికెట్ల తేడాతో గెల్చుకుంది. గ్లేన్ మాక్స్‌వెల్ మూడు వికెట్లు పడగొట్టడంతోపాటు అజేయ శతకంతో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరచి ఆస్ట్రేలియాను విజయపథంలో నడిపించాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేసింది. దావీద్ మలాన్ 50 పరుగులు చేయగా, అలెక్స్ హాలెస్, కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ చెరి 22 పరుగులు సాధించారు. మాక్స్‌వెల్ రెండు ఓవర్లు బౌల్ చేసి, కేవలం పది పరుగులిచ్చి మూడు వికెట్లు కూల్చాడు. ఆస్టన్ అగర్ 15 పరుగులకు రెండు వికెట్లు పడగొట్టాడు. బిల్లీ స్టాన్లాక్, కేన్ రిచర్డ్‌సన్, ఆండ్రూ టై, మాస్కస్ స్టొయినిస్ తలా ఒక్కో వికెట్ కూల్చారు.

మొదటి ఓవర్‌లోనే రెండు వికెట్లు

ఇంగ్లాండ్‌ను ఓడించడానికి 156 పరుగులు చేయాల్సిన ఆస్ట్రేలియా డేవిడ్ విల్లీ వేసిన మొదటి ఓవర్‌లోనే డేవిడ్ వార్నర్ (4), క్రిస్ లిన్ (9) వికెట్లను కోల్పోయింది. అయితే, సెకండ్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన మాక్స్‌వెల్ ఏమాత్రం తడబడకుండా ఇంగ్లాండ్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. మూడో వికెట్‌కు 80 పరుగులు జత కలిసిన తర్వాత ఓపెనర్ ఆర్సీ షార్ట్ ఔటయ్యాడు. 20 బంతులు ఎదుర్కొన్న అతను రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 30 పరుగులు చేశాడు. మాస్కస్ స్టొయినిస్ (6), ట్రావిస్ హెడ్ (6) తక్కువ పరుగులకే పెవిలియన్ చేరినప్పటికీ, విజృంభణను కొనసాగించిన మాక్స్‌వెల్ సెంచరీ పూర్తి చేసి, ఆస్ట్రేలియాను గెలిపించాడు. 58 బంతులు ఎదుర్కొని 103 పరుగులు చేసి, నాటౌట్‌గా నిలిచిన అతని స్కోరులో 10 ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. 20 ఓవర్లలో ఆస్ట్రేలియా 5 వికెట్లకు 161 పరుగులు చేయగా, మాక్కవెల్‌తోపాటు అలెక్స్ కారీ 5 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో విల్లీ ఒక్కడే రాణించాడు. అతను మూడు ఓవర్లు బౌల్ చేసి, 28 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టాడు. సెంచరీ హీరో మాక్స్‌వెల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

సంక్షిప్త స్కోర్లు

__ఇంగ్లాండ్ ఇన్నింగ్స్:__ 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 (దావీద్ మలాన్ 50, అలెక్స్ హాలెస్ 22, ఇయాన్ మోర్గాన్ 22, అస్టన్ అగర్ 2/15, గ్లేన్ మాక్స్‌వెల్ 3/10).

__ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:__ 20 ఓవర్లలో 5 వికెట్లకు 161 (ఆర్సీ షార్ట్ 30, మాక్స్‌వెల్ 103 నాటౌట్, డేవిడ్ విల్లీ 3/28).



మహిళల వన్డే క్రికెట్ సిరీస్

స్మృతి సూపర్ సెంచరీ

దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం

కింబర్లీ, ఫిబ్రవరి 7: దక్షిణాఫ్రికాపై విరాట్ కోహ్లీ నాయకత్వంలోని భారత జట్టును స్ఫూర్తిగా తీసుకున్న మహిళల జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగిన రెండో వన్డే ఇంటర్నేషనల్‌లో మిథాలీ రాజ్ నాయకత్వంలోని భారత్ 178 పరుగుల భారీ తేడాతో విజయభేరి మోగించింది. స్మృతి మందానా సూపర్ సెంచరీ ఈ విజయంలో కీలక పాత్ర పోషించింది. ప్రత్యర్థి ముందు 303 పరుగుల లక్ష్యాన్ని ఉంచిన భారత్ ఆతర్వాత దక్షిణాఫ్రికాను కేవలం 124 పరుగులకే కట్టడి చేసి, తిరుగులేని విజయాన్ని నమోదు చేసింది.

టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా ఆహ్వానం అందుకొని బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి వికెట్‌ను పూనమ్ రావత్ రూపంలో కోల్పోయింది. 20 పరుగులు చేసిన ఆమె త్రిష చెట్టి క్యాచ్ పట్టగా, మసబతా క్లాస్ బౌలింగ్‌లో ఔటైంది. కెప్టెన్ మిథాలీ రాజ్ 20 పరుగుల వ్యక్తిగత స్కోరువద్ద త్రిష చెట్టి క్యాచ్ అందుకోగా రైసిబ్ నొజాకే బౌలింగ్‌లో పెవిలియన్ చేరింది. క్రీజ్‌లో పాతుకుపోయిన స్మృతి 129 బంతులు ఎదుర్కొని, 14 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 135 పరుగులు సాధించింది. ఆ తర్వాత హర్మన్‌ప్రీత్ కౌర్ (55), వేదా కృష్ణమూర్తి (51) అర్ధ శతకాలతో నాటౌట్‌గా నిలవడంతో, భారత్ 3 వికెట్లకు 302 పరుగుల భారీ స్కోరు సాధించింది. మసబతా క్లాస్, రైసిబ్ నొజాకే, సనే లూస్ తలా ఒక్కో వికెట్ పడగొట్టారు.

లిజెల్ పోరాటం వృథా

భారత్‌ను ఓడించేందుకు ఓపెనర్ లిజెల్ లీ కొనసాగించిన పోరాటం వృథా అయింది. బ్యాటింగ్‌కు వచ్చిన వారు పెవిలియన్‌కు క్యూ కట్టినప్పటికీ భారత బౌలింగ్‌ను లిజెల్ సమర్థంగా ఎదుర్కొంది. 75 బంతుల్లో, ఎనిమిది పోర్లు, మూడు సిక్సర్లతో 73 పరుగులు సాధించిన ఆమెను దీప్తి శర్మ ఎల్‌బిగా ఔట్ చేసింది. ఆమెతోపాటు మరిజానే కాప్ (17 నాటౌట్) మాత్రమే దక్షిణాఫ్రికా జట్టులో రెండంకెల స్కోరు చేయగలిగింది. మిగతా వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడంతో దక్షిణాఫ్రికా 30.5 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. పూనమ్ యాదవ్ 24 పరుగులకు నాలుగు వికెట్లు పడగొట్టింది. రాజేశ్వరీ గైక్వాడ్, దీప్తి శర్మ చెరి రెండు వికెట్లు సాధించారు.

సంక్షిప్త స్కోర్లు

__భారత మహిళల ఇన్నింగ్స్:__ 50 ఓవర్లలో మూడు వికెట్లకు 302 (స్మృతి మందానా 135, హర్మన్‌ప్రీత్ కౌర్ 55 నాటౌట్, వేదా కృష్ణమూర్తి 51 నాటౌట్).

__దక్షిణాఫ్రికా మహిళల ఇన్నింగ్స్:__ 30.5 ఓవర్లలో 124 ఆలౌట్ (లిజెల్ లీ 73, మరిజానే కాప్ 17 నాటౌట్, పూనమ్ యాదవ్ 4/24, రాజేశ్వరీ గైక్వాడ్ 2/14, దీప్తి శర్మ 2/34).



సియోల్ చేరుకున్న ఉత్తర కొరియా ఛీర్‌లీడర్లు

సియోల్, ఫిబ్రవరి 7: ఉత్తర కొరియా ఛీర్‌లీడర్లు దక్షిణ కొరియాలో అడుగుపెట్టారు. వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న తమ అథ్లెట్లను ప్రోత్సహించడానికి 229 మంది ఛీర్‌లీడర్లుసహా మొత్తం 280 మంది బుధవారం సియోల్ విమానాశ్రయంలో దిగారు. ఒకే రకమైన దుస్తులు వేసుకొని, తలపై టోపీలు పెట్టుకొన్న ఉత్తర కొరియా బృందం ఉభయ కొరియా దేశాల మధ్యగల డీమిలిటరైజ్డ్ జోన్ మీదుగా, డొరాసన్ సరిహద్దును దాటి, దక్షిణ కొరియాలోని పయాంగ్‌చాంగ్‌లో జరిగే వింటర్ ఒలింపిక్స్ కోసం సియోల్ చేరుకున్నారు. ఇది వరకే ఉత్తర కొరియా కళాకారుల బృందం ఇక్కడికి చేరుకోగా, ఇప్పుడు ఛీర్‌లీడర్లు కూడా వచ్చారు. విమానాశ్రయంలో దిగిన వీరంతా నవ్వులు చిందిస్తూ, ఎంతో హుషారుగా కనిపించారు. మిమ్మల్ని కలుసుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది అంటూ అక్కడ ఉన్న విమానాశ్రయ సిబ్బందిని ఆప్యాయంగా పలకరించారు. ఛీరింగ్ రొటీన్ ఏ విధంగా ఉండబోతున్నదని అక్కడే ఉన్న ఓ విలేఖరి ప్రశ్నించగా, ఒక ఛీర్‌గర్ల్ స్పందిస్తూ, వేచి చూడండి. ఇప్పుడే చెప్పేస్తే, వింటర్ ఒలింపిక్స్ జరిగే సమయంలో మేము చేసే విన్యాలపై ఆసక్తి ఏముంటుంది? అని ఎదురుప్రశ్న వేసింది. కిమ్ జాంగ్ ఉన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న రూలింగ్ వర్కర్స్ పార్టీ ఎంతో కసరత్తు చేసిన తర్వాత ఛీర్‌లీడర్లను ఎంపిక చేసింది. ముందుగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఛీరింగ్‌లో వారి ప్రతిభను పరీక్షించారు. ఆతర్వాత వారు, వారి కుటుంబాలను గురించిన పూర్తి సమాచారాన్ని సేకరించారు. అధ్యక్షుడు కిమ్‌కు, ప్రభుత్వానికి విధేయులుగా ఉంటున్నారా? లేదా? అనే కోణంలోనూ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగింది. ఎన్నో పరీక్షలు, వడబోతల అనంతరం దక్షిణ కొరియాకు వెళ్లే ఛీర్‌లీడర్లను ఉత్తర కొరియా అధికారులు ఎంపిక చేశారు. దక్షిణ కొరియాలో ఇంతకు ముందు, 2003లో జరిగిన ఆసియా క్రీడలు, 2005లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ తదితర ఈవెంట్స్‌కు కూడా ఉత్తర కొరియా ఛీర్‌లీడర్లను పంపింది. ఇప్పుడు పయాంగ్‌చాంగ్‌లో జరిగే వింటర్ ఒలింపిక్స్‌కు మరోసారి ఛీర్‌లీడర్లను దక్షిణ కొరియాకు పంపించింది. మొత్తం మీద వింటర్ ఒలింపిక్స్ వల్లరెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడింది.

నబీ విజృంభణ



మహమ్మద్ నబీ

జింబాబ్వేను ఓడించిన అఫ్గానిస్తాన్

2-0 తేడాతో టీ-20 సిరీస్ కైవసం

షార్జా, ఫిబ్రవరి 7: జింబాబ్వేతో జరిగిన చివరి, రెండో టీ-20 ఇంటర్నేషనల్‌ను 17 పరుగుల తేడాతో గెల్చుకున్న అఫ్గానిస్తాన్ రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0 ఆధిక్యంతో సొంతం చేసుకుంది. మహమ్మద్ నబీ విజృంభణ అఫ్గాన్ విజయంలో కీలక పాత్ర పోషించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 158 పరుగులు సాధించింది. జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడిన నబీ కేవలం 26 బంతులు ఎదుర్కొని, రెండు ఫోర్లు, నాలుగు భారీ సిక్సర్లతో 45 పరుగులు సాధించాడు. కరీం సాదిక్ 28, అజ్గర్ స్టానిక్‌జాయ్ 27, నజీబుల్లా జద్రాన్ 24 చొప్పున పరుగులు చేయడంతో, అఫ్గానిస్తాన్ గౌరవ ప్రదమైన స్కోరును అందుకోగలిగింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే పరుగుల వేటలో విఫలమై, 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 141 పరుగులు చేయగలిగింది. సికిందర్ రజా 40 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అఫ్గాన్ బౌలర్లలో ముజీబ్ జద్రాన్, రషీద్ ఖాన్ చెరి రెండు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో అఫ్గాన్ రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో జింబాబ్వేపై క్లీన్‌స్వీప్ సాధించింది.

సంక్షిప్త స్కోర్లు

__అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్:__ 20 ఓవర్లలో 9 వికెట్లకు 158 (మహమ్మద్ నబీ 45, కరీం సాదిక్ 28, నజీబుల్లా జద్రాన్ 24, అజ్గర్ స్టానిక్‌జాయ్ 27 టెండై చతారా 3/20).

__జింబాబ్వే ఇన్నింగ్స్:__ 20 ఓవర్లలో 5 వికెట్లకు 141 (సికందర్ రజా 40, ముజీ బ్ జద్రాన్ 2/21, రషీద్ ఖాన్ 2/23).

టీడీపీ-బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

- లోక్‌సభలో ధ్వజమెత్తిన కాంగ్రెస్, వామపక్షాలు
- ఖర్గే ప్రసంగిస్తుంటే అడ్డుకున్నారు..
- ప్రధాని మాట్లాడుతుంటే మిన్నకున్నారు
- టీడీపీ సభ్యులను నిలదీసిన కాంగ్రెస్
- ఏపీకి న్యాయం చేయాలంటూ నినాదాలు



బుధవారం లోక్‌సభలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే


ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: కాంగ్రెస్, వామపక్షాలు బుధవారం లోక్‌సభలో ఎత్తుకు పైఎత్తు వేసి తెలుగుదేశం, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్‌ను వెలుగులోకి తెచ్చాయి. మంగళవారం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తున్న సమయంలో గొడవ చేసిన మీరు.. ఈ రోజు ప్రధాన మంత్రి ప్రసంగాన్ని ఎందుకు అడ్డుకోవటం లేదు.. సీట్లలోకి ఎందుకు వెళుతున్నారంటూ నిలదీసిన కాంగ్రెస్ సభ్యులతో తెలుగుదేశం సభ్యులు గొడవ పడ్డారు. ప్రధాన మంత్రి ప్రసంగానికి అడ్డుపడవద్దంటూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత కుమార్ విజ్ఞప్తి చేసిన వెంటనే తెలుగుదేశం సభ్యులు తమ సీట్లలోకి వెళ్లిపోయారు. వేంటనే మల్లికార్జున ఖర్గే, జ్యోతిరాదిత్య సింధియా, వేణు గోపాల్ తదితర కాంగ్రెస్ నాయకులు లేచి టీడీపీ, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. వారంతటితో ఊరుకోకుండా నరేంద్ర మోదీ ప్రసంగిస్తున్న సమయంలో పోడియం వద్ద నిలబడి నినాదాలిచ్చారు. ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ గంటన్నర సేపు సభ దద్దరిల్లేలా కాంగ్రెస్, వామపక్షాల సభ్యులు నినదించారు.

తెలుగుదేశం సభ్యులు మంగళవారం చేసిన నినాదాలు బుధవారం కాంగ్రెస్ సభ్యులు ఇవ్వటం గమనార్హం. పోలవరం ఎక్కడకి పోయింది?, రైల్వే జోన్ ఎక్కడ? ఉక్కు కార్మాగారం ఏది? విభజన హామీలు ఎక్కడికి పోయాయంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

తెలుగుదేశం, వైఎస్‌ఆర్‌సీపీ సభ్యులు బుధవారం ఉదయం పదకొండు గంటల నుండే పోడియం వద్ద నిరసన తెలుపుతూ విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ నినాదాలు ఇవ్వటం ప్రారంభించారు. నరేంద్ర మోదీ మధ్యాహ్నం పన్నెండు గంటలకు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వవలసి ఉండింది. దీనికిముందు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత కుమార్ లేచి ప్రధాని ప్రసంగానికి అడ్డుతగలవద్దని టీడీపీ ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. వెంటనే టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ మంత్రి సుజనా చౌదరి కూడా సీట్లలోకి వెళ్లవలసిందిగా తమ ఎంపీలకు సూచించారు. దీనితో పోడియం వద్ద నినాదాలు ఇస్తున్న తెలుగుదేశం సభ్యులు తిరిగి సీట్లలో కూర్చున్నారు. తాము సభనుండి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి వైఎస్‌ఆర్‌సీపీ సభ్యులు బైటికి వెళ్లిపోయారు. ఆ సమయంలో కాంగ్రెస్ చీఫ్‌విప్ జ్యోతిరాదిత్య సింధియా లేచి విభజన హామీల అమలుకోసం మల్లికార్జున ఖర్గే ప్రసంగాన్ని అడ్డుకున్న మీరు ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకోకుండా సీట్లలోకి ఎందుకు వెళ్లిపోతున్నారు.. ఇది మ్యాచ్ ఫిక్కింగ్ కాదా? అని నిలదీశారు. దీనితో ఆగ్రహం చెందిన కేశినేని నాని, లోక్‌సభలో టీడీపీ పక్షం నాయకుడు తోట నరసింహం ఆయనతో వాగ్వాదానికి దిగారు. ఇరుపక్షాలు ఒకరిపై మరొకరు ఆగ్రహంతో ఆరోపణలు చేసుకోవటంతో సభ దద్దరిల్లింది. స్పీకర్ సుమిత్రా మహాజన్ ఇరుపక్షాల సభ్యులను శాంత పరిచేందుకు ఎంత ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు.

ఇంతలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ మేగ్వాల్ తదితరులు పరుగున వెళ్లి తెలుగుదేశం సభ్యులను వారి సీట్లలోకి తీసుకుపోయారు. ఇది జరిగిన అనంతరం ప్రతిపక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గే లేచి నిన్న తాను ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన హామీల గురించి మాట్లాడుతుంటే తెలుగుదేశం సభ్యులు అడ్డుకున్నారని ఆరోపించారు. ఏపీకి అన్యాయం జరగకుండా చూడాలి.. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలుగుదేశం, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగింది కాబట్టే మోదీ ప్రసంగాన్ని వారు అడ్డుకోవటం లేదని ఆరోపించారు. ఇంతలో కాంగ్రెస్, వామపక్షాల సభ్యులు పోడియం వద్దకు వచ్చి నినాదాలిస్తూ మోడీ ప్రసంగానికి అడ్డుతగిలారు. 'మ్యాచ్ ఫిక్సింగ్ ఆపండి', 'ఉమ్మడి నాటకాలు ఆపండి', 'విభజన హామీలు అమలు చేయండి' అంటూ కాంగ్రెస్, వామపక్షాల సభ్యులు దాదాపు గంటన్నరపాటు సభ దద్దరిల్లేలా నినాదాలు ఇచ్చారు. వీళ్లు నినాదాలు ఇస్తుంటే తెలుగుదేశం సభ్యులు మాత్రం తమ సీట్లలో కూర్చుని ప్రధాని ప్రసంగాన్ని ఆలకించారు. ప్రధాని ప్రసంగం ముగించి వెళ్లిపోగానే టీడీపీ సభ్యులు మళ్లీ పోడియం వద్దకు వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు ఇవ్వటం గమనార్హం.



పార్లమెంటు వెలుపల ప్లకార్డుతో మౌనంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు

కేవీపీ, సీఎం రమేష్‌పై సస్పెన్షన్ వేటు

రాజ్యసభలో నిరసనకు ఫలితం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఆంధ్రప్రదేశ్ విభజన హామీలను అమలు చేయాలంటూ రాజ్యసభ పోడియం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలిచ్చిన కాంగ్రెస్ సభ్యుడు కేవీపీ రామందర్‌రావు, తెలుగుదేశం సభ్యుడు సీఎం రమేష్ సభనుండి సస్పెండ్ అయ్యారు. రాజ్యసభ అధ్యక్షుడు ఎం.వెంకయ్యనాయుడు బుధవారం ఉదయం పదకొండు గంటల పదిహేను నిమిషాలకు సభలో గొడవ చేస్తున్న రామచందర్‌రావును సభ నుండి సస్పెండ్ చేస్తే, ఉపాధ్యక్షుడు పీజే కురియన్ సాయంత్రం ఐదున్నర గంటలకు తెలుగుదేశం సభ్యుడు రమేష్‌ను సస్పెండ్ చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ముగ్గురు సభ్యులు రమేష్, గరికపాటి రామ్మోహన్ నాయుడు, తోట సీతారామలక్ష్మి పోడియం వద్ద నిలబడి గొడవ చేయగా కురియన్ మాత్రం కేవలం రమేష్‌ను మాత్రమే సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ అనంతరం రామచందర్‌రావు సభనుండి బైటికి వెళ్లిపోగా, రమేష్ మాత్రం పట్టించుకోకుండా పోడియం వద్ద నిలబడి గొడవ చేయటంతో రాజ్యసభ మొదట మూడుసార్లు వాయిదా పడి చివరకు గురువారానికి వాయిదా పడింది. కురియన్ ఆదేశం మేరకు మార్షల్స్ సభలోకి వచ్చి రమేష్‌ను బైటికి తీసుకుపోయేందుకు ప్రయత్నించారు. సభ వాయిదా పడటంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు.


రాజ్యసభ బుధవారం ప్రారంభం కాగానే రామచందర్‌రావు పోడియం వద్దకు వచ్చి 'ఏపీకి న్యాయం చేయండి' అని రాసి ఉన్న ప్లకార్డుతో మౌన ప్రదర్శన ప్రారంభించారు. దీనికి వెంకయ్యనాయుడు అభ్యంతరం తెలిపారు. ఒక సభ్యుడు ఇలా పోడియం వద్ద నిలబడి ప్లకార్డు ప్రదర్శిస్తుంటే సభను కొనసాగించటం సాధ్యం కాదని స్పష్టం చేశారు. రామచందర్‌రావు తన సీట్లోకి వెళ్లాలని ఆయన పలుమార్లు విజప్తి చేశారు. అయినా రామచందర్‌రావు మౌన ప్రదర్శన కొనసాగించటంతో 'మీ సభ్యుడిని అదుపుచేయండి' అని ప్రతిపక్షం నాయకుడు గులాం నబీ ఆజాద్‌కు సూచించారు. ఆజాద్ లేచి రామచందర్‌రావు వ్యవహారాన్ని కాంగ్రెస్ సమర్థించటం లేదని ప్రకటించారు. దీనితో రామచందర్‌రావును సభనుండి సస్పెండ్ చేసే ప్రక్రియ చేపట్టారు. రాజ్యసభ నియమావళిలోని 255 నియమం ప్రకారం ఆయన రామచందర్‌రావును సభ నుండి వెళ్లిపోవాలని ఆదేశించారు. దీనితో రామచందర్‌రావు కొన్ని నిమిషాలపాటు అక్కడే నిలబడిన అనంతరం బైటికి వెళ్లిపోయారు. తెలుగుదేశం సభ్యులు రమేష్, రామ్మోహన్‌రావు, సీతారామ లక్ష్మి బుధవారం సాయంత్రం రాజ్యసభ పోడియ వద్దకు వచ్చి విభజన హామీలను అమలు చేయాలంటూ ప్లకార్డు ప్రదర్శిస్తూ నినాదాలిచ్చారు. మీరిలాగే పోడియం వద్ద నిలబడి నినాదాలిస్తే సస్పెండ్ చేయవలసి వస్తుందని హెచ్చరించారు. అయితే ముగ్గురు తెలుగుదేశం సభ్యులూ అలాగే నినాదాలు ఇచ్చారు. దీనితో కురియన్ సభానియమంలోని 255 రూలు ప్రకారం రమేష్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. రమేష్ సభ నుండి వెళ్లిపోవాలని ఆదేశించారు. ఆయన రమేష్ పోడియం వద్దనే నిలబడి నినాదాలిచ్చారు. అనంతరం ముగ్గురు మార్షల్స్ వచ్చి రమేష్‌ను సభ నుండి బైటికి తీసుకుపోయేందుకు ప్రయత్నించారు. ఇంతలో కురియన్ సభను వాయిదా వేశారు.



పార్లమెంటు వెలుపల ప్లకార్డులు పట్టకుని నినాదాలిస్తున్న తెలుగుదేశం పార్టీ ఎంపీలు

ఏకమవుదాం.. ఒత్తిడిచేద్దాం

- హామీల సాధనకు ఒక్క గొంతుక సరిపోదు
- పోరాడేవారందరితో కలిసి ఐకాస
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 7: విభజన సమయంలో ఇచ్చిన హామీలను ఎందుకు నేరవేర్చడం లేదని ప్రశ్నించడానికి తాను ఒక్కడినే సరిపోనని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రెండు ప్లకార్డులు ప్రదర్శించి, నాలుగు స్లోగన్‌లు ఇస్తే సరిపోదని, తెలంగాణ సాధనకు అన్ని పార్టీలూ కలిసి కట్టుగా ఎలా చేశాయో అదేవిధంగా ఆంధ్రాలోనూ పనిచేయాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ చెప్పారు. బుధవారం సాయంత్రం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌పైనా ఆయన స్పందించారు. ప్రత్యేక హోదా ఇస్తామని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంటులో ప్రకటించారని, మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని ఆశించామని అన్నారు. భారతీయ జనతా పార్టీ ఎన్నికల అజెండాలోనూ ప్రత్యేక హోదా అంశాన్ని చేర్చిందని, ఈ అంశాన్ని తిరుపతిలో తాను లేవనెత్తిన తర్వాతనే ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారని అన్నారు. కేంద్రం నుండి వచ్చిన నిధులపై ఇంతవరకూ స్పష్టత లేదని, రాష్ట్రంలో ఒక మాట, పార్లమెంటులో మరో మాట మాట్లాడుతున్నారని అన్నారు. పార్లమెంటులో ఏ హామీ ఇచ్చారో, ఆ హామీని నిలుపుకోవాలన్న అంశంపై పోరాటం చేస్తామని అన్నారు. ప్రభుత్వాలు చేసిన చట్టాలను అమలుచేయనపుడు ప్రజల నుండి సహజంగానే వ్యతిరేకత వస్తుందని పవన్ హెచ్చరించారు.

విభజన చట్టం హామీల అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భిన్న వాదనలు వినిపిస్తున్నాయని, హామీల అమలుపై ప్రశ్నించేందుకు జనసేన గొంతుక ఒక్కటే సరిపోదని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఒక వేదికను రూపొందించాలని అన్నారు. తెలంగాణ ఐకాస మాదిరిగా ఆంధ్రాలోనూ మేధావులు అంతా ఏకం కావాలని సూచించారు. జయప్రకాశ్ నారాయణ్, ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటి మేధావులను కలుపుకుని ఐకాసా వంటిది ఏర్పాటుచేస్తామని, ప్రజలను మభ్యపెట్టే రాజకీయ విధానాలు ఎంతమాత్రం సరికాదని పేర్కొన్నారు. బంద్‌ల పేరిట మనల్ని మనం హింసించుకోవడం సరికాదని, ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే బంద్‌లు నిర్వహించాలని, వాటికే జనసేన మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావానికి ముఖ్యకారణం కూడా విధి విధానాలతో రాష్ట్ర విభజన జరగకపోవడమేనని అన్నారు. అందరికీ సమాన న్యాయం కోసం పోరాడటానికే పార్టీ పెట్టామని అన్నారు. వామపక్షాల బంద్‌కు శాంతియుత ధర్నాలకు జనసేన మద్దతు ఇస్తుందని చెప్పారు. 2014 ఎన్నికలకు ముందు నరేంద్ర మోదీని కలిసి ఆయనకు మద్దతు ఇవ్వడానికి కారణం కాబోయే ప్రధాని వద్దకు విడిపోయిన రెండు రాష్ట్రాల సమస్యలను తీసుకువెళ్లే అవకాశం ఉంటుందని భావించామని అన్నారు. తాను నరేంద్ర మోదీని కలిసినపుడు కాంగ్రెస్ పార్టీ ఆనాడు సరిగా విభజించలేదు కనుక రెండు రాష్ట్రాలకూ న్యాయం చేయమని తాను అడిగానని అన్నారు. దశాబ్దాల తరబడి జరిగిన అన్యాయాన్ని మార్చడానికి కొంత సమయం పడుతుంది కనుక తాను ఎన్‌డీయేను ప్రశ్నించకుండా కొంతకాలం వేచి చూశానని, కానీ ఇప్పటికీ బీజేపీ, టీడీపీలు ప్రత్యేక హోదా గురించి ప్రజలను పదే పదే మభ్యపెట్టడం జరుగుతోందని అన్నారు. తాను ప్రజల పక్షం తప్ప ఏ పార్టీ పక్షం కాదని పేర్కొన్నారు. ఈ అంశాలపై తాను ప్రశ్నించినపుడల్లా మభ్యపెడుతున్నారే తప్ప క్లారిటీ ఇవ్వడం లేదని చెప్పారు. జనసేన మీద సామాజిక మాధ్యమాల్లో అనేక కామెంట్లు వస్తున్నాయని చెబుతూ పాలిటిక్స్ అంటే కన్‌స్ట్రక్టివ్ క్రిటిసిజం ఉండాలని, అలా లేని కామెంట్స్‌ను తాను పట్టించుకోనని అన్నారు. బూతులు తిట్టుకునే రాజకీయాలు తనకు రావని, తాను అలాంటి రాజకీయాలు చేయబోనని చెప్పారు. జేఏసీకి సంబంధించి చిరంజీవికి ఇన్విటేషన్ ఉందా అని ప్రశ్నించగా, నోనో చిరంజీవికి దీనితో ఎలాంటి సంబంధం లేదని అన్నారు.

న్యాయబద్ధంగా నిధులివ్వండి

పార్లమెంటు వద్ద వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీల నిరసన

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: విభజన సందర్భంగా ఏపీకి ఇచ్చిన హామీల అమలు, కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని కోరుతూ వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు బుధవారం కూడా నిరసనలు తెలిపారు. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి, అవినాశ్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, వరప్రసాద్ ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ప్రత్యేక హోదా, దుగరాజుపట్నం పోర్టు, ప్రత్యేక రైల్వే జోన్, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటూ నినాదాలిచ్చారు. న్యాయబద్ధంగా రావాల్సిన ప్రత్యేక హోదా, ప్రాజెక్టులు, నిధులను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ప్రారంభం కాగానే ఆ పార్టీ ఎంపీలు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి ఏపీకి న్యాయం చేయాలంటూ నినాదాలిచ్చారు. సుమారు గంటకుపైగా వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు నిరసన తెలిపారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం ప్రారంభానికి ముందు సభ నుంచి వాకౌట్ చేశారు.

రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ

ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన హామీలును బడ్జెట్ సమావేశాల్లో ఫైనాన్స్ బిల్లు ఆమోదం పొందే లోపు అమలుచేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వైఎస్‌ఆర్ సీపీ ఎంపీలు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉదయం రాజ్‌నాథ్ సింగ్‌తో వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు సమావేశమయ్యారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత కేంద్రంపై ఉందని, కేంద్ర ప్రభుత్వానికి ఇదే చివరి పూర్తిస్థాయి బడ్జెట్ అయినందున ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

మంచు దారిలో చుక్.. చుక్..



జర్మనీ సహా అనేక దేశాలు మంచుమయం అవుతున్నాయి. ఆ మంచు నుంచే తన దారిలో దూసుకుపోతోంది జర్మనీకి చెందిన ఈ నారోగేజ్ రైలు. పట్టాలు ఎక్కడున్నాయో తెలియనంతగా దట్టమైన మంచు ఇటు నేలను, అటు ఆకాశాన్ని కమ్మేసినా ఈ రైలు మాత్రం 'నా దారి నాదే'నంటూ ఇలా చుక్..చుక్ మంటూ సాగిపోతోంది. జర్మనీలోని హార్జన్ ప్రాంతంలో వెళుతున్న ఈ రైలు ఓ కెమెరామన్‌కు చిక్కింది. అంతే.. ఇలా ఓ అద్భుతమైన మంచు ఆవృత రైలు దృశ్యం మన కళ్లకు కట్టింది.

పోచంపల్లి 'ఇక్కత్' అద్భుతం

గవర్నర్ నరసింహన్

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 7: పోచంపల్లి ఇక్కత్ చేనేత కళ ఎంతో అద్భుతంగా ఉందని రాష్ట్ర గవర్నర్ నరసింహన్ కొనియాడారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలాన్ని ఆయన సతీమణి నిర్మలా నరసింహన్‌తో కలిసి సందర్శించారు. రాష్ట్ర మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్, హ్యాండ్లూమ్ పార్క్ చైర్మన్ కడవేరు దేవేందర్, సీత దామోదర్ గవర్నర్‌కు ఘనస్వాగతం పలికారు. గవర్నర్ నరసింహన్ మగ్గాలపై తయారుచేస్తున్న చేనేత వస్త్రాలు, కార్మికుల జీవన స్థితిగతులు, గిట్టుబాటు ధరలను అడిగి తెలుసుకున్నారు. హ్యాండ్లూమ్ పార్కులో వార్పు, రంగులద్దడం, చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను ఆయన పరిశీలించారు. మగ్గాలపై తయారుచేస్తున్న వస్త్రాలను చూసి అబ్బురపడ్డారు. పార్కులో ఎంత మంది పని చేస్తున్నారు.. ఎంత కూలీ వస్తుంది.. వస్త్రాల మార్కెటింగ్ ఏ విధంగా ఉంది అనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం టూరిజం పార్కులో కార్మికులు, మాస్టర్ వీవర్ బ్యాంకర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. చేనేత రంగం అభివృద్ధికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా ఏం చేయాలని అడిగారు. గవర్నర్ మాట్లాడుతూ పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. చేనేత కళ కష్టమైన పని అని, నిజంగా స్కిల్ వర్క్ అంటే చేనేతే అని కొనియాడారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కావాల్సిన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్‌కు అనుగుణంగా నూతన డిజైన్లు రూపొందిస్తే అమ్మకాలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పట్టణాలకు విస్తరిస్తే అందరూ చేనేత వస్త్రాలు ధరించే వీలుంటుందన్నారు. అనంతరం జలాల్‌పురంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థను సందర్శించారు. స్వయం ఉపాధి శిక్షణా కోర్సులను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో నరసింహన్ మాట్లాడుతూ చదువుతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు రాణించాలంటే నైపుణ్యంతోపాటు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలన్నారు. మార్కెట్‌లో ఉపాధి అవకాశాలకు కొదవ లేదని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రామానంద సంస్థ నిర్వహిస్తున్న ఉపాధి శిక్షణా కోర్సులు చాలా బాగున్నాయని ప్రశంసించారు. కంప్యూటర్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, నిరుద్యోగ యువత వీటిపై దృష్టి సారించాలని, పూర్తి స్థాయిలో ప్రోగ్రామ్‌లు నేర్చుకోవాలన్నారు. రాష్ట్ర చేనేత, జౌళీ శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, కలెక్టర్ అనితా రామచంద్రన్, జాయింట్ కలెక్టర్ రవినాయక్, రామానంద తీర్థ సంస్థ డైరెక్టర్ కిశోర్ రెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి హన్మంత రావు, డీఆర్‌డీవో వెంకట్రావ్, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లిలో చేనేత కళాకారులను పరామర్శిస్తున్న రాష్ట్ర గవర్నర్ నరసింహన్

Printed and Published from Vijayawada by K.Sudhakar on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor T.V.Ravi Reddy, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

C M Y K



హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో జి. శోభకు ప్రత్యేక స్థానం ఉంది. భారతీయ సంగీత ప్రపంచంలో ఆమెకు ఉన్నతమైన గుర్తింపు ఉన్నది. తుమ్రీ క్వీన్‌గా ప్రసిద్ధి. ప్రఖ్యాత గాయకుడు త్రిలక్ తల్లి. ఈమె సంగీత సేవకు ఎన్నో పురస్కారాలు దక్కాయి. 1987లో సంగీత నాటక అకాడమీ అవార్డు వచ్చింది. 2002లో పద్మవిభూషణ్ దక్కింది. ఫిబ్రవరి 8, 1925లో జన్మించిన శోభ 2004లో కన్నుమూశారు.

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

గురువారం 8, ఫిబ్రవరి 2018



నమస్కారం! బావున్నావా? రోజూ ఇలా పలకరిస్తూనే వుంటా నా మటుకు నేను, నీలో మాత్రం ఇసుమంతయినా స్పందన ఉండదేం. నా నోరు నొప్పి పుట్టాలే తప్ప నీ దృష్టి మాత్రం ఇటు మరలదు. ఏనాడు తీసుకొచ్చేవ్ నన్ను నీతో, నేను అడిగేనా? బ్రతిమాలేనా? నా స్నేహితులతో, సహచరులతో నా మీద గౌరవం ఉన్నవారితో కాలం గడుపుతుంటే తగుదునమ్మా అని తెచ్చిపెట్టుకున్నావ్. నా ఆశ అడియాశ అవుతూనే వుంది. అయినా నా పిచ్చి కాని నువ్వు నాతో ఎందుకు మాట్లాడుతావ్, మొబైల్ ఫోన్ పుణ్యమా అని కంచంలో ఏముందో, నోట్లోకి ఎమెళ్తుందో కూడా తెలియకుండా, ఒంటిమీద తెలివి లేకుండా భోజనం పది నిమిషాల్లో కానిచ్చే రోజులివి. నిన్ను ఆడిపోసుకుంటే పాపం నువ్వు మాత్రం ఏం చేస్తావులే. నా విలువ తగ్గిపోయింది. నే పక్కనే ఉన్నా విస్మరించి నా గురించి మొబైల్ ఫోన్‌లో చూసి తెలుసుకొనే పరిస్థితి నెలకొంది. సాంకేతికత పెరగడంవలన నీ జీవితాన్ని సులభతరం చేసే కొత్త కొత్త యంత్రాలు పుట్టుకొస్తున్నాయని సంతోషించాలో లేక నీ నియంత్రణ అంతా వాటి చేతిలో పెట్టి నువ్వు సోమరిపోతువవుతున్నావని బాధపడాలో అర్థమవటంలేదు.

మనవి ఆలకించు..

ఇలా అంటున్నానని మరోలా అనుకోకు. ప్రతిరోజూ నిన్ను దగ్గరుండి చూస్తున్నాను కనుక నా బాధ ఇలా వ్యక్తపరుస్తున్నా. పొద్దున్నే లేచి స్నానాదులు కానిచ్చేక దేవుడి దగ్గరైనా నీ ధ్యానం నిలకడగా ఉంటుందేమోనని చూస్తా, ఇపుడు నేను ఖచ్చితంగా గుర్తొస్తానని అనుకుంటా.. అహా! లేదే, ఇదిగో భగవంతుడా! నీ సహస్రం నువ్వు వినుకో అన్నట్టు ఆ ఫోన్లో ఎం.ఎస్.సుబ్బులక్ష్మికి చదివే పని అప్పజెప్పి నువ్వు నీ పన్లలో మునిగిపోతున్నావ్. ఇదెక్కడి న్యాయం. జన్మనిచ్చిన తల్లిదండ్రులతో తీరికగా కూర్చుని మాట్లాడే టైం నీకెలాగా లేదు (నీ ప్రాణమిత్రుడెప్పుడూ నీ చేతిలోనే కదా, ఆ అవకాశమివ్వకుండా), కనీసం దేవుడిపట్ల భయమో భక్తో ఉందనుకున్నా. ఏ మాటకామాట చెప్పుకోవాలి. పాత రోజులే నయం, పూజ గదిలో కొన్ని గంటలు పనుండేది నాకు, ఎంతో పవిత్రంగా అనిపించేది. నన్ను ఇష్టపడేవారు, నేనెప్పుడొస్తానా అని పడిగాపులు కాసేవారు ఎంతోమంది ఉండేవారు, చిన్న నుంచి ముసలి వరకు. నేను దొరకకపోతే కష్టపడి వాకబు చేసి మరీ వెతికి పట్టుకెళ్ళేవారు.

మొన్నీమధ్య రిటైరు అయిన స్కూలు మాస్టారు వచ్చి నన్ను తీసుకెళితే నా ఆనందానికి అవధుల్లేవ్ తెలుసా. రిటైరయ్యాక కూడా నేను వారికి ఉపయోగపడుతున్నానని సంబరపడ్డాను. నా జన్మ సార్థకమైందనిపించింది. ఇలా చెప్తే నువ్వేమనుకుంటావో నాకు తెలుసులే. అలాంటి పెద్దవాళ్ళకే ఇంక నువ్వు పనికొచ్చేది అని. ఒకప్పుడు సినిమా పాటలు కూడా నా సహాయంతోనే పాడేవారు. ఇపుడు వాళ్ళకి కూడా పాపం సాంకేతికత అంటుకుంది. అయినా నాకు తెలియక అడుగుతున్నా, నన్ను చూస్తూంటే కలిగే పరిపూర్ణత, తృప్తి ఆ ఫోన్లో నుంచి వచ్చే వికిరణాలు నీ మెదడు మీద ప్రభావం చూపుతూ, ఆ కాంతికి నీ కళ్ళు నొప్పెడుతుంటే ఎలా కలుగుతుంది. అప్పుడైనా నేను గుర్తురాలేదా నీకు. చిన్నప్పటి నుంచి విద్యాలయంలో ఉపాధ్యాయులు చెప్పి ఉండుంటారే ప్రతీ తరగతిలోనూ నేనొక మంచి మిత్రుడినని. ఈ స్నే'హితుడు' నీకక్కర్లేదా మిత్రమా.

నాకొక విషయం నవ్వు తెప్పిస్తుంటుంది. నువ్వోపక్క మొబైల్‌లో మునిగిపోయి నీ పిల్లల్ని మాత్రం నా ముందు కూర్చోపెడితే వారికి ఏం తెలుస్తుంది పాపం. నీ దగ్గర నన్ను చూస్తేనే కదా వాళ్ళకి కూడా నాపట్ల శ్రద్ధ కలిగేది, నా ప్రాముఖ్యత తెలిసేది. నావలన వారికొచ్చే సందేహాలను తీర్చడానికి నువ్వు మళ్లీ కంప్యూటర్ సహాయమే తీసుకోవాల్సి వస్తోంది, నీ చేతిలో ఏముందిలే. పక్కవారిని అడిగో, లేక పెద్దలని అడిగి తెలుసుకోవడమో లాంటి అలవాట్లు తప్పిపోయాయి. నేను కూడా నీ చేతిలో ఇమిడిపోతాను కదా నీ ఎలక్ట్రానిక్ వస్తువుల్లా, మరెందుకు నీకంత విసుగు నన్ను పట్టుకోవాలంటే. ఆకర్షణీయంగా కావాల్సినన్ని రంగుల్లో వస్తున్నాను, వీలైనంత కోంపాక్ట్‌గా వుంటున్నాను అయినా కూడా బద్ధకమే నీకు నా విషయంలో.

ఉత్తరమంటే ఎంతమంది చిన్నారులకి తెలుసు, నా మిత్రుడు టెలిగ్రాం లేనే లేడు ఈ ప్రపంచంలో. అంతరించిపోయిన పక్షినో, జంతువునో చూపిస్తున్నట్లు మ్యూజియంలో చూపించాలి. ఇదిగో దీన్నే ఉత్తరమనేవారు, ఇదే టెలిగ్రాం అని. ఇది చాలదన్నట్లు పాఠ్యపుస్తకాలకు స్వస్తిచెప్పి, టాబెట్లు ఇస్తారట స్కూళ్ళలో ప్లిలకు. నన్ను చేతిలో పెట్టి ఇదిగో మీ మంచి నేస్తమని చెప్తే

అర్థం, పరమార్థం. అలా కాకుండా 'ఇదిగో కంప్యూటర్‌లో చూస్తున్నారు కదా పిల్లలూ, దీన్నే పుస్తకమంటారు. మీకు మంచి మిత్రుడు" అంటే హాస్యాస్పదంగా లేదా, నాకెంత అవమానమది. సరస్వతీ స్వరూపంగా మహామహుల చేతుల్లో స్వర్ణయుగాన్ని చూసిన నేను ఇంత చులకనయ్యానా అని నా కళ్ళు చెమర్చుతున్నాయి.

సాంకేతికతను ఉపయోగించుకోవడాన్ని తప్పుపట్టట్లేదు నేను, కాని మన పూర్వాపరాలను మరచిపోకూడదు. నన్ను పఠించడం మెదడుకు చురుకుతనాన్నిస్తుంది. ఒక చోట కూర్చుని నన్ను రెండు చేతులతో పట్టుకు చదవడం కుదురునిస్తుంది, పట్టుకునే తీరు మీ సంస్కారాన్ని తెలియజేస్తుంది. ఒకప్పుడు పండితుల ఇళ్ళల్లో గ్రంథాలయాలే ఉండేవి. ఫలానా సందేహం వస్తే ఠక్కున పుస్తకం తీసి చెప్పేలా. వారికున్న పాండిత్యం, జ్ఞానం, మానవత్వం, నైతిక విలువలు నిస్సందేహంగా ఈ సాంకేతిక తరానికి ఆదర్శమే ఇప్పటికీ ఎప్పటికీ. నాపట్ల మక్కువ ఉన్నవారు లేకపోలేదు, కశ్మీరులో 80,000 పుస్తకాలని భద్రపరచినందుకు రికార్డుకెక్కేరట ఓ పెద్దమనిషి. ఇలాంటి వార్తలు నాకు కాస్త సాంత్వననిస్తాయి. ఇలా వార్తల్లో మాత్రమే నేను కనిపించే రోజు రాకూడదు. ప్రతీ తరానికి నేను సుపరిచితమవ్వాలి. నన్ను అరుదుగా దొరికే వస్తువుగా కాకుండా, అలవాటయిన ప్రియనేస్తంగా మీ పిల్లలకు పరిచయం చేయండి. వారికి కూడా నన్ను దగ్గర చేయండి. ఇదే నా ఆకాంక్ష.

ఇదంతా కూడా మీరు మీ ఫోన్లలో చదువుతున్నారు కదూ. మరి ఈ సాంకేతికతకు ధన్యవాదాలు చెప్పుకోవాలా లేక నా స్థానాన్ని ఆక్రమించుకుంటున్నందుకు పోట్లాడాలా. సమతౌల్యం ఉండాలని నా ఉద్దేశ్యం. నా ఉనికిని మటుకు మరవద్దని నా మనవి.

-కౌముది ఎం.ఎన్.కె





నేనిచ్చిన ఉపోద్ఘాతానికి ఈపాటికి అర్థమయ్యే ఉంటుంది నేనెవర్నని. నిజమే కదా నే అంటున్న ప్రతిమాట. నీ పిల్లలకి సుమతీ శతకం చెప్తాను, ఏది పుస్తకం ఇలా తీసుకురా అని ఇంట్లో పెద్దలడిగితే (తాతయ్యో లేక బామ్మో) ఇదిగో'సుమతి శతకం యాప్' అని ఫోన్లు అందిస్తున్నారు. ఎంత మంది ఇళ్ళలో ఉంది పెద్ద బాలశిక్ష. చంటిపిల్లకి అన్నం పెడుతూ ఆకాశంలో ఎదురుగా కనపడుతున్న చందమామని చూపించడం మానేసి, యు ట్యూబ్‌లో చందమామ రావే పాట చూపిస్తూ బువ్వ పెడుతున్న రోజులొచ్చాయి. చందమామని చేతికందుతుందేమో అనేలా దగ్గరగా చూపిస్తున్నందుకు మెచ్చుకోవాలా లేక ఇదేం దౌర్భాగ్యమని తిట్టుకోవావాలా. లోకానికే ఆహ్లాదాన్ని పంచే ఆ చల్లని రేడుకే దిక్కులేదు. ఇక నా బాధ ఎంత ఆ చందమామ వ్యధ ముందు.

వేదం ఆమె నాదం



మన ఋషులు మనకు అందించిన సంపద వేదాలు. మనిషి ఎలా నడచుకోవాలో వివరించిన ఆ వైదిక ధర్మాన్ని నేడు మనం పాటించక పోగా అపహాస్యం చేసే పెడధోరణిలో వెళుతున్నాం. సనాతన ధర్మాన్ని నలుదిశలా వ్యాపింపజేసేందుకు ఎంతోమంది తమ జీవితాశయంగా బతికేవారు ఉన్నారు. అలాంటి కోవకు చెందుతారు శ్రీమతి పద్మావతి. పెద్దగా చదువుకోకపోయినా తండ్రి బాటలో నడుస్తూ వేద ప్రచారం చేస్తూ యజ్ఞ యాగాదులు నిర్వహిస్తున్నారు. ఆర్య సమాజ బాధ్యతను తన భుజ స్కంధాలపై వేసుకుని ముందుకు సాగుతున్నారు.

మహర్షి దయానంద సరస్వతి పునరుద్ధరించిన వైదిక ధర్మం ఈ నాటికి ఆర్య సమాజం పేర ముందుకు సాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాదు, తెలంగాణ పట్టణాలో, కోస్తా ప్రాంతంలో, తెనాలి, గుంటూరు తదితర చోట్ల ఆర్య సమాజం ప్రచారంలో వుంది. సీమ జిల్లాల్లో ప్రచారంలో లేదు. అలాంటి ఈ ప్రాంతంలో 40 సంవత్సరాల క్రింద ఘంటా చెంచయ్య ఆయన భార్య కర్నూలు పట్టణంలో వేసిన ఆర్య సమాజం బీజానికి కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన పండిత వంకం సుబ్బన్న నీరు పోసి జమ్మలమడుగు ప్రాంతంలో మొక్కగా మొలకెత్తించారు.

కాల గమనంలో పండిత వంకం సుబ్బన్న గతించిపోగా ఆయన కూతురు శ్రీమతి పద్మావతమ్మ ఆర్య సమాజ బాధ్యత, వేద ప్రచారం ప్రతి పౌర్ణమికి రుద్రయాగం ఆర్య సమాజ పద్ధతిన శోడశ సంస్కారాలు చేయడం ప్రారంభించారు. పెద్దగా చదువుకోని ఆమె తండ్రి వద్ద నిత్యం వేద ధర్మ విషయాలు తెలుసుకొని ప్రేరణ పొంది తన జీవితాన్ని తండ్రి ఆశయ సాధనలో నిమగ్నమైంది. నిత్యం ఆర్య సమాజ ప్రచారం గావిస్తున్నారు. మహిళ, అందునా భర్త ఇటీవలే చనిపోయినా.. కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోయినా తోటి ఆర్య సమాజీకుల సహకారంతో ఎంతో క్లిష్టమైన ఆర్య సమాజ భారం వహించింది.

నేటి హిందూ సమాజంలో వున్న మూఢాచారాలు ఆర్య సమాజంలో లేవు. కుల మత భేదాలు లేవు. బ్రాహ్మణేతరులే ఎక్కువగా పౌరోహిత్యం వహిస్తున్నారు. వారు శోషశ కర్మలు, సీమంతం, నామకరణం, వివాహం మొదలగు అంత్యేష్టి వరకు గల 16 సంస్కారాలు చేయగలరు. ఆర్యసమాజంలో మంచి దినాలు, చెడ్డ దినాలు లేవు. విగ్రహారాధన లేదు. ఇతర మతస్తులు చేరే అవకాశం వుంది. వేదములే దైవగ్రంథముగా భావిస్తారు. అత్యంత పురాతనం, అత్యంత ఆధునికమైన ఆర్య సమాజము (వేదిక) ధర్మం) ప్రచారం నేడు ఎంతో అవసరం. ప్రపంచ శాంతి లభించాలంటే వేద ప్రచారం జరగాలి. వేదములలో మానవునికి కావలసిన సమస్త విజ్ఞానం వుంది. ఇంతటి గొప్ప వేద ఆచారాలు నిర్వహిస్తున్న శ్రీమతి పద్మావతమ్మ మరింత ముందుకు సాగాలని కోరు కుందాం.

-నుగ్గు జనార్దన



వార్త-వ్యాఖ్య

-వీరాజీ

మరో వివాదగ్రస్త 'రాణీ'



వివాదగ్రస్త అంశాలతో జనప్రియ నాయకులను నాయికల కీర్తిప్రతిష్ఠలను డబ్బులు చేసుకోవాలని కక్కుర్తితో వెండితెరకి యాంటీసెంటిమెంటు అని తెలిసీ ఎక్కిస్తున్న రాణీ హిందీ చిత్ర నిర్మాత కమల్ జైన్‌కి సర్వబ్రాహ్మణ సంఘం జనవరిలోనే అభ్యంతరం చెబుతూ లేఖాస్త్రం సంధించింది. ఈ సినిమా ఝాన్సీ రాణి లక్ష్మీబాయి కథగా చెప్పబడే ఒక నిషేధ గ్రంథంమీద ఆధారబడ్డ స్క్రిప్ట్. ఈ పుస్తకం రాసిన జయశ్రీ జైన్ లండన్‌లో ఉండటంతో ఆందోళనకారులకు అందుబాటులో లేడు కానీ ఈ చిత్రం ఒక బ్రాహ్మణ రాణీ కథగానే నిర్మాతలు మణికర్ణికా అనే పేరుతో షూటింగ్ కూడా మొదలుపెట్టారు. రాజస్థాన్‌లో సెట్టింగులు వేశారు. 2008లోనే ఈ గ్రంథం లక్ష్మీబాయ్ చరిత్రను కించపరిచేదిగా వున్నదని అంగీకరించి మాయావతి ప్రభుత్వం యుపిలో నిషేధించింది. తొలి స్వతంత్ర సమరయోధురాలిగా దేశం కీర్తిస్తున్న ఈ కథలో కూడా రాణీ పద్మావతిలోలాగే ఒక ప్రక్షిప్తము అసత్యము అయిన అంశం వుంది. రాణి ఝాన్సీకి ఒక ఇంగిలీషు అధికారికి ప్రణయ స్నేహం వున్నదని స్క్రిప్ట్ రాసుకున్నారుట. అంతే కాదు, రాణి లక్ష్మీబాయికి ఆ అంగ్రేజివానికి మధ్య డ్యూయెట్ పాట కూడా (అదేమి రోగమో ఈ నిర్మాతలకి) చిత్రీకరిస్తున్నారని ఆందోళనకారులు చెబుతున్నారు. రాణిగా ప్రముఖ అందాల నటి కంగనా రనౌత్ నటిస్తున్నది. బ్యాన్ చేయబడ్డ నవలలోని కథ చిత్రీకరణ గనుక ఇటువంటి సినిమా విషయం గవర్నమెంట్లు ముందే పరిశీలనకి పిలువవచ్చును. కోర్టులు సుమోటాగా పరిశీలనలకు తీసుకోవచ్చును. ఝాన్సీ రాణి కథని లోగడ హిందీలో మొట్టమొదటి టెక్నికలర్ చిత్రంగా గొప్పగా షోరబ్ మోడీగారు తీశాడు, హారతులందుకున్నది. అసలు రాణీ లక్ష్మీబాయమ్మ బ్రాహ్మణ మహిళ కాకపోయినా ఇటువంటి దౌర్భాగ్య సన్నివేశం తెరకి ఎక్కరాదు. విషవృక్షాన్ని విత్తులోనే పెకలించాలని ఎందరో కోరుతున్నారు. సినిమా అయ్యేకా హింస చెలరేగాక కాక ముందే కళ్ళు తెరవాలి అని అందరూ కోరుతున్నారు.

రోడ్డు చావులు ఎవ్వరికీ వద్దు!

మనదేశంలో రోడ్డు ప్రమాదాల్లో నిత్యం చనిపోయేవారి సంఖ్య-యుద్ధంలో చనిపోయేవారి సంఖ్యకన్నా ఎక్కువే. రోజుకి 16 మంది చిన్నారులు శకటాసురులకు బలైపోతున్నారు. ముంబయికి చెందిన రాందయాళ్ ఒక మాజీ సైనికుడు. 1962-82మధ్య సైన్యంలో పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడు. అతనికిగల ఒకే ఒక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. మిగతా సంతానం ముగ్గురు ఆడపిల్లలే. నా కొడుకులాగా మరెవ్వరూ రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు పోగొట్టుకోకూడదు అనుకున్న రాందయాళ్- ముంబయి 'కందవిలి'లో వితంతువై నివశిస్తున్న కుమార్తెకు అండగా చేరుకొని అక్కడ నిత్యం రద్దీగా వుండే నల్లసోపూర్ జంక్షన్‌కి పోయి తనంతట తానె ట్రాఫిక్‌ని కంట్రోల్ చేస్తూ శ్రమదానం చేస్తున్నాడు. రాందయాళ్ వితరణకి పోలీసులు కూడా తల ఊపారు. ఈ మృత్యుగహ్వారం లాంటి చోట ప్రమాదాలు తగ్గాయి.

veeraji.pkm@gmail.com

మొండి మరకలు వదిలిద్దాం..



ఇంట్లో ఫ్లోరింగ్‌పై పడ్డ మరకలు ఓ పట్టాన వదలవు. ముఖ్యంగా వంటిట్లో జిడ్డు మరకలు మనల్ని వెక్కిరిస్తుంటాయి. వీటిని వదిలించాలంటే గృహిణులకు తలకుమించిన భారం అవుతుంది. అలాగే ఎన్నిసార్లు ఉతికినా దుస్తులపై పడ్డ మరకలు కనిపిస్తూనే ఉంటాయి. ఇలాంటి మొండి మరకలు పోవాలంటే కొన్ని చిట్కాలు పాటిస్తే మాయం అవుతాయి.

- జిడ్డు మరకలు పడిన వెంటనే దుస్తులపై మొక్కజొన్న పిండి చల్లితే.. ఆ పిండి మరకల జిడ్డును పీల్చేసుకుంటుంది.
- నిమ్మరసం, వెనిగర్ సమపాళ్లలో కలిపి.. ఓ గిన్నెలోకి తీసుకోవాలి. మరక ఉన్న ప్రాంతాన్ని ఈ మిశ్రమంలో నానాబెట్టి ఉతకాలి. ఇలా చేయడం వల్ల మరకలే కాదు దుస్తుల నుంచి వచ్చే దుర్వాసనలూ దూరమవుతాయి.
- జిడ్డు పడ్డ చోట దుస్తులను అదేపనిగా ఉతకటం వల్ల అక్కడ తెల్లగా పాలిపోయి పోగులు విడివడినట్లుగా తయారవుతాయి. అందుకే నీళ్లకు బదులు టాల్కం పౌడర్ లేదా బేబీ పౌడర్ మరక మీద చల్లి కాసేపు ఉంచితే, పౌడర్‌లోని తేమ మరక మీద జిడ్డును పీల్చేసుకుంటుంది. ఆ తరువాత ఉతికితే మరక మటుమాయం అవుతుంది.
- వంటసోడాలో నీళ్లు కలిపి మిశ్రమంలా చేయాలి. దాన్ని మరక ఉన్నచోట రాసి పక్కనుంచాలి. అరగంటయ్యాక డిటర్జెంట్ పొడి కలిపిన నీళ్లలో ఆ దుస్తుల్ని నానబెట్టి ఉతికితే సరిపోతుంది. ఒకేసారి మరక పోనట్లయితే రెండు మూడుసార్లు ఈ విధంగా చేస్తే సరిపోతుంది.

మాతృభూమికి రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

C M Y K

కర్మభూమి

రచనో, చిత్రమొ నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచు బ్రోచుచు మనుజుల కాంక్షలు తీర్చున్

పనికి తగ్గ పాట

ఈ కాలంలో అన్నీ మిక్సీలు వచ్చేసాయి. బర్ర్ మనే శబ్దం తప్ప మరేమీ ఉండదు. కాని పూర్వకాలంలో దంచినా, నూరినా, రుబ్బినా, ఆఖరికి చెరిగినా వంటింటిల్లో చేసే పనుల్లో ప్రతిదానికి ఒక పాటను పాడుకొనేవారు. నలుగురు స్ర్తీలు కూర్చుని పనులు చేసుకొంటూ పురాణ సంబంధమైనవోలేక చారిత్రక వీరుల గురించో ఏదో ఒక విషయానికి సంబంధించి పాటరూపంలో ఆ విషయాలన్నీ చెప్పుకునేవారు. వారు చేసేపనికి ఊతంగా ఈ పాట సాగేది. పాటల్లో కూడా దంపుడు పాటలు, విసురురాతి పాటలు ఇలా వేర్వేరు గమకాలతో - వారు చేసే పనికి తగ్గట్టుగా బాణీలు కట్టి మరీ పాడుకొనేవారు. వాటిల్లో ఎంతో విజ్ఞానం ఉండేది. ఎన్నో సామాజిక సమస్యలకు పరిష్కారాలుండేవి. ఇలాంటి పాటలెన్నో మౌఖికరూపంలోనే ఉంటున్నాయి. వీటిని నేడు సిడీల రూపంలో భద్రపరుస్తున్నారు. కాని ఇంకా భద్రపర్చాల్సిన అవసరం ఉంది. ఎన్నో ఆచార సంప్రదాయాలు, సంస్కృతీ వైభవాలు ఈ పాటలరూపంలో దాగున్నాయి. వాటిని తర్వాతి తరాలకు అందివ్వాల్సిన బాధ్యత నేటి తరానికి ఉంది.


విసురు రాతి పాట

ఆదివారము అమావాస్యనాడు
అన్న ఇంటికి నేను గిన్నె నడుగ బోతె
మా వదినె శాంభవి లేదు పొమ్మనెను
మా యన్న మంచివాడు మళ్లి రమ్మనెను
చిన్నోనికి చీటంగి సిలుకు కుళ్ళాయి
బాలునికి పొట్లంగి పాలు పొసె గిన్నె
నాకు నల్లచీర నెమలి వన్నె రవికె
వడినిండ బియ్యము వళ్లొ కొబ్బరిగిన్నె
పసుపు కుంకుమ ఇచ్చి పంపె మాయన్న॥



వ్యూహం

38 అలపర్తి రామకృష్ణ



''చిన్న వైరు ముక్క దొరుకుతుందేమోనని చూస్తున్నాను'' తడుముకోకుండా సమాధానమిచ్చాడు.

''వైరు ముక్క చాలు.. ఎలక్ట్రీషియన్‌కు కావాలట..''

''ఏసి రిపేర్ పూర్తి అయిందా?''' అడిగాడు అరవింద్.

''ఇతను సరిగ్గా చేయలేకపోతున్నాడు.. మరో వర్కర్‌ని పిలుచుకొని వచ్చి బాగు చేయిస్తాను''.

''నీకు ఏ పని చెప్పినా సరిగ్గా చెయ్యవ్.. ఉత్త వేస్ట్‌ఫెలోవి అన్నాడు అరవింద్.

'వేస్ట్‌ఫెలో' అని రొటీన్‌గా అరవింద్ అంటూనే వుంటాడు.

కాశికి ఆ మాటలు గుండెల్లో ముళ్ళులా గుచ్చుకున్నాయి.

లెనిన్‌ను తీసుకుని రూములో నుంచి బయటకు వచ్చాడు కాశి.

'ఎవడు వేస్ట్‌ఫెలోనో తొందరలోనే తెలుస్తుంది' గొణుక్కున్నాడు కాశి.

ఆ మాటలు లెనిన్‌కు విన్పించాయి.

⁂

నిశాంత్‌తోపాటు హైదరాబాద్‌లో వున్న హాస్పిటల్‌కు వెళ్ళాడు స్కంద.

లోహిత తండ్రి కోలుకుంటూ వున్నాడు.

డాక్టర్లు విరిగిపోయిన చేతిని అతికించే ప్రయత్నం చేశారుగాని సక్సెస్ కాలేదు.

''ఎలా వున్నారు?'' అడిగాడు స్కంద.

''నాకేం ఫర్వాలేదు బాబూ! రెండు చేతులూ పోయినా బ్రతికేస్తాను.. ఆ రౌడీలు మళ్లీ సావేరిని అల్లరి పెడతారేమోనని భయంగా వుంది'' అన్నాడు శేషగిరి.

రెండు నిముషాలు ఆలోచించాడు స్కంద.

''మీరు చెప్పింది నిజమే! సావేరి ఇక్కడ ఉండటం క్షేమం కాదు. డాక్టర్ లోహిత వాళ్ళు చెప్పినట్లు నడుచుకోవడం లేదని తెలిసేక సావేరి మీద మరోసారి ఎటాక్ చేసే ప్రమాదం పొంచి వుంది.. రెండు నెలలపాటు సావేరిని నిశాంత్ వాళ్ళ ఊరు పంపించేద్దాం! సావేరి ఎక్కడుందో వాళ్ళు పసిగట్టలేరు. మీకేం అభ్యంతరం లేకపోతే మీరు, అన్నపూర్ణమ్మగారు కూడా సావేరితో పాటు వెళ్ళొచ్చు'' అన్నాడు స్కంద.

''సావేరితోపాటు మేము కూడా వెళ్లితే నిశాంత్ తల్లిదండ్రులు మమ్మల్ని గౌరవంగానే చూస్తారు.. ఆ విషయంలో ఎటువంటి అనుమానం లేదు.. కానీ అందరం కట్టగట్టుకుని వాళ్ళింటికి వెళ్ళడం బాగుండదు.. ఇక్కడ వుండటానికి మాకేం భయం లేదు.. వాళ్ళు మరో చెయ్యి నరికేసినా నేను భయపడను...'' అన్నాడు శేషగిరి.

నిశాంత్ వైపు తిరిగి ''నువ్వు వెంటనే సావేరిని మీ ఊరు తీసుకువెళ్ళు! మళ్లీ మేం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేక ఇక్కడ తీసుకొద్దువుగాని.. ఆ అమ్మాయికి ఏ ఇబ్బంది రాకుండా చూడాల్సిన బాధ్యత నీది!'' అన్నాడు స్కంద.

నిశాంత్ ఆనందంతో పొంగిపోయాడు.

తనతోపాటు సావేరిని తీసుకువెళ్ళడానికి ఆమె తల్లిదండ్రులు అభ్యంతరం చెప్పకపోవడంతో ఆ ఆనందం రెట్టింపు అయ్యింది.

సావేరి వైపు చూశాడు.

ఆమె బుగ్గల్లో సిగ్గు కమ్మడం గమనించాడు.

''పువ్వుల్లో పెట్టి చూసుకోను'' అన్నాడు నిశాంత్.

''మీ ఇంటికి నాలుగువైపులా పూల తోటలే వున్నాయి.. పొదరిల్లులో వున్నట్లే వుంటుంది వాళ్ళింట్లో!''' అన్నాడు స్కంద నవ్వుతూ.

తల్లిదండ్రులకు చెప్పి నిశాంత్ వెనుకే హాస్పిటల్ నుంచి బయటకు వచ్చింది సావేరి.

⁂

అరిఫ్‌కు పెద్ద నెట్‌వర్క్ ఉంది. పెద్ద సెర్వైలెన్స్ వింగ్ వుంది. ఆ విభాగం వాళ్ళు అనుమానిత వ్యక్తులను వెంబడించి వాళ్ళేం చేస్తున్నారో గమనించి అరిఫ్‌కు, అరవింద్‌కు రిపోర్టు చేస్తు వుంటారు.

ఆ విభాగానికి చెందిన వాళ్ళు ఇద్దరు వచ్చి డాక్టర్ అరవింద్‌కు మంత్లీ రిపోర్టు ఇస్తున్నారు. ఆ సమయంలో కాశి డాక్టర్ అరవింద్ ఛాంబర్‌లోనే వున్నాడు.

''డాక్టర్ లోహిత అప్పుడప్పుడు బురఖా వేసుకుని హాస్పిటల్ క్యాంపస్ నుంచి బయటకు వెళ్తూ వుంది.. రెండుమూడుసార్లు స్కంద ఆఫీసుకు కూడా వెళ్లింది.

''వెరీ సీరియస్ మాటర్.. ఆమె మూవ్‌మెంట్స్‌ను మనం రిస్ట్రిక్ట్ చెయ్యాలి. హాస్పిటల్ క్యాంపస్ నుంచి బయటకు వెళ్ళనివ్వద్దు..'' అన్నాడు డాక్టర్ అరవింద్.

ఇంకాఉంది

ఒక సిరా చుక్క.. లక్ష మెదళ్లకు కదలిక!

మనిషి తన ఆనందాన్ని, దుఃఖాన్ని వెళ్లగక్కడానికి రూపం ఏర్పరుచుకుంటే అదే కళగా భాసించింది. ఆ కళల్లో పాట, ఆట, మాట కలిసి ఉన్నదాన్ని నాటకం అన్నాం. దాన్నే శాస్త్రం చదువుకున్నవారు సర్వకళల సమాహారం అన్నారు. నాటకం అత్యున్నతమైన కళారూపమే. కళారూప పరంపరలో నాటకం పదునైనది. పరమోత్కృష్టమైనది. విభిన్న రుచులుగల జనావళికి ఏక పత్ర సమారాధన చేసేది నాటకం అన్నారు కాళిదాసు.



జాతిని జాగృతం చేసేదీ జాతి జీవనాన్ని ప్రతిబింబించేదీ నాటకం అన్నారు.

విజ్ఞానం ప్లస్ వినోదం ఇంటూ సామాజిక స్పృహ కలసిన రూపమే నాటకం అన్నారు కొత్తగా ఆలోచించేవారు ఆ నాటకం హృదయ తంత్రులను మీటడమే కాదు వారి ఆలోచనల్లో కొత్త దనాన్ని సంతరించేది. ఆలోచనల వేగం పెంచేది అంతే కాదు అసలు మనిషిని మనీషిగా తీర్చిదిద్దే ఒక శక్తిమంతమైన ఆయుధం నాటకమే. కదిలేదీ, కదిలించేదీ- నడిపించేదీ ముందుకు అడుగులు వేయించేది కొత్తదనానికి దారులు వేసేదీ నాటకం.

జాగృతి తేవడంలో మున్ముందుఉండేది. చీకటినుండి వెలుతురు వైపునకు నడిపించేది నాటకం. ప్రజలను చైతన్యవంతులను చేసేది నాటకం. చిటికెడు సంతోషాన్ని, పిడికెడు విజ్ఞానాన్ని దోసెడు వినోదాన్నీ, చారెడు జ్ఞానాన్నీ అర్థం చేసుకోవడానికి ఆ దేశపు కళలు ఎంతగానో ఉపకరిస్తాయి''అంటాడు యాగ్నెస్ డిమీల్లీ శాస్త్రకారుడు.

నాటకం సమకాలీనం, సార్వజనీనం, సార్వకాలికం. అయినా వేనవేల సంవత్సరాల వెనుకనున్న పుటలను కూడా మన కళ్లముందు పరిచేది నాటకం. గతంలోకి తొంగిచూసి అవరోధాలను, అసమానతలను, కలతలను, కన్నీళ్లను చూసి వాటికి పరిష్కారాలు చూపుతూ ఆ సమస్యలకు తిలోదకాలు ఇవ్వడానికి వేదిక నాటకం. మనిషితనాన్ని మనిషిలో తట్టిలేపడానికి విలువైన పదునైనఆయుధం నాటకం. చుట్టూ ఉన్న పరిస్థితులను నూతన దృష్టితో అవలోకింపజేయడానికి ప్రోత్సహిస్తాయి'' అని అంటాడు బెర్నార్డ్ షా.

భారతీయ నాటకానికి ఒక విశిష్టమైన స్థానం ప్రపంచ చరిత్రలిఖించింది. భరతుడి నాట్యశాస్త్రం నాటక లక్షణాలకు దర్పణం పట్టింది. కాళిదాసు, భాస మహాకవి నాటకాలు భారతీయ ప్రేక్షకుల మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయాయి.తొలి తెలుగు నాటక రచనకు నాందీ పూజ చేసిన మహనీయుడు కోరాడ రామచంద్రశాస్ర్తి. తొలి తెలుగు స్వతంత్ర రూపకమైన మంజరీ మధుకరీయాన్ని 1960లో ఆయన సృష్టించాడు. ఆంధ్రా జాన్సన్ పేరు పొందిన కొక్కొండ వెంకటరత్నం పంతులు, వారణాసి ధర్మసూరి సంస్కృతంలో రచించిన నరకాసుర విజయ వ్యాయోగాన్ని, తెలుగులోకి అనువదించారు. వావిలాల వాసుదేవశాస్ర్తి 1874లో సీజర్ చరిత్ర నాటకాన్ని, 1880లో 'నందక రాజ్యము' అనే స్వతంత్ర సాంఘిక నాటకాన్ని రచించారు. ఈ నాటకాలేవీ ప్రదర్శనకు నోచుకోలేదు. ఆధునిక యుగ వైతాళికుడైన కందుకూరి వీరేశలింగం తన హాస్య సంజీవనిలో 'వ్యవహార ధర్మబోధిని' రచించి ప్రచురించారు. ఈ నాటకాన్ని ఆయనే 1880లో రాజమహేంద్రవరం శ్రీ విజయనగరం మహారాజాగారి బాలికా పాఠశాలలో మొదటిసారిగా ప్రదర్శించారు. ధార్వాడ నాటక సమాజం రాజమహేంద్రవరంలో నాటకాలను ప్రదర్శించిన పాకలలో కందుకూరి తాను అనువదించిన 'రత్నావళి', 'చమత్కార రత్నావళి' నాటకాలను దిగ్విజయంగా ప్రదర్శించారు. నాటకం ప్రదర్శనకళ రచనా 1869లోనే పురుడు పోసుకున్నా ప్రదర్శనగా 1880లో రూపు దిద్దుకుంది. తెలుగు నాటకానికి ప్రదర్శన యోగ్యతని కలిగించిన కందుకూరి ఆద్యునిగా చరిత్ర పుటలలోనికి ఎక్కాడు. తొలి తెలుగు నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత కూడా వారిదే. అక్కడనుండి ప్రారంభమైన తెలుగు నాటక ప్రస్థానంలో ఎన్నో మలుపులు, మజిలీలున్నాయి. ఎన్నో సంస్కరణలకు బాటలు వేసింది. కొత్తఆలోచనల అంకురాలను మొలకెత్తించేదీ నాటకమే. కనుక నాటకాన్ని ప్రోత్సహిద్దాం. మన కళలను కాపాడుకుందాం.

- ఆర్. పురంధర్

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు. గౌరవ మర్యాదలు లభిస్తాయి. శుభవార్తలు వింటారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
స్థిరాస్తుల విషయంలో జాగ్రత్తగా నుండుట మంచిది. ఒక అద్భుత అవకాశాన్ని కోల్పోతారు. నూతన వ్యక్తుల పరిచయమేర్పడుతుంది. ప్రయాణాలవల్ల లాభాన్ని పొందుతారు. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
నూతన కార్యాలు ఆటంకాలు ఏర్పడినా వాటిని అధిగమించి మరీ ప్రారంభిస్తారు. అల్పభోజనంవల్ల అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మనస్తాపానికి గురిచేస్తుంది. వీలైనంతవరకు అసత్యానికి దూరంగా నుండుట మంచిది. మిత్రులతో వ్యవహారాలల్లో జాగ్రత్త ఉండాలి.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
విదేశయాన ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబంలో అనుకోకుండా లాభమేర్పడే అవకాశముంటుంది. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టాన్ని అధిగమిస్తారు. ఈ రోజు ముఖ్యమైన వ్యక్తిని కలుస్తారు. తద్వారాఅనుకొన్న పనులు పూర్తిచేస్తారు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
బంధు, మిత్రులతో మనస్పర్థలు రాకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనుకోకుండా డబ్బు చేజారే అవకాశాలున్నాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. శారీరక శ్రమతోపాటు మానసికాందోళన తప్పదు. అనుకొన్న ఏపనికైనా ఆటంకాలు ఏర్పడుతాయి. వాటిని అధిగమించడానికి భగవంతుని ప్రార్థన చేస్తారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
అనారోగ్య బాధలతో సతమతమవుతారు. స్థానచలన సూచనలుంటాయి. నూతన వ్యక్తులు కలుస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. గృహంలో మార్పులు కోరుకుంటారు. ఋణ ప్రయత్నాలు ప్రయత్నం మీద సఫలం అవుతాయి. దైవ ప్రార్థన పట్ల ఆసక్తి చూపుతారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
సంతోషంగా కాలం గడుపుతారు. శుభవార్త వింటారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. తోటివారి ప్రశంసలందుకుందురు. విందులు, వినోదాల్లో పాల్గొనే అవకాశం వుంది. ఆర్థికంగా బలపడతారు. స్ర్తీలు మనోల్లాసాన్ని పొందెదరు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
తోటివారితో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. వృధా ప్రయాణాలెక్కువచేస్తారు. కుటుంబ విషయాలందు అనాసక్తితో వుంటారు. స్ర్తీలు విశ్రాంతి తీసుకోవడం అవసరం.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంటుంది. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా నుండుట మంచిది. పెద్దల సలహాలు తీసుకొంటారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ఆకస్మిక ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనారోగ్య బాధలు తొలగుటకు డబ్బు ఎక్కువ ఖర్చు చేస్తారు. తీర్థయాత్రకు ప్రయత్నిస్తారు. దైవదర్శనం ఉంటుంది. స్ర్తీలు మనోల్లాసాన్ని పొందుతారు. స్ర్తీలు చేసే వ్యవహారాల్లో ఆటంకాలు ఏర్పడినా వాటిని అధిగమిస్తారు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
కుటుంబంలో సుఖ, సంతోషాలుంటాయి. ధనధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. స్ర్తీలు మనోల్లాసంతో ఉంటారు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ప్రతి విషయంలో అభివృద్ధి ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.

నేర్చుకుందాం — నరసింహ శతకం

సీ. కాయమెంత భయానఁ గాపాడినను గాని
ధాత్రి లోనది చూడఁ దకక్కఁబోదు
నీ వేళ నేరోగ మేమరించునొ సత్త్వ
మొందంగఁజేయ నే చందమునను
ఔషధంబులు మంచి ననుభవించినఁగాని
కర్మక్షీణంబైనఁ గాక విడదు
కోటి వైద్యులు గుంపు గూడి వచ్చినఁగాని
మరణమయ్యెడి వ్యాధి మాన్పలేరు
తే. జీవుని ప్రయాణ కాలంబు సిద్ధమైన
నిలుచునా దేహమిందొక్కనిముషమైన
భూషణవికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం:
ఓ ప్రభూ! ఈ శరీరాన్ని ఎంత జాగ్రత్తగా కాపాడినా ఇది స్థిరంగా నిలువదు. ఎప్పుడే రోగం వచ్చి మోసగిస్తుందో? ఎన్నెన్ని మందులు తిన్నా కర్మ తొలగకుండ రోగం నయం కాదు కోటి వైద్యులు కూడా మరణాంతకమైన వ్యాధిని మాన్పలేరు. ప్రాణం పోయే కాలంలో ఏమీ చేసినా బొందిలో అది నిలువదు. ఒక్క క్షణమైనా శరీరం ఆగదు.

ఆశ ఖరీదు అణా



గోరాశాస్త్రి గారి రేడియో నాటిక

వినమరుగైన..

యు:నిద్ర రావటంలేదు ఎంత ప్రయత్నించినా! ఎంచేతో తెలిదయు! నిజంగా తెలీదా? పొద్దున్నించీ కడుపుమాడిపోతుంటే నిద్ర ఎలా వస్తుంది? ఉంగరం అమ్మేస్తే వచ్చిన డబ్బు గది అద్దె అడ్వాన్సుకే చాలలేదు. మిగిలింది నేనూ నా బొమ్మలూ! ఎటొచ్చీ మేకులు కొడితే ఇందిర నిద్రపోయిది. బొమ్మలు చూస్తే కృష్ణవేణి హడలిపోతుందనుకుంటాను. వియోగం, దుఃఖం, గులాబీ తోటలో కాలసర్పం- ఇలాంటి బొమ్మలే ఎందుకు వేస్తాను చెప్మా? ఎలాగైనా కృష్ణవేణికి ఆ బొమ్మలు చూపించాలి.. మళ్లీ కృష్ణవేణి అంటున్నాను! ఆ అమ్మాయి పేరేమిటో?

⁂

కృష్ణవేణి: ఆ అబ్బాయి పేరేమిటో! ఏమిఁరా అన్నయ్య- ఆయన పేరేవిటి?

అన్నయ్య:ఎవరిపేరే?

కృష్ణ:అదేరా - పై మేడ చివరి గదిలో కొత్తగా దిగాడే...

అన్న:ఎవడో సుబ్బారాయుడు! మనకెందుకొచ్చిన గొడవ, పడుకుందూ- అర్థరాత్రి కావస్తోంది-

కృష్ణ:(నవ్వుతూ) భలేవాడివిరా, సాయంత్రం ఎనిమిదింటికే చీకటంటావేమిట్రా ఖర్మ! కాస్సేపు కూర్చుని ఏవేనా కబుర్లు చెప్పరాదూ! అమ్మ కప్పుడే మూడో ఝాము నిద్ర.

అ:చెప్పడానికి నాకేం కబుర్లుంటాయి.. బెంగెట్టుకు ఛస్తుంటేను! ఎందుకూ పనికిరాని చవట వాజెమ్మని.. కాణీ ఆర్జించలేనివాణ్ణి!

కృష్ణ:పోనీలేరా.. ఆ గొడవంతా దేనికిప్పుడూ.. ఎవరార్జిస్తేనేం? ఏదో యిలా బతుక్కొస్తున్నాం. సంతోషించకూడదూ?

అ:నీకేం చెపువు. నీ మట్టుకు నీకేదో గొప్పగా ఉన్నట్టుండి కాని.. నీ చేత ఉద్యోగం చేయించవలసిన ఖర్మ పట్టిందంటే - అమ్మకి ఎంత రంపపు కోత- నాకెంత అవమానం-

కృష్ణ:మొదలెట్టావా పురాణం! ఈ నాలుగు ఘడియలైనా నన్ను కాస్త తృప్తిగా ఊపిరి పీల్చుకోనియ్యవ్.. తెల్లారగట్ల లేచి వంటపని, పగలల్లా ఆఫీసులో బండ చాకిరీ-ఇంటి కొచ్చాక మళ్లీ వంట.

అ:ఆ తరవాత తీరిగ్గా కూర్చుని అల్లా అబ్బాయి పేరేమిటీ, ఇల్లీఅబ్బాయి పేరేమిటీ అని ఆలోచన్లు. దేవుడి ధర్మమా అని నాకు ఉద్యోగమే దొరికితే-

కృష్ణ:తక్షణం నన్ను ఉద్యగం మానిపించి ఇంట్లో కూచోబెడతావు, అంతేనా? అక్కడికి కాని నీకు మన శ్శాంతి ఉండదు. ఏం మనుషులంరా మనం? సగం చచ్చిన మనుషుల్ని గాని ప్రేమంచలేం; నా బ్రతుకులో ఏ మారుమూలైనా కాస్త సంతృప్తి మిగిలిపోతే, దాన్ని విసిరి అవతల పారేసేదాకా నీకు తోచదు. నన్ను నువ్వు ఇంతగా అనిమానించకపోయినా బాగుండును! కాస్తయినా ఉసఖపడేదాన్ని!

⁂

యు:అప్పుడే సందడి తగిగపోతూంది. మేడలో దీపాలు ఒక్కొక్కటే ఆరిపోతున్నాయి. పాపాయిలు నిద్రపోయారు! వాళ్ళ తల్లులూ నిద్రపోయారు. హాయిగా... ఒంటరితనం ఎంత భయంకరం! చేతిలో కానీ లేదు. అనా రేపు ఎలా గడుస్తుందన్న భయం లేదు. తిండి లేకపోయినా అంత బాధలేదు. ఎంత ఆకలి రాత్రయినా తెల్లారక తీరదు. అలాగే శాశ్వతంగా కన్నుమూస్తే మరి చింతే లేద. కానీ యీ ఒంటరితనం ప్రపంచంలో 'నా' అన్నవాడు ఒక్కరు- ఒక్క ప్రాణి లేకపోతే ఏం దారి? ఏవిటో భాగారంలో శేషంలా నేనొక్కణ్ణీ ఇలా మిగిలిపోయాను! తిండి కోసం వెతుక్కుంటూ.. పింఛను తాతగారల్లే ఉందే? ముసలాయనకి నిద్రపట్టడంలేదు కాబోలు!

తా:ఏం నాయనా! ఇంకా నిద్రపోలేదూ! మేడ ముందు పచార్లు చేస్తున్నవ్!

యువ:లేదు తాతాగారూ! ఏవిటో నిద్రపోవాలని పించడంలేదు! రోడ్డుమీది వింతల్ని చూస్తూ పిచ్చిగా ఆలోచిస్తూ-

తా: నిద్రపో నాయనా! నిద్రపో! మేలుకుంటే ఏవుంది- బెంగలూ భయాలూ తప్పు!

యు:మరి మీరు నిద్రపోలేదే తాతగారూ!

తా:నిద్ర! నాకు ఏ రకంగా ఒక్కసారే నిద్ర! పెద్ద కోడలు ప్రసవ వేదనలో వుంది. చిన్నకోడలికి జ్వరం! ఆ తీవ్రంలో ఒకటే పలవరింతలు! చేతిలో కానీ లేదు. అవునా! ఇలాంటప్పుడు నాకెందుకో నవ్వొస్తుంది! నేనవ్వితే మా ధర్మపత్నికి కోపం. మనందరం అసలు ఎందుకు పుట్టామా అన్న ప్రశ్న ఇప్పుడు తేల్చమంటుంది- యీ అర్థరాత్రి! ఎలాగుందంటావ్?

యు:దివ్యంగా ఉంది! పోనీ కాస్సేపు ఇక్కడ కూర్చొని కబుర్లు చెప్పుకుందాం.

తా: అలా అన్నావు బాగుంది. ఉండు, ఓ చుట్ట వెలిగించి నీకు నా అనుభవాలన్నీ చెపుతాను. చూడూ, నువ్వు చుట్ట కాల్చగలవా?

యు:కాల్చగలను కాని నేనెప్పుడూ కాల్చేవి బీడలు ఉన్నాయిలెండి నా దగ్గిర...

తా:ఏవో ఒకటిలే! కాల్చడం ప్రధానం. మీ అమ్మా, నాన్నా ఏ వూళ్ళో ఉన్నారు నాయనా?

యు:స్వర్గంలో

తా:మంచిది. సరే, యిల్లాలు లేదని నిన్ననే చెప్పావు. పోనీ ఏదైనా ఉద్యోగం చేసుకుంటున్నావా?

యు:అదీ లేదండి! ఇచ్చేవాడెవ్వడూ లేడు


తా:ఇంకేం! సుఖపడ్డావ్. వీలయినకాడికి ఉద్యోగాలు చెయ్యకుండా బతకడానికి ప్రయత్నించు. ఇదంతా ఉత్త మాయ నాయనా! నేను చేసి చూశాను. ముప్ఫయి మూడు సంవత్సరాలు- చివరికి ఏం మిగిలింది?

- సశేషం

(ఆకాశవాణి సౌజన్యంతో...)

మాటాట

నిర్వహణ: సుధామ 1558




ఆధారాలు

అడ్డం:
1. నరకబాధ , తీవ్రవేదన
3. అభిసారిక, ప్రతిక స్థాపన సంపాదకుడు
4. ఆయారాం తోడిది
8. దండ
9. కులాలుడు
10. పడవ
11. తిరిగి
12. కళ్ళెం
13. మర


నిలువు:
2. ఆభరణం
3. ఆయారాం గయారాం ల అంత్యాలు
5. తోడికోడలు, బాటసారి
6..ఈ రాఘవ ప్రసిద్ధం నటుడిగా
7. తూర్పు పశ్చిమ జిల్లాల నది ఈ శర్మ ఒకప్పటి కవి
9. భూమి
10. కూర మీద పీచు
11. చేనేత పనివారి ఇంట నుండేది

మాటాట -1557 సమాధానం



ధర్మభూమి


ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్



చక్ర శక్తి

మానవ దేహంలో షట్చక్రాలున్నాయని యోగశాస్త్రం చెబుతుంది. ఆజ్ఞా, విశుద్ధ, అనాహత, మణిపూరక, స్వాధిష్ఠాన, మూలాధార అనునవి ఆ చక్రాలు. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం అను కర్మేంద్రియాలు కంటికి కనబడుతూ ఉంటాయి. వీటి క్రియాస్వరూపాలుగా 'రూప' విశేషం మినహా చర్మచక్షువులకు కనబడవు కాని జ్ఞానేంద్రియాలయిన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు శరీర వ్యాపకాలను నిర్వహిస్తూ వున్నాయి. ఇవి వైద్య శాస్త్ర పరిధికి అందుతుంటాయి. కాని ఈ షట్చక్రాలు చర్మ చక్షువులకూ గోచరించవు. వైద్య పరిధికీ అందవు. కాని ఇవి వీటి పనిని చేస్తూనే ఉన్నాయి.

గుణమే మిన్నన్న అన్న బ్రహ్మన్న!



ఈ కలియుగంలో కలిగే వింతలన్నింటినీ ఇంతకు పూర్వమే పోతులూరీ వీరబ్రహ్మేంద్ర స్వామివారు తన కాలజ్ఞానంలో చెప్పారు. వీరు జరుగబోయే కథలను ఆనాడే వివరించారు. కందిమల్లయ్యపల్లెలో నివాసం ఉన్న వీరు సాధారణ గృహస్థుగానే ఉండేవారు. వీరి భార్య గోవిందమ్మ. ఒకసారి ఆ ఊరివారు చందాలు వసూలు చేస్తూ పోతులూరి వీరయ్యగారినికూడా చందాకోసం నిర్బంధించారు. ఆయన నా దగ్గర పైకం లేదన్నారు. ఈ సంగతి రచ్చబండ దగ్గర ఊరి పెద్దకు చెప్పడానికి రమ్మన్నారు. ఆ రచ్చబండ దగ్గర కూర్చుని ఆ ఊరి పెద్ద చుట్ట వెలిగించుకోవడానికి నిప్పు కోసం వెతుక్కుంటుంటే అక్కడే ఉన్న వీరయ్యగారు రచ్చబండమీద ప్రతిష్ఠించి ఉన్న పోలేరమ్మ అమ్మవారిని ఉద్దేశించి'ఓ పోలేరీ నిప్పు తీసుకొనిరా'అని అన్నారట. అంతే ఆ విగ్రహం లోంచి అమ్మవారు చిన్న బాలికగా నిప్పును ఒక మూకుడులో పెట్టుకొని వచ్చి ఇచ్చిందట.

దాంతో వీరయ్యగారి మహిమను తెలుసుకొన్న ఊరివారు వీరే కాలజ్ఞానతత్వాలను చెప్పే వీర బ్రహ్మంగారిగా గుర్తించారు. వీరబ్రహ్మంగారికి ఉన్న శిష్యుల్లో సిద్ధయ్య, కక్కయ్య అనేవారు ప్రసిద్ధులు. ఒకసారి వీరబ్రహ్మంగారు సిద్ధయ్యకు షట్చక్రాలను వివరిస్తున్నారు. ఆ వివరణను చాటునుండి కక్కయ్య విన్నాడు. గురువుగారిపై అపార నమ్మకమ్ము కక్కయ్య వెంటనే ఇంటికి వెళ్లి తన భార్యను శరీరాన్ని కోసి ఎక్కడ ఆ చక్రాలు ఉన్నాయో అని వెతికారు. కాని అవి కక్కయ్యకు కనబడలేదు. వెంటనే గురువుగారి దగ్గరకు వచ్చి 'స్వామీ మీరు అన్నీ అబద్దాలు చెబుతున్నారు. నేను నా భార్య శరీరాన్ని కోసి చూచి వచ్చాను'అని చెప్పాడు. అపుడు వీరబ్రహ్మంగారు చిరునవ్వు నవ్వి కక్కయ్యతోపాటు వారింటికి వెళ్లి తిరిగి కక్కయ్య భార్య ను బతికించి ఆ తరువాత కక్కయ్యకు జ్ఞానోపదేశం చేశారు. అప్పటి నుంచి కక్కయ్య వీర బ్రహ్మంగారికి ప్రియశిష్యునిగా మారాడు.

బ్రహ్మంగారి బోధనలు విన్నవారు మానవత్వంతో మసలుకొంటారు. కులంకన్నా గుణమే మిన్న అని వీరబ్రహ్మంగారు బోధించారు. ఆనాడున్న అస్పృశ్యతానివారణలోను, కులమతాల జాడ్యం వదిలించడంలోను వీర బ్రహ్మంగారు ఎంతో కృషి చేసి ప్రజలందరూ ఈశ్వరుని సంతానమని చెప్పుతూ వారిని చైతన్యవంతులను చేశారు. బనగానపల్లెకు మూడు కిలోమీటర్ల దూరంలో రవ్వలకొండ అనే ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలోనే ఆనాడు వీరబ్రహ్మంగారు అచ్చమ్మగారి ఆవులను మేపేవారు. ఈ ప్రాంతం లో ఎక్కడా పచ్చగడ్డి అన్నా మొలవని రాళ్లు రప్పలున్న ప్రదేశం.కాని ఆ రోజుల్లో ఇక్కడ ఒక గిరి గీసి ఆ గిరిలో ఆవులను నిలిపి తాను కాలజ్ఞానాన్ని వ్రాస్తూ కూర్చునేవారట వీరబ్రహ్మంగారు. ఆ గిరి గీసినంత మేర పచ్చటి పచ్చిక మొలిచేదట. ఆ గడ్డిని తిన్న ఆవులు అధికంగా పాలు ఇచ్చేవట. అది కూడా వీరబ్రహ్మంగారి మహిమనే అని వీరబ్రహ్మంగారి భక్తులు చెబుతారు. ఇట్లాంటి మహిమలెన్నో బ్రహ్మంగారు చూపారని చరిత్ర చెబుతోంది.

- డా. ఎ. రాజమల్లమ్మ

ధనరక్షణకు మార్గమిదే

మానవుడు తన ధర్మాన్ని చక్కగా నిర్వహిస్తూ ఉత్తముడుగా తయారు కావాలి. ధర్మాన్ని ఆచరించకుండా ఎన్నేళ్లు బతికినా అది వ్యర్థ జీవిత మే అవుతుంది. అంతేకాదు జీవితాన్ని వ్యర్థంగా గడిపితే పశువులకు మనుష్యులకు తేడాలేకుండా పోతుంది. కనీసం మనకున్న దానిలో కాస్త దానంచేయాలి. ధనం లేకపోయినా చేతనైనంత సాయం ఏదో ఒక రూపంలో చేయాలి. ఈ లోకానికి వచ్చేటప్పుడు ఏమీ తేకుండా వచ్చినవాళ్లు వెళ్లేనాడు కూడా ఏమీ తీసుకొని పోలేరు. అందుకే జననమరణాలకు మధ్య ఉన్న సమయమే మంచిచేయడానికి అనువైన సమయం అంటారు. ఎవరికీ ఏమీ చేయకుండా చివరకు వరకు గడిపినా అది వ్యర్థమే బాగా సంపాదించి తాను తినకుండా ఇతరులకు పెట్టకుండా దాచేస్తే అదీ వ్యర్థమే అవుతుందని ఓ శతకకారుడు ఇలా చెప్పాడు.



ఒక లోభి కష్టపడి కూడబెట్టిన ధనాన్ని కూడబెట్టాడు. దాన్ని భద్రంగా దాచుకోవాలని బంగారు ముద్దగా మార్చాడు. దానిని జన సంచారం లేని ప్రదేశంలో గోయి త్రవ్వి అందులో పెట్టి పూడ్చి పెట్టాడు. అప్పుడప్పుడు వెళ్లి దాని చూసిసంతోషించేవాడు. కాని ఈ విషయం ఒక దొంగ కనిపెట్టాడు. ఆ దొంగ గొయ్యి తవ్వి ఆ బంగారు ముద్దను తీసుకొని వెళ్లాడు. ఆ తరువాత లోభి వచ్చి చూసుకొని లబోదిబోమని ఏడ్చాడు. అది విని ఏం జరిగిందో అని నలుగురు వచ్చారు. వారికి జరిగిన సంగతి చెప్పాడు. వారు అంతా విని , ఈ పెద్దమనిషి సంగతి తెలిసి అయినా పోయిందేముంది. ఆ బంగారాన్ని నీవు ఏమీ చేయవు కదా. వూరికే చూడడానికే గదా అది పనికి వచ్చేది. ఆ కనిపించే రాయి తెచ్చి ఈ గోతిలో పెట్టుకొని నీవు అప్పుడప్పుడు వచ్చి ఇదే బంగారం అని చూస్తుండు అని చెప్పారట. ఆ మాటలతో తెలివి తెచ్చుకున్న ఆ లోభి పరమ దయాళువుగా మారిపోయాడట. ఆయన సంపాదించిన దానిలో కొంతభాగం దానం చేయడం మొదలుపెట్టాడు. ధనానికి రక్షణ దానమే అన్నారు పెద్దలు.

- మానస

వ్యాధులను బాపే ధర్మలింగేశ్వరుడు

ఓం రుద్రాయ నమః, ఓం నీల కంఠాయనమః, ఓం నమశ్శివాయ నమః అంటూ పండితులంతా పరమేశ్వరుడిని అభిషేకాదులతోను, అర్చనాదులతోను పూజిస్తుంటారు. అటువంటి శివుణ్ణి పామరులే కాదు జంతువులుకూడా పూజించి తమ జన్మను సాఫల్యం చేసుకొన్నట్లు మనకు చరిత్ర చెబుతోంది. అటువంటి శివుడు నేడు...

విశాఖ పట్టణానికి యాభై కిలోమీటర్ల దూరంలో గాజువాక యలమంచలి దారిలో స్వయంభువుగా వర్ధమానలింగరూపంలో దర్శనం ఇచ్చాడు. ఆ క్షేత్రం కొన్నాళ్లు వైభోగాలు అనుభవించి ఆ తరువాత కాలంలో ఆ శివాలయం జీర్ణావస్థలోకి జారుకొంటున్నదట. ఆ సమయం లో కర్మలకు ఫలితాల నిచ్చే కాలుడు తనకు కర్మశేషంగా వచ్చిన కుష్ఠురోగాన్ని పోగొట్టుకోవడానికి యమధర్మరాజు ఈ క్షేత్రానికి వచ్చి ఇక్కడ కాలగర్భంలో కలసిపోతున్న ఈ శివలింగాన్ని బయటకు తీసి మరలా పునఃప్రతిష్ఠించాడట. దానితో ఈ శివలింగానికి ధర్మలింగేశ్వరుని నామం ఏర్పడింది. ఈ ధర్మలింగేశ్వరుణ్ణి కొలిచినవారికి వ్యాధులు దూరమవుతాయట.



అంతేకాక ముక్తినిచ్చేవాడే ఈ ఈశ్వరుడేనని భక్తులు నమ్మికొలుస్తారు.

ఈ క్షేత్ర రాజంలోనే భూగర్భంలో నుంచి ఐదుచోట్ల జలధారలు వుబికి వస్తాయి. ఇది ఫణిగిరి పర్వతం క్రింద వుండే రాంబిల్లి మండలంలో ఈ జలధారల పొంగులు కనిపిస్తాయి. ఈ ఐదు జలధారల పేర్ల మీదే ఈ క్షేత్రానికి పంచధారలు అన్న పేరు ఏర్పడింది. కాలక్రమేణ పంచజలధారలు కాస్త పంచధార్లగా మారిపోయిందని స్థలపురాణాలు చెబుతున్నాయి. ఈ పంచధారాల్లో స్నానం చేస్తే పూర్వకర్మలు నశిస్తాయని అంటారు. ఈ పంచధారలలో నీటిలో గంధకం శాతం ఎక్కువగా ఉన్నందువల్లే ఇక్కడ స్నానాలు చేసేవారికి అనేకానేక రుగ్మతలు పోతున్నాయని హేతువాదులు చెబుతారు. ఈ ధర్మలింగేశ్వరుని పాండవులు కూడా కొలిచినట్లు చెప్తారు. ఈ ఫణిగిరి పర్వతంపైనే ఓ గుహ వుంది. ఆ కాలంలో పాండవులు ఇందులో కొంతకాలం నివసించారని అందుకే ఈ గుహకు పాండవుల గుహ అన్న నామం ఏర్పడిందనీ అంటారు. ఈ ధర్మలింగేశ్వరుడి ఆలయాని కన్నాముందు రాధామాధవ స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో భూమిలో నుంచి వచ్చే పంచధారలను కలిపే ఓ తటాకం కనిపిస్తుంది. ఈ తటాకాన్ని హరినరేంద్రుల రాజులు నిర్మించినట్లు చారిత్రికాధారాలు తెల్పుతున్నాయి.



ఈ పంచధారల క్షేత్రంలో నారసింహుడు మొదట పాదం మోపాడట. కాని ధర్మలింగేశ్వరుడు ఆయన్ను సింహగిరిలో నివాసమేర్పచుకోమన్నందు వల్ల సింహగిరిలో కొలు వై సింహగిరి నరసింహుడుగా వసిస్తున్నాడని ఐతిహ్యం. ఈ నరసింహుని పాదముద్రలు కూడా ఇక్కడ దర్శనమిస్తాయి.

ఈ రాధామాధవాలయానికి పశ్చిమంలో అతి ప్రాచీనమైన కాశీవిశ్వేశ్వర ఆలయం కూడా కనిపిస్తుంది. దీనిని యలమంచలి నాగేంద్ర దేవుడనే రాజమహేంద్రవరపు గవరశెట్టి నిర్మించినట్లు ఇక్కడి స్థలపురాణం చెబుతోంది.ఈ ధర్మలింగేశ్వరుడికి శివరాత్రి మహోత్సవాలు, ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాట కల్యాణాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతాయి.

- చోడిశెట్టి శ్రీనివాసులు

ధర్మస్థాపనాచార్యుడు

సనాతన ధర్మస్థాపకుడుగ, విజయనగర సామ్రాజ్య స్థాపకుడుగా సువిఖ్యాతి గాంచిన విద్యారణ్యుల జననం క్రీ.శ. 1268. వీరి పూర్వ నామం మాధవుడు. సన్యాస స్వీకారము తర్వాత మాధవులే విద్యారణ్యుడుగా ప్రసిద్ధిచెందాడు. వీరే హరిహర బుక్కరాయలకు చింతామణి మంత్ర జపం చేసి ఏడు ఘడియలు స్వర్ణవృష్టి కురిసేట్టు చేసి ఆ ధనరాసులను ఆ రాయలకిచ్చి వారి సామ్రాజ్య స్థాపనకు బాసటగా నిలిచారు.



విజయనగర సామ్రాజ్య స్థాపన జరిగిన తర్వాత విద్యారణ్యులు, తమకు సన్యాస దీక్షనిప్పించిన శృంగేరి పీఠాధిపతులు శ్రీ విద్యాతీర్థులవారు కాలధర్మం చెందిన వార్త విని శృంగేరి వెళ్లారు. అక్కడి పండితుల ప్రార్థనతో 1380లో విద్యారణ్యులు శృంగేరి పీఠాధిపత్యం స్వీకరించారు. విద్యారణ్యులు, తమ్ముడైన సాయణులతో కలిసి వేద భాష్యమును రచించారు. శ్రుతులకు భాష్య రచనమేకాక విద్యారణ్యులు స్మృతుల ఉపదేశాలను కూడా పరాశర స్మృతి వ్యాఖ్యగా క్రోడీకరించారు. విద్యారణ్యులు మఠాధిపతులుగా దక్షిణ భారతంలో పలుచోట్ల పీఠాలు స్థాపించారు. మొదట విరూపాక్షంలో పీఠం స్థాపించి స్వయంగా దానిని అధిష్ఠించారు. ఆ తర్వాత పుష్పగిరి, కూడలి శివగంగ ఆరణి మొదలగుచోట్ల పీఠాలు స్థాపించారు. ఆదిశంకరులవలె విద్యారణ్యులు ఎన్నో దేవాలయాల పునరుద్ధరణకు కృషిచేశారు. విద్యారణ్యులకు అగ్రహారాలిప్పించారు. వేద రక్షణకు సుస్థిరమైన వ్యవస్థ ఏర్పాటుచేశారు.విద్యారణ్యులు జైమినీయ న్యాయమాల, పరాశర మాధవీయం, కాలమాధవీయం సర్వదర్శన సంగ్రహం, వేదాంత శంకర విజయ కావ్యం మొదలగు గ్రంథములెన్నిటినో రచించారు. త్రిమతాచార్యులను గౌరవించారు. 1386వ సంవత్సరమున తమ గురువర్యులైన శ్రీ విద్యాశంకర తీర్థులను ధ్యానించుచు, పంపా క్షేత్రమందే బ్రహ్మీభూతులయ్యారు. నేటికీ హంపీ విరూపాక్షేశ్వరాలయం వెనుక భాగంలో విద్యారణ్యస్వాముల వారి మందిరమున్నది.

- గాయత్రి



యాజ్ఞసేని

31

త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము

ద్రౌపది సమేతులై కుమ్మరి ఇంటికి వెళుచున్న భీమార్జునలను, తండ్రి ఆజ్ఞ మేరకు దృష్టద్యుమ్నుడు వారి వెనుక నుండి వారిని అనుసరించాడు. భీమార్జునులకు తెలియకుండా సేవకులను అంతా నియమించాడు.

దృష్టద్యుమ్నుడు భార్గవుని ఇంటి వద్ద అజ్ఞాతంగా ఉన్నాడు. పాండవుల గురించి గోప్యంగా వివరాలను సేకరిస్తున్నాడు.

సాయం సమయం అయింది. భీమార్జున నకుల సహదేవులు భిక్షాటనం కోసమై బయలుదేరి వెళ్ళారు.

వారలా భిక్షపాత్రలు పట్టుకొని వెళ్ళటం చూచిన ద్రౌపది, తాను రాజ గృహంలో పరిచారికలు సేవిస్తుండగా కోరిన భోజనం చేసిన తనకు ఇక్కడ భిక్షాన్నం తినవలసి రావడం ఒక్కింత కష్టమనిపిస్తున్నది. ఇది విధి నిర్ణయం అని తలపోసి ముందు ఏమి జరుగనున్నదో అని వేచి చూస్తున్నది.

బయటికి పోయిన భీమార్జున నకుల సహదేవులు బ్రాహ్మణుల ఇండ్లలో భిక్షాటం చేసి ఇరిగి వచ్చాడు. భిక్షాటనంలో తెచ్చిన ఆహారాన్నంతా ధర్మరాజుకు నివేదించారు. కుంతిదేవి లేచి భిక్షాన్నాన్ని చూసి ఆప్యాయంగా ద్రౌపదిని పిలిచింది.

''సుందరీ! ద్రౌపదీ! ముందు నీవా అన్నం తీసికొని అందు అగ్రభాగాన్ని తీసికొని ఒక భాగం దేవతలకు నివేదించుము.

మరొక భాగం విప్రులకు భిక్షగా పెట్టుము. మన చుట్టూ ఆశ్రయించుకొన్నవారికి కొంత భాగం పెట్టుము.

మిగిలిన దానిలో సగభాగం ఒక ప్రక్కన పెట్టుము.

ఇంకా మిగిలిన దానిని ఆరు భాగాలుగా చేయుము. నాలుగు భాగాలు కొడుకులకూ, నాకు ఒకటి, నీకు ఒకటి.. మొత్తం ఆరు భాగాలు.

మొదట చేసిన సగ భాగం.. అడుగో ఏనుగులా, వృషభంలా తెల్లగా పెద్ద శరీరంతో ఉన్న యువకుడు ఉన్నాడే వాడు కాస్త ఎక్కువగా తినగలడు. వాడికి పెట్టుము'' అని అన్నది.

ఆ మాటలు విన్న ద్రౌపది ఎంతమాత్రం శంకించకుండా ''తమరు ఎలా చెబితే



అలానే చేస్తాను'' అని అన్నది. సంతోషంతో కుంతీదేవి చెప్పినట్లుగా అక్షరాలా చేసింది.

అందరూ అభినందించారు.

భోజనానంతరం సహదేవుడు నేలమీద దర్భలతో శయనం ఏర్పాటుచేశాడు.

ద్రౌపది ప్రీతితో అందరి పడకలపై జింక చర్మాలను పరిచింది.

పాండవులందరూ దక్షిణాభిముఖంగా తలలు పెట్టి శయనించారు. వారి తలల వద్ద కుంతీదేవి తలగడగా శయనించింది.

ద్రౌపది పాండవుల కాలి దిండులా నేల మీద పరచిన దర్భలపై పరుండింది.

ద్రౌపదికి తొందరగా నిద్రబట్టలేదు. పాండవుల భిక్షాటనం గురించి ఆలోచించింది. తాను ఆగర్భశ్రీమంతురాలను. భిక్షాన్నం స్వీకరించవలసి వచ్చింది. దర్భలపై పరుండవలసి వచ్చింది. అయినా స్వయంవరంలో గ్రహించినవారి ఆచార వ్యవహారాలను తాను పాటించవలసిందే గదా! వేరే మార్గం లేదు. తానొక స్త్రీని. అత్త వారింటికి వెళ్లిన తరువాత వారు చెప్పినట్లుగా చేయుట తనకు ధర్మం అని పరిపరి విధాలా ఆలోచించింది. మనస్సును పదిలపరచుకుంది.

పడుకొని వున్న పాండవులు కొంతసేపు మాట్లాడుకొనటం శ్రద్ధగా విన్నది. వీరు పాండవులన్న నమ్మకం కలిగింది.

వీరు కాంపిల్యానికి ఎలా వచ్చారు. గొప్ప తేజస్సుతో ఉట్టిపడుచున్నవాడు ధర్మరాజా! ధర్మానికి మారు పేరే. సందేహం లేదు. ఇలాంటివాడికి విధి వక్రించి మారువేషంలో ఉండవలసి వచ్చింది.

ధర్మరాజుకు ఎడమ ప్రక్కన పరుండినవాడు భీమసేనుడా! పేరుకు తగ్గట్టుగానే ఉన్నాడు. అతి బలాఢ్యుడు. అందుకే కుంతీ మాత తెచ్చిన భిక్షాన్నంలో సగభాగం అతడికి పెట్టమన్నది.

భీమసేనునికి ఎడమప్రక్కన పరుండినవాడే 'అర్జునుడా'! తన తండ్రిని పట్టి గురుదక్షిణగా ఇచ్చినవాడు. ఈతడికొరకేనా నా తండ్రి యజ్ఞం చేసి నన్ను పొందింది. పాండవులలో మేటి. ఇతడికి ఇతడేసాటి. స్వయంవరంలో ఎవ్వడూ ఛేదించలేని మత్స్యయంత్రాన్ని అవలీలగా పడగొట్టి తన విలువిద్యా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. నా పాణిని గ్రహించగలిగినాడు. మా తండ్రి కోరిక నెరవేర్చినాడు.

అర్జునునికి ప్రక్కనే పరుండినవారు నకుల సహదేవులా! మాద్రేయులు. వినయ సంపన్నులు. అన్నల ఆజ్ఞను శిరసావహించి పాటించువారు.

పాండవులు జీవించే ఉన్నారు. ఇది నిజం కావాలి. ధర్మవర్తనులు కష్టాలను పొందినా అవి తాత్కాలికమే అవుతుంది.

అంతిమంగా విజయం తప్పక వారిని వరిస్తుంది. ఈ సత్యము వీరి విషయంలో తేలిపోయింది.

అర్జునుడు తనను గెలుచుకున్నాడు. నేను అతడికే భార్యను కాగలనా? లేక అత్త అన్న మాట నెరవేరుతుందా?

అని అనేక విధాలుగా ఆలోచిస్తూ నిద్రలోనికి వాలిపోయింది.

***

- ఇంకావుంది

సాధన - శోధన

''సాధన చేయమురా నరుడా సాధ్యం కానిది లేదురా?'' అని అన్నారు పెద్దలు.

సాధనతో మనం దేనినైనా సాధించగలం. సమకూర్చుకోగలం. సమస్తాన్ని స్వంతం చేసుకోగలం. సాధనతో మనిషి 'మనీషి' అవుతాడు. మహాత్ముడవుతాడు. అందుకనే అన్ని ధనాలలోను విశిష్టమైన ధనం, విలక్షణమైన ధనం సాధనం అని అన్నారు మహనీయులు.

పూర్వం ఒక ఊరిలో ఒక గొప్ప శిల్పి ఉండేవాడు. ఓ గొప్ప శిల్పాన్ని తయారుచేసి తన జీవితాన్ని సార్థకం చేసుకవోలనేది అతని కోరిక.

పక్క ఊర్లోని రచ్చబండ తను చెక్కబోయే శిల్పానికి తగిన రాయి అని అనుకున్నాడు. ఆ రచ్చబండని పగలగొట్టడానికి ఆ గ్రామస్తులు ఒప్పుకోరని కూడా తెలుసా శిల్పికి. అందుకని ఓ అర్ధరాత్రి మెల్లగా ఆ రచ్చబండని (రాయిని) రహస్యంగా, దగ్గరలో వున్న ఓ మారుమూల రహస్య స్థావరానికి తరలించేడు. తర్వాత మెల్లగా శిల్పాన్ని ఎక్క పనిలో నిమగ్నమైపోయేడా శిల్పి. రాత్రింబవళ్ళు కష్టపడి, ఆ పెద్ద రాయిని ఆంజనేయస్వామి విగ్రహంగా అద్భుతంగా మలిచేడు. విగ్రహం జీవకళ ఉట్టిపడుతూ, అద్భుతాల్లో మరో అద్భుతంగా తయారైంది.

ఆ విగ్రహాన్ని ఎవరికీ తెలియకుండా అతి రహస్యంగా ఏ ఊర్లోనైతే ఆ విగ్రహాన్ని పెడదామనుకున్నాడో ఆ ఊరికి తరలించేడు. ఆ విగ్రహాన్ని మెల్లగా ఆ ఊర్లో వదలిసి పొరుగు దేశనాకి అదృశ్యంలోకి వెళ్లిపోయేడా శిల్పి.

ఆ ఊర్లో అకస్మాత్తుగా దర్శనమిచ్చిన ఆ విగ్రహాన్ని చూసిన గ్రామస్తులు భక్తిప్రపత్తులకి లోనయ్యేరు. ఆలయం కట్టించి విగ్రహాన్ని ప్రతిష్ఠించేరు.కాలక్రమంలో ఆ గ్రామం ఓ గొప్ప పుణ్యక్షేత్రగా మారిపోయింది. కొన్నేళ్ళు గడిచిపోయేయి. ఆ విగ్రహాన్ని ఏం చేసాలో అనే ఉత్సాహం కలిగింది. ఆ ఊరు వెళ్లి విగ్రహం గురించి తెలుసుకోవాలనుకుని ఆ ఊరు వెళ్ళేడు. అం చూసి ఎంతో సంతోషించి తన జన్మ చరితార్థమంది అని అనుకున్నాడు శిల్పి.

ఆ ఊరిలోని ఓ వయసు మళ్లిన ఓ రైతు ఈ శిల్పిని గుర్తుపట్టేడు. ఆలయ కమిటీకి పరిచయం చేసేడు. ఆ శిల్పే ఆ విగ్రహం అంత అద్భుతంగా రావడానికి కారణమని అంతా తెలుసుకున్నారు. అంతటి ప్రాభవానికి వైభవానికి కారకుడైన ఆ శిల్పిని సన్మానించాలనుకున్నారు కమిటీ సభ్యులు.

సన్మాన కార్యక్రమం మొదలైంది. ముఖ్య వక్తతో సహా కార్యక్రంలో పాల్గొన్నవారందరూ 'ఇంద్రుడు.. చంద్రుడు' అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. ఆకాశానికి ఎత్తేసారు ఆ శిల్పిని.

చివరగా సన్మాన గ్రహీత, శిల్పి మాట్లాడటం మొదలుపెట్టేడు. ఆ గ్రామస్తుల్ని ఉద్దేశించి ''మీరంతా ఒఠ్ఠి మూర్ఖులు'' అన్నాడు. ''క్షమించండి, మిమ్మల్ని అవమానపరచాలని నేనలా అనలేదు. మీరంతా ఆ విగ్రహాన్ని నేను అద్భుతంగా తీర్చిదిద్దానని పొగుడుతున్నారు. నిజానికి నేను కొత్తగా చేసిందేమిటి? ఆలోచించండి! ఆ రాయిలోని అక్కరలేని వ్యర్థ పదార్థాన్ని కొంచెం నైపుణ్యం జతచేసి తీసిపారేశాను. అంతే, ఆ రాయి ఓ అద్భుతమైన కళాఖండంగా.. ఓ విగ్రహంగా.. మనం ఆరాధించే దేవుని మూర్తిగా మారిపోయింది''. అందరూ శిల్పి చెబుతున్న మాటల్ని వింటున్నారు. శిల్ప తన ఉపన్యాసాన్ని కొనగిస్తూ.. మరి మీరో? మనమో? ఒక్కసారి ఎప్పుడైనా ఆలోచించేరా? మనందరిలోను అంతర్లీనంగా ఆ భగవంతుడు దాగి ఉన్నాడు. మనం మనలో ఉన్న ఆ దివ్య చైతన్యాన్ని, అరిషడ్వర్గాలతో కప్పివేస్తున్నాం. మరుగునపరిచేస్తున్నాం. మనతోనే, మనలోనే కాపురముంటున్న కామ, క్రోధ, లోభ, మద మాత్సర్యాలను, అహంభావ, అహంకారం అనే అనవసరమైన వాటిని గురించి, వాటిని నిర్మూలించుకోగలిగితే అంటే మనలోంచి తీసివేయగలిగితే.. మనందరం దివ్యత్వాలుగా ఆవిష్కరింపబడతాం. మనం కూడా దేవుళ్ళుగా ఆవిర్భవిస్తాం. ఈ సూక్ష్మం మీరు గ్రహించాలనే ఉద్దేశ్యంతోనే మీ కళ్ళు తెరిపించాలనే మిమ్మల్ని 'మూర్ఖులు' అనాల్సి వచ్చింది. మిమ్మల్ని నొప్పిస్తే క్షమించండి అని ఉపన్యాసాన్ని ముగించేడా శిల్పి. అందరికీ తమ తప్పు తెలిసొచ్చింది. విషయం అర్థమయింది. సాధనతో జీవుడు, దేవుడిలా ఎలా మారగలడో తెలిసింది.

అవును - సాధన చేయాలి. శోధన చేయాలి. శోధించి సాధించాలి. సాఫల్యం చేసుకోవాలి.

ప్రసాదం

- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669



రాశీఖన్నా

ఆ పాత్రకోసం చాలా కష్టపడ్డా

వరుస సినిమాలతో జోరుమీదుంది రాశీఖన్నా. ఊహలు గుసగుసలాడే సినిమాతో పరిచమై తొలి చిత్రంతోనే కుర్రాళ్ల హృదయాలను గిలిగింతలు పెట్టింది. నటన, గ్లామర్ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ తనకంటూ ప్రత్యేకత చాటుకుంటోంది. తెలుగుతోపాటు దక్షిణాది భాషల్లో కూడా నటిస్తున్న రాశీ, ప్రస్తుతం వరుణ్‌తేజ్‌తో తొలిప్రేమలో నటిస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో శ్రీవేంకటేశ్వరా క్రియేషన్స్ పతాకంపై భోగవల్లి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 10న విడుదలకు సిద్ధమైన సందర్భంగా రాశీఖాన్నా చెప్పిన విశేషాలు..

తొలిప్రేమ గురించి

తొలిప్రేమ గురించే సినిమా సాగుతుంది. ఈ జనరేషన్‌లో తొలిప్రేమ ఎలా వుంటుంది? పరిణితి పెరిగేకొద్దీ ఎలా మారుతుంది అనే ఆసక్తికర అంశాలతో ఈ చిత్రం వుంటుంది. పవన్‌కళ్యాణ్ నటించిన తొలిప్రేమ చిత్రాన్ని చూశాను. కానీ దానికీ దీనికీ ఎలాంటి సంబంధం వుండదు. ఈమధ్యకాలంలో నాకు బాగా నచ్చిన ప్రేమకథ ఇది.

మూడు షేడ్స్‌ల్లో

ఇందులో నాపేరు వర్షా. మూడు వేరియేషన్‌లలో నా పాత్ర సాగుతుంది. 19 ఏళ్ళ వయసునుండీ జరిగే కథ ఇది. ఇందులోని పాత్ర నాకు బాగా నచ్చింది. పాత్రలో మూడు వేరియేషన్స్ చూపించడానికి ఫిజికల్‌గా మార్పులకోసం భారీగా బరువు తగ్గాల్సి వచ్చింది. ఒకరకంగా నాకు ఇది హారీపోర్టర్ లాంటి సినిమా.

వరుణ్‌తో..

వరుణ్ మంచి వ్యక్తి. సినిమాకోసం చాలా కష్టపడతాడు. ఇందులో తన పాత్రకోసం ఫిజికల్‌గా మారాల్సి వచ్చింది. దానికోసం జిమ్‌లో కుస్తీలు పట్టేవాడు. సెట్‌లో చాలా సరదాగా వుండేవాడు. అతనితో పని చేయడం ప్రత్యేకత అని చెప్పాలి.

నా తొలిప్రేమ

నా 17 ఏళ్ళ వయసులో నన్ను ఒక వ్యక్తి ఇష్టపడ్డాడు. అతను నా సీనియర్. ఆ సమయంలోనే నాకు ప్రపోజ్ చేశాడు. అదే నా తొలి ప్రేమ. ఆ తరువాత తను అంటే నాక్కూడా ఇష్టం కలిగింది కానీ అతనికి చెప్పలేదు. అందుకే ఈ కథ నాకు బాగా దగ్గరైంది.

బాగా వచ్చింది

దర్శకుడు వెంకి ఈ స్క్రిప్ట్‌కోసం రెండేళ్లు కష్టపడి తయారుచేశాడు. సినిమా చెప్పినదానికంటే బాగా తీశాడు. తప్పకుండా మంచి చిత్రం అవుతుంది. ఈ సినిమాలో మిగతా టెక్నీషియన్లు, ఆర్టిస్టులు అందరూ మంచి సినిమా కోసం కష్టపడ్డారు.

తదుపరి చిత్రాలు

ప్రస్తుతం తమిళంలో మూడు చిత్రాలు చేస్తున్నాను. అందులో అధర్వ సరసన ఒకటి, సిద్ధార్థ్‌తో మరొకటి చేశాను. ఈ రెండూ ఏప్రిల్‌లో విడుదల కానున్నాయి. అలాగే జయంరవితో షూటింగ్ జరుగుతోంది. తెలుగులో త్వరలోనే ఓ చిత్రం ఉంటుంది.

- శ్రీ



మార్చిలో సెట్స్ పైకి..

'జైలవకుశ' చిత్రం తరువాత ఎన్టీఆర్ హీరోగా నటించే చిత్రానికి ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తికావచ్చాయి. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఇదివరకే పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చిలో ప్రారంభం కానున్నదట. 'అజ్ఞాతవాసి' పరాజయంతో కాస్త వెనక్కి తగ్గిన త్రివిక్రమ్, ఎన్టీఆర్ కోసం పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తున్నాడని తెలిసింది. ఎన్టీఆర్-త్రివిక్రమ్‌ల కాంబినేషన్‌పై అభిమానులు కూడా భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుందోనని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. త్వరలోనే నటీనటులు, టెక్నీషియన్ల వివరాలను ప్రకటిస్తారని తెలిసింది. హారికా హాసిని క్రియేషన్స్ పతాకంపై చినబాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని సమకూర్చనున్నట్లు తెలిసింది.

'2.0' వాయిదా పడిందా?




సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా సంచలన దర్శకుడు శంకర్ దర్శకత్వంలో అత్యంత భారీ బడ్జెట్‌తో భారీ టెక్నికల్ విలువలతో తెరకెక్కిన 'రోబో 2.0' చిత్రం ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా? అని ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు మరోసారి నిరాశే కలగనుంది. ఇప్పటికే పలుమార్లు వాయిదాపడ్డ ఈ సినిమా మరోసారి వాయిదా పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. నిజానికి ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో విడుదలకు ప్లాన్ చేశారు. అయితే ఇంకా గ్రాఫిక్స్ పనులు పూర్తికాకపోవడంతో మరోసారి వాయిదా వేస్తున్నట్లు యూనిట్ సభ్యులనుండి సమాచారం వచ్చిందట. దాంతో రజనీకాంత్ నటిస్తున్న మరో చిత్రం 'కాలా'ను విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు దర్శక నిర్మాతలు. పా. రంజిత్ దర్శకత్వంలో 'కబాలి' తరువాత తెరకెక్కుతున్న 'కాలా' చిత్రం ముంబయి మాఫియా నేపథ్యంలో సాగుతుందని తెలిసింది. మొత్తానికి రెండు వరుస చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు రెడీ అయ్యాడు రజనీకాంత్.

భారీ వసూళ్లతో 'ఛలో'



నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో ఐరా క్రియేషన్స్ బ్యానర్‌పై ఉషా ముల్పూరి నిర్మించిన 'ఛలో' చిత్రం ఇటీవలే విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. చిన్న చిత్రంగా విడుదలైన ఈ చిత్రం భారీ విజయం దిశగా పరుగులు తీస్తోంది. ఈమధ్య వరుస పరాజయాలతో టెన్షన్‌మీదున్న నాగశౌర్యకు ఈ విజయంతో కాస్త రిలీఫ్ కలిగింది. మొదటివారంలోనే వసూళ్లపరంగా కూడా మిలియన్ మార్క్ దాటేసి సంచలనం రేపుతోంది. నాగశౌర్య నటన, రష్మిక గ్లామర్ ఆకట్టుకుంటున్నాయి. చిత్రయూనిట్ కూడా ఇప్పటికే పలు ప్రాంతాల్లో విజయయాత్రలు నిర్వహిస్తున్నారు. మొత్తానికి ఛలోతో నాగశౌర్య కెరీర్ గాడిలో పడిందని అంటున్నారు సినీ జనాలు. కొత్త దర్శకుడు వెంకీ తెరకెక్కించిన ఈ చిత్రం విడుదలకు ముందే బిజినెస్ పరంగా సంచలనం రేపింది. విడుదలైన అన్ని ప్రాంతాల్లో బయ్యర్స్ ఫుల్ హ్యాపీగా ఉన్నారని, భారీ వసూళ్లతో 'ఛలో' చిత్రం మరో బ్రేక్ ఈవెన్ కానుందని అంటున్నాయి.

అమెరికాలో రవితేజ చిత్రం



మాస్ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న రవితేజ నటించిన తాజా చిత్రం 'టచ్ చేసి చూడు' అనుకున్న స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ప్రస్తుతం ఆయన కల్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో జరుపుకుంటోంది. సినిమాతోపాటు రవితేజ అటు శ్రీనువైట్లతో కూడా సినిమా చేసేందుకు ఓకె చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పటికే స్క్రిప్ట్‌తో సహా అన్ని కార్యక్రమాలు సిద్ధం చేసిన శ్రీనువైట్ల ఈ చిత్రాన్ని ఈనెల 19న అమెరికాలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. మైత్రీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రవితేజ మూడు పాత్రల్లో కన్పిస్తాడని వార్తలు వస్తున్నాయి. ఏప్రిల్ నుంచి ఈ షూటింగ్‌లో రవితేజ పాల్గొంటాడట. ఎక్కువ భాగం అమెరికాలోనే జరిగే ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్లు ఉంటారని, ప్రస్తుతం వారి ఎంపిక జరుగుతోందని తెలిసింది. ఈ చిత్రానికి అమర్ అక్బర్ ఆంథోని అనే టైటిల్ పెడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

నితిన్ సరసన!

యువ హీరో నితిన్ ప్రస్తుతం రెండు చిత్రాలతో బిజీగా వున్నాడు. అందులో ఒకటి కృష్ణచైతన్య దర్శకత్వంలో పవన్‌కళ్యాణ్ నిర్మిస్తున్న చిత్రం ఒకటైతే, మరొకటి దిల్‌రాజు బ్యానర్‌లో చేస్తున్న శ్రీనివాస కళ్యాణం. వేగేశ్న సతీష్ దర్శకత్వంలో తెరకెక్కే ఈ చిత్రం ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తిచేసుకుని సెట్స్‌పైకి వచ్చేందుకు సిద్ధంగా వుంది. ఈ చిత్రంలో నితిన్‌కు జోడీగా 'ఎక్కడికి పోతావు చిన్నవాడా..' ఫేం నందితా శ్వేత నటిస్తోందిట. తొలి చిత్రంతోనే నటిగా మంచి మార్కులు కొట్టేసిన ఈ మలయాళ ముద్దుగుమ్మకు క్రేజ్ అయితే దక్కింది గానీ అవకాశాలు మాత్రం అనుకున్న స్థాయిలో రాలేదు. దాంతో తమిళంలో రెండు మూడు చిత్రాలు చేసిన నందిత మళ్లీ టాలీవుడ్‌లో బిజీ అయ్యేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ అవకాశం రావడంతో ఆమె త్వరలోనే బిజీ హీరోయిన్‌గా మారే అవకాశాలు కన్పిస్తున్నాయి. దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్ పైకి రానుంది.



నందితా శ్వేత



మహేష్‌తో సినిమా చేస్తా

దర్శకుడు వి.వి.వినాయక్

టాలీవుడ్‌లో మాస్ దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వి.వి.వినాయక్, కమర్షియల్ ట్రాక్‌లోనే వెళుతున్నాడు. వినాయక్ సినిమా అంటే ఖచ్చితంగా కమర్షియల్ సినిమా అనే ఫీలింగ్‌తో ఉంటారు ప్రేక్షకులు. ఆయనకు కూడా కమర్షియల్ ఫార్ములాలోనే సినిమాలు చేయడం ఇష్టం. ఎందుకంటే, ఇది డబ్బుతో కూడుకున్న వ్యాపారం కాబట్టి, కమర్షియల్ అంశాలు ఉండాల్సిందేనని అంటున్నారు. ప్రస్తుతం సాయిధరమ్‌తేజ్‌తో ఇంటిలిజెంట్ చిత్రాన్ని తెరకెక్కించారు. సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 9న విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా దర్శకుడు వి.వి.వినాయక్‌తో ఇంటర్వ్యూ...

★ సినిమా ఎలా వుండబోతోంది?

- నిన్ననే తొలికాపీ చూశాను. చాలా బాగా వచ్చింది. మంచి కామెడీ యాక్షన్ సాంగ్స్ అన్నీ కమర్షియల్ అంశాలతో వుండే సినిమా. ఆకుల శివతో ఇది నా నాలుగవ చిత్రం. ఇప్పటివరకు మా కాంబినేషన్‌లో వచ్చిన మూడు చిత్రాలు పెద్ద హిట్ అయ్యాయి. ఇది కూడా అలాగే అవుతుంది.

★ సాయిధరమ్‌తేజ్‌తో చేయడానికి కారణం?

- ఈ కథ అనుకున్నపుడు తను అయితేనే పర్ఫెక్ట్ అని అన్పించింది. అందుకే అతన్ని ఎంచుకున్నాం. తను అద్భుతంగా చేశాడు. కామెడీ యాక్షన్, ముఖ్యంగా డాన్సుల్లో అదరగొట్టాడు. ఈ సినిమా చూసిన తరువాత ఎంత పెద్ద కథనైనా సాయిధరమ్ మోయగలడనే ఫీలింగ్ వస్తోంది.

★ ఇంతకూ ఇంటిలిజెంట్ ఎవరు?

- విశ్వాసానికి మారుపేరుగా నిలిచే హీరో, తన కోసం, తన ఎదుగుదలకు కారణమైన వ్యక్తికి జరిగిన అన్యాయాన్ని ఎదిరించే హీరో తన మైండ్ గేమ్‌తో ఎలా ప్రతినాయకుడి ఆటలను కట్టించాడు అనేదే సినిమా. కథ మొత్తం మైండ్ గేమ్‌తో సాగుతుంది.

★ లావణ్య త్రిపాఠి గురించి?

- తేజు కోసం హీరోయిన్ ఎవరనే ఆలోచనలో భాగంగా పలువురి పేర్లను పరిశీలించాం. అయితే ఇప్పటివరకూ ఆయన చేసిన హీరోయిన్లు కాకుండా కొత్త కాంబినేషన్ అయిత ప్రేక్షకులు కూడా ఫ్రెష్‌గా ఫీల్ అవుతారని భావించి లావణ్యను ఎంపిక చేశాం. తను కూడా పాత్రలో అద్భుతంగా నటించింది.

★ చిరంజీవి పాటను రీమిక్స్ చేయాలని ముందే అనుకున్నారా?

- కథ అనుకున్నప్పుడే ఇందులో ఓ పాటను రీమిక్స్‌ను చేయాలనుకున్నాం. ముఖ్యంగా నాకు 'చమ్మక్ చమ్మక్' సాంగ్ చాలా ఇష్టం. దానికి తోడు తేజు ఆ పాటలో డాన్సుతో అదరగొట్టాడు. నిర్మాత కల్యాణ్ ఇళయరాజాను కలిసి ఆ పాటను రీమిక్స్ చేస్తున్నాం అని పర్మిషన్ అడిగారు. ఆయన పర్మిషన్ ఇవ్వడం మా అదృష్టం.

★ తమన్ సంగీతం గురించి?

- తమన్‌తో ఇదివరకే నాయక్ చిత్రం చేశాను. దానికి మంచి పాటలు అందించాడు. ఆ తరహాలోనే ఇంటిలిజెంట్‌కు కూడా అదిరిపోయే ఆల్బం ఇచ్చాడు. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాగా వచ్చింది.

★ మీ సినిమాలన్నీ కమర్షియల్ ఫార్మాట్‌లోనే వుంటాయి ఎందుకు?

- నేను ఒక కథ విన్నప్పుడు దాన్ని ప్రేక్షకులకు అదే స్థాయిలో అందించాలని అనుకుంటాను. కథ నచ్చితేనే చేస్తా. ఇక కమర్షియల్ ఫార్మెట్ అంటారా, సినిమా అనేదే వ్యాపారాత్మకం కాబట్టి కమర్షియాలిటీ తప్పదు.

★ కొత్త తరహా కథలను తీయరా?

- ఒక దర్శకుడిగా సొంత కథలే కాకుండా బయటి కథలతో కూడా సినిమాలు చేయాలి. అప్పుడే మనలోని కోణాలు బయటకు వస్తాయి. నా కథలతోనే సినిమాలు తీస్తే కొత్తదనం కన్పించదు. పైగా ఫ్యాక్షన్ దర్శకుడిగానే నాకు గుర్తింపు వచ్చేది. అలా కాకుండా బయటి కథలతో సినిమాలు చేశాను కాబట్టి అన్ని రకాల యాంగిల్స్‌లో సినిమాలు చేస్తానని పేరొచ్చింది.

★ ఈమధ్య ప్రతి సినిమాకు కాపీ కథలంటూ రబస జరుగుతుంది. దీని గురించి?

- సినిమా కథలు కాపీ అని రావడం ఇప్పుడు కొత్తకాదు. గతంలో కూడా వుంది. అయితే అప్పుడు సోషల్ మీడియా లేదుకాబట్టి జనాలకు తొందరగా తెలియలేదు. కాపీ కొట్టే కల్చర్ పాతదే. స్ఫూర్తిపొందడంలో తప్పులేదు కానీ ఉన్నది ఉన్నట్టు కాపీ కొట్టడం తప్పు. తెలుగులో కూడా మంచి కథలు వస్తున్నాయి. వాటి సంఖ్య ఇంకా పెరగాల్సి వుంది.

★ మల్టీస్టారర్ చేస్తారా?

- ప్రస్తుతానికైతే ఆ ఆలోచన లేదు. కొత్తవాళ్ళతో ఓ కాన్సెప్ట్ బేస్డ్ సినిమా చేయాలని వుంది. దానికి రెండేళ్లు పడుతుంది. అలాగే నిర్మాణ సంస్థను పెట్టే ఆలోచనలో కూడా ఉన్నాను.

★ ప్రస్తుతం ఇండస్ట్రీలో కథల కొరతలు ఉన్నాయని విన్పిస్తోంది?

- ప్రస్తుతం రచయితలుగా వస్తున్నవారందరూ దర్శకులవుతుండడంతో అలాంటి ఫీలింగ్ కలిగి ఉండవచ్చు. కొత్తవాళ్లు వస్తేనే పరిశ్రమకు బాగుంటుంది. కాకపోతే మంచి టాలెంట్ ఉన్నవాళ్ళకు అవకాశం రావడంలేదు. అవకాశం వచ్చినవాళ్లకు మంచి కథలు దొరకడంలేదు.

★ మరి ఎన్టీఆర్‌తో అదుర్స్-2 ఎప్పుడు?

- ఇప్పటికే అదుర్స్-2 కోసం రెండు మూడుసార్లు కథాచర్చలు జరిగాయి. కానీ అంత సంతృప్తిగా అన్పించలేదు. మంచి కథకోసం చూస్తున్నా. తప్పకుండా ఈ సినిమా వుంటుంది.

★ పవన్‌కళ్యాణ్ సినిమాలు చేయాలని అన్నారు. ఆయన కోసం సినిమా చేస్తారా?

- పవన్‌కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా వున్నా కూడా ఆయన మధ్యలో సినిమాలు చేయాలని కోరుకున్నాను. ఆయనతో సినిమా ఆలోచన ఇప్పట్లో లేదు.

★ మహేష్‌తో సినిమా ఏమైంది?

- మహేష్ కోసం సినిమా చేయాలి. కథల విషయంలోనే సమస్య వస్తోంది. ఇదివరకే ఓసారి ప్రయత్నం చేశాను. కానీ ఆ కథ మహేష్‌కి చెప్పి ఒప్పించలేకపోయాను. ఈ సారి తప్పకుండా మంచి కథతో వెళ్తా.

★ తదుపరి చిత్రాలు?

- నాకు ఏదైనా ముందుగా ప్లాన్ చేసుకోవడం తెలియదు. ఇప్పటికీ నా నెక్స్ట్ సినిమా ఏంటనేది నాకే తెలియదు.

- శ్రీనివాస్ ఆర్.రావ్